న్యూ ఆవకాయ.కామ్
సిసలైన సాహితీ భోజనమ్

పల్నాటి వీరభారతమ్
- శ్రీ చిట్టిబాబు

# పల్నాటి వీరభారతం-ముందుమాటలు

## ప్రచురణ కర్తల మాటల్లో రచయిత పరిచయం:



రచన ఒక వరంగా, వాక్య నిర్మాణం ఒక అద్భుత శిల్పంగా భావించే అరుదైన రచయితల్లో చిట్టిబాబు ఒకరు. పేరులోనే పెన్నిధి వున్న కథకుల్లో వీరిని చేర్చాలి. మాటల్ని ఎక్కడ పొందికగా, మధురనిష్యందంగా ఉపయోగించాలో , ఎక్కడ పాఠకుల్ని తమ "గ్రిప్ "లోకి తెచ్చుకోవాలో తెలిసిన రచయితల్లో ఒకర్నిగా ఈయనను చెప్పాలి.

దాగిన కన్నీరు, కథ కంచికి, వెలిగే దీపం, వీనస్ , కాలవాహిని, పూచినపున్నాగ, చిత్రమైన జీవితం, పాతకొమ్మ-కొత్తరెమ్మ, మరోమలుపు, మురళీరవళి, అచ్చుతప్పులు, అసమగ్ర చిత్రాలు, ఎక్కలేని రైలు, మనిషి జీవితంలోని మరపురని అనుభవాలు, జీవన సంధ్య మొదలైనవి వీరి ప్రచురితమైన నవలలు. వీరి నాటకం "ఒరేయ్ " తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్నది.

మధ్యరకం సంసారాల కథల్లో నిజాల్నీ వారి మధ్య చిత్రమైన అనురాగాల్నీ, రంగులపటంలా కళ్ళ ముందు వేలాడేసే కథావిధానం, పరుగెత్తే సెలయేరులాంటి రచనతో పాటు మమకారపు దు:ఖాంతాల కథల్లో వీరు స్థితప్రజ్ఞులు.

పల్నాటి వీరభారతం పల్నాటి వీరుల పౌరుష గాధ. సమగ్రమైన తొలి పల్నాటి తెలుగు నవల.

**----బుక్ ట్రస్ట్ బ్యూరో, గాంధీనగరం, విజయవాడ – ప్రచురణకర్తలు**

## రచయిత మాటల్లో - పల్నాటి వీరభారతం

### పల్నాటి వీర భారతానికి పదివాక్యాల పరిచయం

చరిత్రలను వీరుల రక్తంతోను, వీరవనితల కన్నీటితోనూ కలగలిపి రాస్తేనేం...అది వీరభారతమైనప్పుడు! పల్నాటి పౌరుషం తెలుగువాణ్ణి, తెలుగునాణ్ణీ పునీతం చేసి, తరతరాల తెలుగు సంస్కృతిలో వెలలేని విలువైన మణిదీపమైనప్పుడు.

నిజానికి, పల్నాటి రాళ్ళలోనూ, రప్పల్లోనూ పౌరుష ముండి తీరాలి. నాగులేటి నీళ్ళల్లో, నాపరాళ్ళల్లో వీరత్వం కనిపించకపోతే శ్రీనాథ కవిసార్వభౌముడి కవితాకన్య మృదుమధుర ద్విపదకవితారాగాన్ని పల్కించి వుండకపోవచ్చు.

ఐతే చరిత్ర చేసుకున్న మహాపాపమేమంటే; అది తన మహాప్రవాహంలో స్వచ్ఛమైన నీళ్ళతో పాటు చెత్తనీ, చెదారాన్నీ కలుపుకున్నది. కట్టుకథలు కావ్యాల్లో పుట్టిపెరిగి కొన్నిసార్లు రసాభాసగా తయారవుతాయి. అట్లాంటి కల్పితాలే లేకపోతే పల్నాటి చరిత్ర - వీరభారతమే.

జాతిని ఉద్దీపింపజేసేదీ, క్షాళితమైన హిందూరక్తంలో పవిత్రతతో పాటు వీరత్వాన్ని కలగజేసేదీ ఇటువంటి చరిత్రలే.

ఐతే పల్నాటి చరిత్రను ఎందుకు వ్రాయాల్సి వచ్చింది?

పల్నాటి చరిత్రను పరిశీలించి చూస్తే ప్రతిపాత్రా సజీవ వీరరసోద్దీపనా చిహ్నమే. తల్చుకుంటే ఒళ్ళు జలదరించే సంఘటనా సంఘటితమే.

బ్రహ్మన్నా, బాలచంద్రుడూ, కన్నమదాసూ, అలరాజు, వీరభద్రుడు ఇత్యాదులు మహావీరులైతే, మాంచాలా, పేరిందేవి, నాగమ్మా వీరవనితలైన తెలుగువాళ్ళ ఆడపడుచులు.

తెలుగునాట ఈ కథ మర్చిపోతే, తెలుగునోట ఈ కథ పలక్కపోతే - తెలుగులకు చరిత్రే లేదు. తెలుగులకు విలువే లేదు. ప్రతి జాతికీ ఒక వీరచరిత్ర కావాలి.

మాంచాలవంటి వీరపత్నులు రక్తసిందూరంతో భర్తల్ని యుద్ధరంగానికి పంపారు. ఇట్లాంటి కొంతమంది ధర్మపత్నులు రాసుకున్న వీరపారాణే జాతికి వెన్నెముక, దన్ను.

"నాయకీ నాగమ్మ - మగువ మాంచాల మా తోడబుట్టినవాళ్ళు!"
"నాగమ్మ తలగొట్టి నలగాముబట్టి మనసీమలో శాంతి వెలయింపజేయగా దీవించిపంపవే దేవి మాంచాలా!" - అని విన్నప్పుడు జలదరించిన శరీరంతో - ఈ నవల వ్రాయాలనుకున్నాను.

పారాణి పూసుకునే పవిత్రమైన పాదాలు కనిపించినప్పుడూ; పేరిందేవిలాంటి తెలుగు ఆడపడుచుల కన్నీటి కథల్లో కరిగిపోయినప్పుడూ - పల్నాటి నాగులేటి నీటిలో పారిన రక్తప్రవాహాల్తో ఈ తెలుగునేల తడిసి పునీతమై, గాలి - వీరగాథల్ని తెలుగునాడు వాడవాడలా మోసుకొచ్చినప్పుడు పల్నాటి కథలు ప్రజల గుండెల్లో నిండితీర్తాయి.

అందుకోసమైనా ఈ కథ వ్రాయాలి. అందుకే ఇది వ్రాసాను.

**-చిట్టిబాబు**

# పల్నాటి వీరభారతం

తెలి పులిపిరి తెరల మధ్య తెల్లవారీ ఆరకముందే, పక్షులన్నీ గూళ్ళనుంచి బైటికి వొచ్చీ రాకముందే - తేనెటీగలు పూవుల మీద ముసిరీ ముసరకముందే, "జిట్టగామాలపాడు" ఉత్తరాన వున్న బీళ్ళలో ఆరవల్లి రామిరెడ్డి అరక దున్నుతున్నాడు.

సూర్యుడు మబ్బుల మీద షికారుకు బైల్దేరినవేళ రామిరెడ్డి "చుట్ట" అంటించుకోవటానికి నిలబడ్డాడు. చేను నానుకుని, నాలుగ్గజాల దూరంలో, గట్టు మీద పెద్ద పాముపుట్ట ఉంది. రామిరెడ్డికి సుప్రభాతపు వెలుగు పర్చుకుంటున్నప్పడు "కేర్ ... కేర్ .." మనే ఏడుపు వినిపించింది.

అతను ఛటక్కున ఆగిపోయాడు.

అరక దున్నే దాపలిగిత్త "అంబా" అన్నది.

రామిరెడ్డి చుట్టుపక్కల కలయజూసాడు.

పచ్చటి వెలుగు వ్యాపించుకుంటున్న పల్లెల మీద పడి మెరుస్తున్న నీరెండ.

మళ్ళా "కేర్ ... కేర్ .."మన్న రోదన.

***********

రామిరెడ్డి అరక ఆపి, గట్టుకొచ్చాడు. పుట్ట పక్కన బుట్టలో ఏడుస్తున్న నెత్తురుగుడ్డుగా వున్న పిల్ల. చిన్ని నోరు తెర్చి, కాళ్ళూ, చేతులూ కొట్టుకుంటూ ఏడుస్తున్నది.

రామిరెడ్డికి ఆశ్చర్యంగా వున్నది.

చుట్టు ప్రక్కల ఎక్కడా నరసంచారం లేదు. ఐతే ఈ బుట్టలోకి ఎక్కణ్ణుంచి వచ్చిందీ పసిపాప?

రామిరెడ్డి ఛటుక్కున పిల్లకు ఉత్తరీయం ఒత్తుగా పెట్టి భుజానికెత్తుకుని ఊళ్ళోకివచ్చాడు.

పిల్లల్లేని తనకు "నాగదేవత" కరుణించి ఇచ్చిన ఈ పిల్లకి "నాగమాంబ" అని పేరు పెట్టాడు.

తను భుజాన వేసుకొచ్చిన ఈ చిన్ని కూన, మున్ముందుటి పల్నాటి చరిత్రలో రక్తపాతాలు చేయిస్తుందని రామిరెడ్డి కేమి తెలుసు?

**********

గురజాలను రాజధానిగా చేసుకుని అనుగురాజు పరిపాలిస్తున్నాడు. అతని తమ్ముడు బిరుదురాజు. అన్న మాట జవదాటని వ్యక్తి.

అనుగురాజుకు ముగ్గురు భార్యలు.

మొదటి భార్య వీరవిద్యాదేవి. "విజ్జలదేవీ" అని అనుగురాజు ఆవిణ్ణి ముద్దుగా పిలుస్తూండేవాడు.

రెండవ భార్య "భూరమాదేవి". ఆఖరి భార్య "మైలమాదేవి".

చందవోలు ప్రభువును యుద్ధంలో జయించిన అనుగురాజును పరిణయమాడిన మైలమాదేవి పల్నాటి సీమను ఆరణంగా తెచ్చుకున్నది.

మైలమాదేవిని అసమాన సౌందర్యవతిగా చెప్పుకుంటారు. ఐతే అనుగురాజు వైష్ణవుడు. అనుగురాజుకు కనకాద్రి చెన్నకేశవస్వామి ఇష్టదైవం.

కలలో కనిపించిన చెన్నకేశవుడు గురజాలను రాజధానిగా చేసుకోమని అనుగురాజుతో చెప్పాడని, అందువల్ల గురజాలే రాజధాని అయ్యిందనీ జనప్రతీతి.

ఏదిఏమైనా, అనుగురాజు ప్రజారంజకంగా ప్రజల్ని పరిపాలించి దేశాన్ని సుభిక్షం చేసాడు.

**********

ముగ్గురు భార్యల్లో చిన్నదైన మైలమాదేవికి పుట్టిన ఏకైక సంతానం నలగామరాజు జ్యేష్టుడై ఉండాలి. ఎందుకంటే, అనుగురాజు తర్వాత రాజ్యపాలనాధికారం అతనికే సంక్రమించింది.

ఇక మొదటిభార్యకు జన్మించిన ముగ్గురు కొడుకుల్లో పెదమల్లిదేవుడు పెద్దవాడైతే, పినమల్లిదేవుడు, బాలమల్లిదేవుడు ఆ తర్వాతివాళ్ళు.

రెండవభార్య శివభక్తురాలు. ఆవిడకు కామరాజు పెద్దకొడుకైతే, నరసింగ, జెట్టి, పెరుమాళ్ళురాజులు ఆ తర్వాతివాళ్ళు.

ప్రజారంజకుడైన ప్రభువూ, పతివ్రత ఐన ఇల్లాలు దేశ శుభానికి చిహ్నాలు.

అనుగురాజు దగ్గర ఉన్న సేనాని "వీర తెప్పలి నాయుడు". కత్తి పట్టుకుంటే కదనరంగాన ఎదురు లేదనిపించుకున్న మహావీరుడతను.

వీర తెప్పలి నాయనికి అజమాయిషీ క్రింద పల్నాటి పౌరులు శత్రుభయం లేకుండా నిశ్చింతగా

నిద్రపోయారు. వీరతెప్పలి నాయుడు చాలా రాజ్యాల్ని జయించాడు. అతని కత్తికి, పల్నాటి ప్రతిపత్తికి ఆనాడు ఎదురులేదు. ఆఖరుకు అతను చెక్కించిన శిలాశాసనాల్లో --

> **అవని రాజులెల్ల అతివలే -**
> **అనుగురాజొక్కడే పురుషుడనగ నొప్ప"**

- అని ఉండేది.

అనుగురాజుకు ముఖ్యమంత్రి "దొడ్డనాయుడు". దొడ్డవాడే గాక దొడ్డ ఆలోచనలు గలవాడు.

అతనికి "పెద్దన్న నాయుడు", "బ్రహ్మన్న నాయుడు" అని ఇద్దరు కొడుకులు.

అందులో చిన్నవాడైన బ్రహ్మనాయుడు అఖండమైన తేజస్సుగలవాడు. విశాలమైన బాహువులతో, చురుకైన కళ్ళతో పదునుపెట్టిన పల్నాటి వీరఖడ్గంలా ఉండేవాడు.

దొడ్డనాయుడికి తన చిన్నకొడుకు బ్రహ్మనాయుడి మీద చాలా ఆశలుండేవి.

పల్నాటి చరిత్రలో అతగాడు వహించవలసిన ప్రముఖ పాత్ర చాల ఉన్నదని, దొడ్డనాయుడు బ్రహ్మనాయని చిన్ననాటే పసిగట్టాడు.

పల్నాటి చరిత్ర కాలచక్రంలో పదిహేనేళ్ళు తిరిగిపోయాయి.

రాజవిలాసాల్లో ముఖ్యమైనది - వేట. ఒకసారి అనుగురాజు తన పరివారాన్ని వెంటబెట్టుకుని కారాటవికి వేటకెళ్ళాడు.

పగలల్లా వేటాడి అలిసిపోయిన శరీరం పులిసిపోయింది. జవనాశ్వాలు సొలితో రొప్పుతూ జిట్టగామాలపడు, నాగులేటి ఒడ్డుకొచ్చాయి.

ఇప్పుడు "అనుగురాజు"కు కావల్సింది కాసేపు విశ్రాంతి, మనుష్య సంచారం తక్కువైన ఈ ప్రాంతంలో తనకోసం చలువ పందిళ్ళు వేసి, విశ్రాంతికి విడిది చూపించినవాళ్ళెవరో అనుగురాజుకు అర్థం కాలేదు. పరివారమూ, అశ్వాలూ విశ్రాంతి తీసుకుంటున్నాయి.

అప్పటికి నాగమాంబకు పద్దెనిమిదేళ్ళు. వేదవేదాంగాలు చదువుకున్న నాగమాంబ మేనమామ సింగారెడ్డిని పదమూడో ఏట పెళ్ళి చేసుకున్నది. కానీ కాలం కాటంది, సింగారెడ్డి పెళ్ళైన సంవత్సరానికే కన్నుమూస్తే - నాగమాంబ బాలవితంతువైంది. పంటరెడ్ల కుటుంబంలో పుట్టిన నాగమాంబ శివభక్తురాలు. భర్త పోయాక నాగమాంబ "నాగమ్మ" అయింది.

తనకు ఇన్ని సపర్యలు చేసిన మనిషి "స్త్రీ"అనీ, శివభక్తురాలనీ, వేదవేదాంగాల్లో నిష్ణాతురాలైన "నాగమ్మ"యనీ తెలుసుకున్న అల్పసంతోషి అనుగురాజు చాలా సంతోషపడి...

"నీ సపర్యలకు మెచ్చాను నాగమాంబా! నీకేం కావాలో కోరుకో" అన్నాడు.

నాగమ్మ సవినయంగా చేతులు జోడించి--

"ప్రభూ! అన్నీ వున్న నాకు చిన్న కోరికున్నది. ప్రభులు అన్యధా భావించకపోతే సెలవిస్తాను" అన్నది.

**********

"అలాగే"

"ఏమీలేదు ప్రభూ, చాలా చిన్న కోరిక. పల్నాటి ప్రభువుల రాజ్యంలో ఏడు గడియల కాలం మంత్రిణిగా ఉండాలని ఉన్నది."

"అవశ్యం" అన్నాడు అనుగురాజు.

రాచమర్యాదల్లో ముఖ్యమైనది "ఆడిన మాట తప్పకపోవటం". పల్నాటి ప్రభులు కత్తికి కుత్తుకనైనా ఎదురొడ్డుతారుగానీ, అన్న మాట జవదాటరు.

అట్లా నాగమాంబ అనుగురాజు దగ్గర ఏడు గడియల మంత్రిత్వానికి అధికారాన్ని పొందింది.

***********

పల్నాటి సీమలో ఉన్న ముఖ్యమైన రెండు మతాలు - వైష్ణవ, శైవ మతాలు.

బ్రహ్మనాయుడు వీరవైష్ణవుడైతే, నాగమ్మ వీరశైవురాలు. బ్రహ్మన్న వ్యక్తిత్వం విభిన్నమైనది. అతని సిద్ధాంతాలు విశ్వశ్రేయస్సుకు ప్రతిరూపాలు. కులమతాలు పాటించక "చాపకూటి" సిద్ధాంతాన్ని పల్నాట ప్రతిబింబించాడు. ఆచారాలు మనుష్యుల్ని సరైన మార్గాన నడిపించకపోతే, అధికుల్నీ - అధముల్నీ సృష్టిస్తే - అవి లేకపోవడమే శ్రేయస్కరమని బ్రహ్మన్న సిద్ధాంతం.

**********

ఆచారాలు మనుష్యుల్నీ, బ్రతుకుల్నీ నరకప్రాయం చేస్తే అది వెలిగే దీపంతో ఇల్లు కాల్చుకున్నట్టు.

ఈ మతాలు మనుష్యుల మనుగడకు ప్రతిబంధంకంగా ఉన్నాయనీ, మనుష్యుల్లో ఎక్కువ, తక్కువలు సృష్టిస్తున్నాయనీ ఆలోచించిన బ్రహ్మనాయుడు అన్ని మతాల్నీ ఒకచోట సమీకరించి వర్గరాహిత్యాన్ని ఏర్పరిచాడు; కాదా సాధ్యమైనంతవరకూ ప్రయత్నించాడు.

ఐతే, ఈ సిద్ధాంతం వీరశైవులకు నచ్చలేదు. వర్ణసంకరం జరుగుతున్నదనీ, పుట్టుకతో వచ్చిన కులమతాల్నీ, హెచ్చుతగ్గుల్నీ మార్చే అధికారం బ్రహ్మన్నకు లేదనీ నిర్ధారించారు.

అంతేగాక తన ప్రాబల్యంతో బ్రహ్మన్న శైవమతాన్ని అణగద్రొక్కుతున్నాడనీ, శైవులకు అన్యాయం జరుగుతున్నదనీ సిద్ధీకరించారు.

శైవులంతా కట్టగట్టుకుని నాగమాంబ దగ్గరకు వెళ్ళి శైవానికి జరుగుతున్న అన్యాయమూ - పట్టబోతున్న దుర్గతిని గురించి చర్చించారు. (*శైవుడైన శ్రీనాథ కవిసార్వభౌముడు బ్రహ్మన్నకు మతానికి చెందిన మూఢత్వాన్ని గానీ, పాపాన్ని గానీ అంటగట్టలేదు*)

అదీగాక నాగమాంబకు బ్రహ్మన్న మీద ఒకవిధమైన పగ ఉన్నది. బ్రహ్మనాయుడే తన తండ్రి హత్యకు కారణమని ఆవిడ సిద్ధాంతం (నిజానిజాలు చరిత్రల్లో ఎన్నడూ నిర్ధారించబడనివి). జిట్టగామాలపాడులో చెరువు త్రవ్వి, చెరువు కింద మెట్టభూములను మాగాణులుగా చేయాలని బ్రహ్మన్న సంకల్పం. అట్లా చెరువు తవ్వకానికి నిర్ణయించబడిన స్థలంలో రామిరెడ్డి పొలం కూడా ఉన్నది. తన భూమిని చెరువుకు ఇవ్వటానికి నిరాకరించిన రామిరెడ్డి, బ్రహ్మన్నపై కయ్యానికి కాలుదువ్వి, బ్రహ్మన్న సైన్యం చేతిలో మరణించాడు. నాగమాంబ అనాడు బ్రహ్మన్నను పదవీచ్యుతుణ్ణి చేస్తానని, సాధిస్తాననీ ప్రతినబూనింది.

**********

ఈ విషయం తెలిసిన బ్రహ్మనాయుడు నాగమ్మను సాధ్యమైనంతవరకూ రాజసభాప్రవేశం లేకుండా నిరోధించాడు. కానీ, అనుగురాజు దగ్గర ఏడుగడియల కాలం మంత్రిత్వానికి అనుమతిపత్రం పొందిన సంగతి బ్రహ్మనాయునికి తెలియదు.

(అసలు బ్రహ్మన్న మీద నాగమాంబ విద్వేషానికి ఈ కారణాలే గాక, బలవత్తరమైన మరో *ఊహించరాని కారణం* ఉన్నదనీ, అది ఇతమిద్ధంగా నిర్ణయించడం కష్టమనీ మరోరకం చరిత్రకారులు ఊహిస్తున్నారు. ఐతే చరిత్రలో నిల్చిన కథతో తప్ప, ఊహాగానాలు ఊరికే చచ్చిపోతాయి. ఇదీ అంతే అయ్యుండాలి)

ఏది ఏమైనా బ్రహ్మనాయుడి మీద నాగమ్మకు విద్వేషముందని చెప్పడానికి "మతాన్ని" ముఖ్యకారణంగా అభిభాషించవచ్చు.

రహ్మనాయుని భార్య ఐతాంబ. మహాసాధ్వి. ఐతాంబలాంటి స్త్రీలు బాలచంద్రుడిలాంటి మహావీరుల్ని కనకపోతే, తెలుగుల చరిత్రలో విలువైన, వెలలేని వీరసాహిత్యం లభించకపోయివుండేదేమో?

ఎంతకాలానికీ పిల్లల్లేని బ్రహ్మనాయుడి భార్య, చెన్నకేశవుణ్ణి మొక్కుకుని, గజనిమ్మపళ్ళ వ్రతం చేస్తే - లేకలేక

కల్గిన బిడ్డడు బాలచంద్రుడు.

చరిత్ర నమ్మలేని కొన్ని కథల్ని ఇక్కడ ఉటంకించడం అవసరమని భావించాలి.

నిజానికి బాలచంద్రుడు పుట్టిన క్షణాలు మంచివిగావని పల్నాటి నాగులేరు పొంగి, పల్నాటినంతా ముంచెత్తిందట.

బ్రహ్మనాయుడు దైవజ్ఞులను పిల్చి, కొడుకు జాతకాన్ని పరిశీలింపజేసాడు. దైవజ్ఞులు చెప్పిన సారాంశమిది - "పుట్టినవడు పెరిగి పెద్దవాడైతే, పల్నాటి చరిత్రలో రక్తపుటేరులు పారుతాయనీ, ఐనా ఇతగాడు మహావీరుడనీ" నిర్ధారించారు.

పుట్టిన బిడ్డడు పల్నాటినంతా వేడుకల్లో ముంచెత్తుతుంటే, పిల్లవాడి తండ్రి ఏకాంతమందిరంలో, ఆలోచనల్తో విలవిల్లాడిపోతున్నాడు.

ఎన్నో నోములు నోయగా లేకలేక కల్గిన బిడ్డ. కానీ ఈ పుట్టిన బిడ్డ పల్నాటినాట రక్తప్రవాహాన్ని సృష్టిస్తాడట.

పల్నాటి సౌభాగ్యానికి - పితృప్రేమకు మధ్య చిక్కిన బ్రహ్మనాయుడి ఆత్మ తలకిందులవుతున్నది.

- పల్నాడా? కన్నబిడ్డడా?

**********

రాత్రి రెండు ఝాములు గడిచినా, బ్రహ్మనాయుడికి ఆలోచన ఒకమార్గాన పడలేదు. పక్షిపిల్లల్ని తిన్న గుడ్లగూబ ఎక్కడో, దూరంగా కూసింది.

బ్రహ్మనాయుడు ఉలిక్కిపడ్డాడు.

ఏకాంతమందిరపు ఉత్తరపు కిటికీలోంచి చూస్తే, పల్నాటి ప్రజ నిద్రాదేవి రొమ్మున ఒదిగి, నిశ్శబ్దంగా నిద్రపోతున్నది. నాలులేరు ఆశీర్వదిస్తున్నట్టు వెన్నెల వర్షంలో స్నానం చేసిన పెద్ద ముత్తైదువులా ఉంటే, చల్లటిగాలి మెల్లగా వీస్తున్నది. ఉయ్యాలలో బిడ్డడు నిద్రిస్తున్నాడు.

ఐతాంబ మీద మాగన్ను నిద్రలో, తల్లినయ్యానన్న తృప్తితో, వెలుగుతున్న చిర్నవ్వు పెదవుల్తో - పట్టెమంచం మీద పడుకుని ఉన్నది.

ఏం చెయ్యాలో నిర్ణయించుకోలేకపోతున్నాడు మహామంత్రి బ్రహ్మనాయుడు.

నాగులేరు తెల్లగా ప్రవహిస్తున్నది; కానీ బ్రహ్మనాయుడి కళ్ళకి అది రక్తంతో కలిసి ఎర్రగా ప్రవహిస్తున్నట్టంపించింది.

బ్రహ్మనాయుడు స్థిరనిశ్చయంతో -"చెన్నకేశవా!" అన్నాడు.

నిట్టూర్పు గుండె లోపల్నుంచి సుడులు తిరుగుతూ బైటికొచ్చింది.

"ప్రభూ! నా ఒక్క బిడ్డకోసం ఇంతమంది నా బిడ్డల్ని నిశ్చింతగా గుండెల మీద చేతులేసుకుని నిద్రపోతున్న అమాయకుల్ని యుద్ధరంగంలో బలిపెట్టుకోలేను. నా ప్రజల సౌఖ్యమే నా సౌఖ్యం. నా నమ్మిన సిద్ధాంతం నా విశ్వాసం, నా కడుపున పుట్టినవాడితో కళంకితం చేసుకోలేను. గతి తప్పిన నా మనస్సును అదుపులో పెట్టుకుంటున్నాను. శిశుహత్యా మహాపాతకం చుట్టుకోనివ్వు - అదీ కన్నకొడుకును - లేకలేక నీ వరంతో పుట్టిన నా ఏకైక పసికందును, పల్నాటి ప్రజాశ్రేయస్సుకై దూరం చేసుకుంటున్నాను. నా భార్యకు ఆత్మధైర్యం కలిగించు."

బ్రహ్మనాయుడు బైటికొచ్చాడు. విశాలసౌధం దాదాపు రాత్రి సగం దీపపు వెల్తురులో నిశ్శబ్దంగా తన ఇష్ట పరివార సఖీ సఖ జనంతో విశ్రాంతి తీసుకుంటున్నది. దివాణంలో మూడుగంటలు కొట్టారు.

"ఎవర్రా అక్కడ?"

"ఆజ్ఞ..మంత్రివర్యా" అన్నాడు రాత్రి కాపలా సైనికుడు.

బ్రహ్మనాయుడు ఆత్మను అదుపులోపెట్టుకుని - "ఆ ఉయ్యాలలో వున్న బిడ్డను ఇటు పట్టుకురా" అన్నాడు.

"చిత్తం!"

"ఏమీ అలికిడి కాగూడదు; ఎవరూ కన్ను తెరవకూడదు."

"చిత్తం!"

**********

మరి రెండుక్షణాల్లో ఉయ్యాల్లో వున్న బాలచంద్రుణ్ణి, సేవకుడు పొత్తిళ్ళ గుడ్డలతో సహా జాగ్రత్తగా పట్టుకొచ్చాడు.

బిడ్డవంక చూస్తున్న బ్రహ్మనాయుడి కళ్ళల్లో రెండు కన్నీటి చుక్కలు నిల్చాయి. ఆ తర్వాత బ్రహ్మనాయుడు నెమ్మదిగా, గంభీరంగా ఇట్లా అన్నాడు.

"ఈ బిడ్డను అడవిలో దూరంగా తీసుకెళ్ళి వదిలేయ్ !"

"ప్రభూ..." సేవకుడి చెయ్యి వణికింది.

"మహామంత్రి బ్రహ్మనాయుడు శాసిస్తున్నాడు. చెప్పింది చెయ్యి. మరెవ్వరికంటా పడకూడదు. ఈ భయంకర రహస్యం నీలో, నాలో వుండిపోవాలి. ప్రజాశ్రేయస్సే లక్ష్యమనుకునేవారు - ప్రభువుల మాటలను, చేతలను తమలోనే ఉంచుకుంటారు. అర్థమయిందా?"

"చిత్తం మహామంత్రి!"

"ఇక పోవచ్చు!"

ఐతే ఇదే క్షణాన, మంచం మీద పరున్న ఐతాంబ సోదరుడు గండు కన్నమ్మకు నిద్రలో ఛటక్కున మెలుకువ వచ్చింది. కళ్ళు తెరిచాడు. ఇద్దరు మగవాళ్ళ గొంతులు గుసగుసలాడుకుంటున్నాయి.

రాతిస్తంభం చాటుకొచ్చి, ఒక లిప్తకాలం అక్కడే నిలబడ్డాడు. ఆజ్ఞ ఇచ్చిన బ్రహ్మనాయుడు తన విశ్రాంతిమందిరానికి పోయాక అతను సౌధంలోంచి బైటికొచ్చాడు.

ముందుపోతున్న గుర్రాన్ని అనుసరించాడు.

అప్పటిదాకా మసకవెన్నెల్లో మసలిన పల్నాడు మేఘాలతో అల్లుకుపోయి, చిరుజల్లుల్లో తడుస్తోంది.

గండు కన్నమ మొదటి గుర్రాన్ని పట్టుకునేటప్పటికి వర్షం బలం పుంజుకుని ఏకధారగా కురుస్తున్నది.

కన్నమను చూసి సేవకుడు భయపడిపోయి - "ప్రభూ..." అన్నాడు.

"ఏమిటిది?"

"బ్రహ్మనాయుడు ఈ బిడ్డను చంపిరమ్మని చెప్పారు" అన్నాడు భయంతో వణుకుతూ.

"ఐతే నువ్వుపోయి, ఈ బిడ్డను నరికానని మహామంత్రితో చెప్పు. ఇంకేమన్నా చెప్పావా, నీ తల తెగి నేలబడుతుంది"

"అట్లాగే!" అన్నాడు సేవకుడు సంతోషంగా.

ఈ రెక్కలు రాని చిన్నిగుడ్డును ఎలా నరకనా? అని వాడు మహా మధనపడిపోయాడు.

**********

వర్షంలో తడిసిన బిడ్డ చలితో వొణుకుతూ, కేర్ మని ఏడుస్తున్నాడు. ఇంత మహాపాపానికి తన బావ బ్రహ్మనాయుడు ఎందుకు ఒడిగట్టాడో గండుకన్నమకు అర్థం కాలేదు. అతను బిడ్డను వక్షం మీద వేసుకుని గొల్ల చంద్రమ్మ ఇంటికొచ్చేసరికి దివాణంలో నాలుగు గంటలు కొట్టారు.

"చంద్రమ్మా - చంద్రమ్మా"

చంద్రమ్మ నిద్రనుంచి ఉలుక్కిపదింది - "ఎవరూ?" అంది.

"నేను - గండు కన్నమను; వర్షం వస్తోంది. తలుపు తీయి" అన్నాడు.

పల్నాటి ప్రభువుల పేర్లన్నీ చంద్రమ్మకు తెలుసు. పల్నాటి సైనికుడిగా, యుద్ధంలో వీరమరణం పొందాడు చంద్రమ్మ భర్త. ప్రభువులకు నమ్మకమైనవాడు.

చంద్రమ్మ తలుపు తీసి - "మీరా ప్రభూ...ఇంత వానలో...ఇప్పుడు...ఇట్లా..." అన్నది.

"ఆ(!"

"ఈ పసికూన ఎవరు?"

"ఈ ప్రశ్న నన్నడక్కు. కాలం వొచ్చినప్పుడు నేనే చెబుతాను. బిడ్డల్లేని నీకు ఈ బిడ్డను ఇస్తున్నాను. ఈ పసికూనను పెంచే భారం నీది. ఈ బిడ్డ రక్షణకూ, పెంపకానికీ కావలసిన అన్ని సహాయాలు నీ కందజేస్తాను. వీరుడిగా పెంచాలి! ఈ బిడ్డ గురించి మరే వివరాలూ ఎవరికీ తెలియకూడదు. జాగ్రత్త"

"ఈ బిడ్డను నా బిడ్డలాగే పెంచుతాను."

"మంచిది!"

వీర గండు కన్నమ వెనక్కి తిరిగితే, యాదవ చంద్రమ్మ బిడ్డను అంతులేని తమితో రొమ్ము కదుముకున్నది.

అనుగురాజు తర్వాత పల్నాటి ప్రభువైన నలగామరాజు కూతురు పేరిందేవి. నలగామరాజుకు పేరిందేవి ఏకైక సంతానం. పల్నాటికంతా అందమైన పిల్ల. నాయనమ్మ మైలమాదేవి దగ్గర ఆ పిల్లకు గారాబమైతే, చిన్నాన్న నరసింగరాజు పేరిందేవిని కంటికి రెప్పల్లే చూసుకుంటాడు. (నలగామరాజు భార్య మరణించి ఉండాలి. పేరిందేవి తల్లిని గురించి, పల్నాటి చరిత్రలో ఎక్కడా, ఎవరూ ఉటంకించలేదు. నిజానికి నలగాముని భార్య మరణిస్తే అది చాలా విచారించాల్సిన విషయమే. ఇవ్వాళ ఆవిడ పేరిందేవి ముద్దు పలుకులు వింటానిక్కానీ, ముద్దు చేష్టల్ని చూడ్డానిగ్గానీ లేదు.) ఇప్పుడు పేరిందేవికి ఆరేళ్ళు. ఇల్లంతా కళకళలాడుతూ తిరుగుతూ ఉంటుంది. నిజానికి పేరిందేవికి తండ్రి దగ్గరకన్నా చిన్నాన్న నరసింగరాజుకు మాలిమి ఎక్కువ. నలగాముడు తన కూతురు పేరిందేవిని, తన బావమరిది కొమ్మరాజు కొడుకు అలరాజు కివ్వాలని అనుకుంటూ ఉండేవాడు. మైలమాదేవి

నవ్వుతూ - "పేరిందేవీ! మీ బావ అలరాజును చేసుకుంటావా?" అంటే - చక్రాల్లాంటి కళ్ళని తిప్పుతూ "ఓ...చేసుకుంతాను" అనేది పేరిందేవి.

**********

అలరాజుకు అప్పటికి పదేళ్ళు. చదువులో, కత్తిపట్టటంలో, గుర్రపుస్వారీలో మాహాయోధుడనిపించుకునేంత నైపుణ్యం సంపాయించాడు. పుట్టగానే పరిమళించే పువ్వుకు విలువెక్కువ కదా? - అలరాజు నెలరాజులాంటివాడు. నెలరాజు కళలు పెరుగుతున్నట్లు అలరాజు ధైర్యసాహసాలు పెరుగుతూ వచ్చాయి.

సింహానికి పంజా వొడుపు - వీరుడికి విల్లంబు విడుపూ ఎవరూ నేర్పనక్కర్లేదు.

అలరాజును చూసుకుని, వీరుడైన కొమ్మరాజు మీసం దువ్వుకుంటూండేవాడు.

పేరిందేవిని కొమ్మరాజు కోడలిగా అంతఃపురంలో చెప్పుకునేవాళ్ళు.

నలగాముడు పేరిందేవిని ఎత్తుకుని - "కొమ్మరాజు కోడలా" అంటే ఆరేళ్ళ పేరిందేవి తండ్రి గుండెల మీద వాలి, సిగ్గుతో నవ్వి "ఊ!" అనేది.

కాలచక్రంలో మరో పదేళ్ళు ముందుకు సాగింది.

*********

తన తమ్ములతో నలగామరాజు ప్రజారంజకంగా పరిపాలన చేస్తున్నడు.

ఒక ఉదయం నలగాముడు రాజసభలో ఉన్నాడు. మంత్రి బ్రహ్మనాయుడు రాచకార్యం నిమిత్తం పొరుగూరికి వెళ్ళాడు.

దూత వొకడు సవినయంగా నమస్కరించి "తమ దర్శనార్థం జిట్టగామాలపాడు వాస్తవ్యురాలు ఆరవల్లి నాగమాంబ వచ్చియున్నారు. లోపలికి పంపమని తమరు ఆజ్ఞ ఇస్తే..."

"అవశ్యం" అన్నాడు నలగాముడు.

పరస్పర పరిచయాలయ్యాక -

"ప్రభూ...తమ తండ్రిగారైన అనుగురాజుగారు ఒకనాడు నాకు వ్రాసి ఇచ్చిన పత్రమిది. ఏలినవారు దీనిని చదివి తమ అభిప్రాయం విన్నవించగలరు" అన్నది.

"సోదరా...నరసింగరాజా! పత్రాన్ని చదివి వినిపించు"

నరసింగరాజు చదివాడు..

**********

మృగయా వినోదార్థం వేటకెళ్ళి - అలసిన ప్రభువులకూ, పరివారానికి నాగమ్మ చేసిన సేవలు అద్భుతములు. రాజభక్తిపరాయణురాలైన నాగమ్మకు, ఆమె కోరిన్నాడు పల్నాటి సీమను ఎవరు పరిపాలిస్తున్నా ఆమె అభ్యర్థించినట్లు, ఏడుగడియల కాలం మంత్రిత్వాన్ని మంజూరు చేస్తున్నాము. - అనుగురాజు, పల్నాటి ప్రభువు"

రాజముద్రతో, కన్నతండ్రి చేవ్రాలుతో వున్న పత్రాన్ని చూసిన నలగామరాజు తండ్రి వాగ్దానం ప్రకారం నాగమ్మను మంత్రిణిగా చేసాడు.

నాగమ్మ "నాయకురాలు"గా మారింది. చేతిలో కొచ్చిన అధికారాన్ని పదిలపర్చుకోవడం మొదలెట్టింది.

నాగమ్మలో ధైర్యమెక్కువ. కత్తి పట్టటం నేర్చుకున్న నాగమ్మ, రాజకీయరంగంలో మోసాన్ని బాగా ఆకళింపు చేసుకున్నది.

సదా గంభీరంగా చిరునవ్వు నవ్వే నాగమ్మ పెదవుల వెనుకవున్న కుటిలత భయంకరమైనది.

యుక్తి, కుయుక్తుల్లోనూ ఆవిడ స్థితప్రజ్ఞురాలు.

**********

నరసింగరాజు బోళామనిషి. బ్రహ్మనాయుణ్ణి సాధించాలనుకుంటే ఒకేఒక మార్గమున్నది. అది నమ్మకంతో గానీ, నయవంచనతోగానీ అతగాణ్ణి తన వైపుకు తిప్పుకోవటం.

బ్రహ్మనాయుణ్ణి సాధించాలంటే తను కోటలో పాగ వేయాలి. కాబట్టి నలగామరాజు మనసులో విషబీజం నాటాలి. బ్రహ్మన్నను గురజాలనుంచి, మంత్రిత్వం నుంచీ బహిష్కరింపజేయాలి. అలా కాకపోతే తను బ్రహ్మన్నను సాధించలేదు.

బ్రహ్మన్న మాటే వేదంగా చెలామణీ అవుతున్నది. నలగామరాజును తన మార్గానికి మల్చుకోవటం అనుకున్నంత తేలికకాదు. విజ్ఞులైనవరు మార్గాన్ని నిష్కంటకం చేసుకోవటానికి ఏదో పద్ధతి అవలంబించక మానరు. రాజకీయమెప్పుడూ కత్తి మీద సామే. రాజగౌరవమెప్పుడూ కుత్తుక మీది కత్తే.

నలగాముడు ఏకాంత మందిరంలో కూర్చున్నవేళ నాగమ్మ లోపలికొచ్చి - "ప్రభూ!" అన్నది.

"ఏమిటి?"

"ఏలినవారు ఏకాంత మందిరంలో అంతులేని ఆలోచనతో అలమటించిపోతున్నట్టున్నారు?"

"ఔను"

"అన్యధా భావించకపోతే అదేమిటో మేము తెలుసుకోవచ్చునా?"

"పల్నాటిలో దొంగల భయం జాస్తిగా వున్నది. పౌరులనుంచీ, గూఢచారులనుండీ వార్తలొస్తున్నాయి"

"ఐతే నేను ప్రభువులకు ఒక మాట విన్నవించుకుంటున్నాను."

"అట్లాగే.."

"బహుశా ఈ మాత మీరు నమ్మలేకపోవచ్చు"

"నలగాముడు న్యాయానికి ప్రాణమిస్తాడు."

"ఆ సంగతి ఈ సేవకురాలికి తెలుసు. ఈ దొంగతనాలు మహామంత్రి బ్రహ్మనాయుడు చేయిస్తున్నట్లు విశ్వాసపాత్రులైన వేగులనుంచి వార్తలు.."

"నాగమాంబా.." అన్నాడు నలగాముడు కోపంగా.

"తమకు ముందే విన్నవించాను; మీరు నమ్మలేరని. తన పలుకుబడి కోసం బ్రహ్మన్న చేయని దురంతమూ, దురాగతమూ లేదు. అన్ని కులాలనూ, ఆఖరుకు అంటరాని మనుష్యులనూ కలిపి, చాపకూటి సిద్ధాంతాన్ని లేవదీశాడు. వైష్ణవులు ఏం చేసినా కిమ్మనకుండా ఊరుకుంటున్నాడు. నలగముడు పరిపాలించే గురజాలలో పెత్తనం చెలాయిస్తున్నాడు. ప్రభువులు నిజం చెబితే నమ్మలేరు."

నలగాముడు నిశ్శబ్దంగా వూరుకున్నాడు.

***********

పల్నాటి ప్రభువులు రాజమందిరాల్లో పుచ్చుకునే ఖరీదైన పానీయంలాగా, "దుర్బోధ" అనే విషం నెమ్మదినెమ్మదిగా నలగాముని తలకెక్కటం మొదలుబెట్టింది.

కాసేపటికి నలగాముడు తల పైకెత్తి "ఇప్పుడు నన్నేం చేయమంటావు?"

"తమరు ఆనతిస్తే - సైనికబలంతో చోరాగ్రగణ్యులన్న వాళ్ళను వారం రోజుల్లో అణచివేయిస్తాను. అంతేకాదు, వైష్ణవులమని, బ్రహ్మనాయుని ముఖ్యానుచరులమని చెప్పుకునే కొంతమంది ఇళ్ళను తనిఖీ చేయిస్తే, ఇంతలేసి సిరిసంపదలను ఎలా సమీకరించుకున్నారో తేటతెల్లమవుతుంది."

ఇదే క్షణాన నరసింగరాజు లోపలికొచ్చాడు. నాగమ్మ మళ్ళీ కల్పించుకుని - "వీరుడైన నరసింగరాజు మా వెంటనే ఉండి పల్నాటిసీమలో బరితెగించినవాళ్ళను బలియిస్తాడు." అన్నది.

"ఇంతకూ కావలసినదేమిటి?"

"తమ అంగీకారం"

"అలాగే."

"నా మాట మన్నించిన ప్రభువులకు కృతజ్ఞతలు."

"ఇంతకూ సంగతేమిటి?" అన్న నరసింగరాజుతో.."విన్నవిస్తాను చిన్నరాజా" అన్నది నాగమాంబ.

*******

నలగామహారాజు దగ్గర అనుజ్ఞాపత్రాన్ని పొందిన నాగమ్మ దొంగలను వెదికి వెదికి పట్టుకుని కూల్చివేయించింది. ధనికులైన బ్రహ్మన్న మనుష్యుల ఇళ్ళల్లో దొరికిన ధనసంపదల్ని గురజాల ప్రభువుల ధనాగారాల్లో నింపించింది. ఈ చర్యలతో నలగాముడు చాలా సంతోషించాడు. (నాగమ్మ ఈ చర్య తర్వాతనే "నాయకురాలు" అన్న పేరు సార్థకమై ఉండితీరాలి)

నరసింగరాజును కీలుబొమ్మగా-నలగాముడికి ఆంతరంగిక స్నేహితురాలిగా, ముఖ్య సలహాదారిణిగా మారిన నాగమ్మ, పల్నాటి ప్రభువుల రాజధానిలో తిరుగులేని స్థానం సంపాదించుకున్నది. గురజాలలో కొత్తశకం ప్రారంభమయింది.

*******

రాచకార్యం నిమిత్తం పొరుగూరినుంచి పక్షం రోజుల తర్వాత వచ్చిన బ్రహ్మన్నకి - గురజాలలో కొత్తరకం రాజ శాసనాల చెలామణీ కనిపించింది.

స్వతహాగా గంభీరుడైన బ్రహ్మన్న, జరగరానిదేదో జరిగిపోయిందని గ్రహించాడు.

నాగమ్మ గురజాలకు మంత్రిణిగా ఉండటం మలిదేవాదులక్కూడా ఇష్టం లేదు. కానీ అగ్రజుడు - పల్నాటి ప్రభువూ ఐన నలగాముడితో ముఖాముఖీ ఈ విషయాన్ని చర్చించగల ధైర్యం వారికి లేదు. బ్రహ్మనాయుడు వచ్చేవరకూ ఎదురుతెన్నులు చూడటం మినహా, మలిదేవాదులు చేయగల్గిందీ లేదు.

ఈ పదిహేనురోజుల కాలంలోనే ఇన్ని విపరీతమైన పరిణామాలు జరుగుతాయని బ్రహ్మనాయుడు ఊహించలేకపోయాడు.

ఎవరినైతే, ఎక్కడికి చేరరాదని బ్రహ్మన్న అనుకున్నాడో వాళ్ళే అక్కడికి చేరారు. దిక్కుమాలిన ఉపాయాలకు పెట్టినపేరైన నాగమ్మ, ఎవరిని ఏం చేయాలో తెలిసిన ఆడదని బ్రహ్మనాయుడికి తెలుసు.

కొలువుకూటంలో ఉండగా - బ్రహ్మనాయుడు సభాప్రవేశం చేసి, నలగాముడికి నమస్కరించాడు.

నలగాముడి ముఖంలో ఆప్యాయత కనిపించలేదు, సరిగదా, ఆతని కనుబొమల్లో చిరాకును స్పష్టంగా చూడగల్గాడు బ్రహ్మన్న. ఏది ఎంతవరకు రావాలో అంతవరకూ వచ్చిందన్నమాట. తొండ ముదరకుండానే వూసరవెల్లి అయింది.

**********

"ప్రభువులు చిరాగ్గా ఉన్నట్టున్నారు?"

"ఆ..!"

"ఎందువల్లనో!"

"ప్రభువులను ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదు" అంది నాగమ్మ.

"అంటే..."

"రాజులు పసివారు కాదు; మంచి ఏదో, చెడ్డ ఏదో నిర్ణయించుకోగల విజ్ఞులైనారు. ఇతరుల సలహాలతో సంబంధం లేదు."

"ఇంతకూ నువ్వెవరు?"

"ఏకవచన సంబోధనం నీచ సంబోధనం అని గుర్తుంచుకోండి బ్రహ్మన్నా! రాజసభల్లో గౌరవంగా మాట్లాడడం మీ

విద్యుక్తధర్మం. కనీసమర్యాదలను కూడా మర్చిపోతున్నారు."

"అర్థమయ్యేట్టు చెప్పండి"

"ఇదే అర్థం కాకపోతే, మీరు మహామంత్రి పదవికి అర్హులేననుకుంటున్నారా?" అన్నది నాగమ్మ.

"నాగమ్మా!"

"బ్రహ్మనాయుడా! ఈవిడ మా మంత్రిణి" అని నరసింగరాజంటే-

"ఇకనుంచైనా ఆమెకు గౌరవమివ్వాల్సిన బాధ్యత మీకున్నది" అన్నాడు నలగాముడు.

"ప్రభువులు నన్ను అగౌరవపరుస్తున్నారు"

"ఈ స్థితిని మీరే తెచ్చుకున్నారు" అన్నది నాగమ్మ కుటిలంగా నవ్వి.

"విడమర్చి చెప్పటం విజ్ఞుల లక్షణం"

"అంతేనా? ఈ పల్నాటి దొంగలను రెచ్చగొట్టించి, దొంగతనాలు చేయించి, ప్రజాజీవితాలను అస్తవ్యస్తం చేసింది మీరు. మీ పేరు ప్రఖ్యాతలకోసం చాపకూటి సిద్ధాంతలను ఏర్పరిచి జాతులను భ్రష్టుల్ని చేసింది మీరు.

దాయాది బిడ్డలైన మలిదేవాదుల పక్షాన చేరి నలగామరాజులపై కక్షా కార్పణ్యాన్ని కల్గించిది మీరు. మీ గౌరవం కోసం "వైష్ణవాన్ని" భుజానవేసుకుని "శైవాన్ని" నాశనం చేస్తున్నది మీరు."

"నాగమ్మా! హద్దు మీరుతున్నారు"

"నిజాన్ని మీరు వినలేకపోతున్నారు" అన్నాడు నలగాముడు.

అంతే, పరిస్థితి ఇంత వక్రించిందని, ఇంత తక్కువకాలంలో పల్నాటి ప్రభువులను ఆరవల్లి నాగమ్మ తన వైపుకు తిప్పుకుంటుందని ఊహించలేని బ్రహ్మనాయుడు దిమ్మరపోయాడు.

"మీ పై అభియోగాలకు సమాధానమేమిటి?" అని నరసింగరాజంటే-"మౌనం అర్ధాంగీకారమే" అన్నది నాగమ్మ.

"ప్రభువులు నన్ను అవమానపరుస్తున్నారు"

"కాదు; నిజాల్ని వీక్షిస్తున్నాను" అన్నాడు నలగాముడు.

"గౌరవం లేనిచోట మంత్రిగా నేనుండలేను."

"మీ ఇష్టం" అన్నాడు నలగాముడు.

అనుగురాజు మరణించిన తర్వాత నలగాముణ్ణి కంటికి రెప్పలా చూసుకుని, రాజ్యాధికారాన్ని కల్గించి-మంచి ప్రభువుగా తయారుజేశాడు. అయితే కథ ఇప్పడు తారుమారయ్యింది. కాలనాగు విషం తలకెక్కిన నలగాముడు మంచిని ఏనాడో పోగొట్టుకున్నాడు.

"మీరు నన్ను శంకిస్తున్నారా?"

"అది మీకే తెలియాలి" అన్నది నాగమ్మ.

గండు కన్నమకూ - రేఖాంబకు వున్న ఒకే ఒక కూతురు "మాంచాల" - అపురూపంగా పెరిగింది. ఇటు పేరిందేవి ఎంత గారాల కూచో, అటు మాంచాలా అంతే గారాల కూచి.

పేరిందేవి అందం జాతిపూవు చందమైతే - మాంచాల అందం స్వచ్ఛ పౌర్ణమి చందబింబంలాంటిది.

అక్కడ, గొల్ల చంద్రమ్మ ఇంట్లో బాలచంద్రుడు కళల్ని పెంచుకుంటూ పెరిగే బాలచంద్రునిలా దినదిన ప్రవర్ధమానమౌతున్నాడు. కత్తి పట్టుకుంటే ఒళ్ళు ఝల్లుమనిపించే పరాక్రమమతనిది.

చంద్రమ్మ బాలచంద్రుణ్ణి కంటికి రెప్పల్లే పెంచింది. అమిత పరాక్రమోపేతుణ్ణిగా తయారు చేసింది.

**********

మనస్సులో ఒక భావానికి అంకురార్పణ జరగాలేగానీ ఇక అడ్డూ ఆపులుండవు. నాగమ్మ నలగాముని హృదయక్షేత్రంలో వేసిన విషబీజం పెరిగి పెద్దదై, శాఖోపశాఖలుగా విస్తరించింది.

నాగమ్మ మాటలను నమ్మిన నలగాముడు - మలిదేవాదుల మీద కూడా మత్సరాన్ని పెంచుకున్నాడు.

"నాగమ్మ చెప్పేదీనూ; నలగాముడు చేసేవాడూనూ? చెట్టు చెడే కాలానికి కాచే కుక్కపిందెకాయల్లాగా, ఆడదాని చేతుల్లో చిక్కి, కీలుబొమ్మలా తైతక్కలాడుతున్న నలగాముడి రాజ్యం నాలుగురోజులే - మలిదేవుడు రాజుగా, బ్రహ్మన్న మంత్రిగా రాజ్యపాలన చేసే రోజు దగ్గరలోనే వున్నదని" బ్రహ్మన్న అంటునట్లుగా నలగాముడికి వింపించింది నాగమ్మ.

ఆలోచనాశూన్యుడైన నలగాముడు ఈ మాటలను నమ్మి - మలిదేవాదులను సోదరులని జాలిదలచక చెరసాలలో వేయించాడు.

ఈ సంగతి తెలిసిన బ్రహ్మనాయుడు మహోదగ్రుడైనాడు. చెయ్యాల్సిన కార్యమేమిటో ఆయన క్షణాల్లో నిర్ణయించుకున్నాడు.

కులమతాలకు తక్కువ ప్రాధాన్యత ఇచ్చిన బ్రహ్మన్నకు కుడిభుజమైనవాడు, కడజాతిలో పుట్టిన వీర (మాల) "కన్నమదాసు". కన్నమ మహావీరుడు. పల్నాటి రక్తంలో పౌరుషముండితీరాలి.

నాగులేటి నీళ్ళల్లో శౌర్యం ప్రవహించి వుండాలి. కాకపోతే, పల్నాడు ఇంతమంది మహావీరులను కనివుండదు.

వీర కన్నమదాసు బ్రహ్మన్నకు కుడిభుజంగానే కాక కన్నకొడుకులాగా బ్రహ్మన్న దగ్గర పెరిగాడు.

"తండ్రీ - అర్థాంతరంగా ఎందుకో కబురు పంపారు" అన్నాడు.

"కన్నమా! నీ భుజం మీద మరో మహత్తరమైన కార్యాన్ని మోపబోతున్నాను. నాయకురాలి మాటలను విన్న పల్నాటి ప్రభువు నలగాముడు - పశువై, తన సోదరులనే మాటైనా జ్ఞప్తికి వుంచుకోక, తన పెదతల్లి విజ్జలదేవినీ, పెదమల్లి దేవుడిని, అతని ఇద్దరు సోదరులనూ చెరసాలలో వేయించాడు.

కాలం ఇచ్చే తీర్పులో ఈ నాగమ్మగానీ, నలగాముడుగానీ పొందే శిక్ష ఏమిటో ఇప్పుడిప్పుడే తెలియదు గానీ, నీవు నీ బలపరాక్రమంతో చెరసాలలో ఉన్న వాళ్ళను విడిపింపజేయాలి. తప్పదు" అన్నాడు.

"ప్రాణం పోయినా ఈ కార్యాన్ని నేను నిర్వహిస్తాను" అన్నాడు వీర కన్నమదాసు.

**********

రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో - చీమ చిటుక్కుమనని కృష్ణపక్షపు చీకటి రాత్రిలో, కాపలాదారులను వధించి - కోటకు కన్నం వేసి - ప్రభువులైన ముగ్గురన్నదమ్ముల్నీ, పెద్దరాణి వీరవిద్యాదేవిని విడుదల చేసి తీసుకొచ్చాడు, ఘనుడు కన్నమదాసు.

వీరవిద్యాదేవిని, మలిదేవాదులనూ సురక్షిత మార్గాన చేర్చాక, కన్నీరు పెట్టుకుంటున్న వీరవిద్యాదేవితో బ్రహ్మనాయుడు ఇట్లా అన్నాడు - "తల్లీ! మీరు కన్నీరు పెట్టుకోనవసరం లేదు. కలకంఠి కంట కన్నీరొలికిన చోట, కరువు కాటకాలొస్తాయంటారు. మీ బిడ్డల్ని రాజులుగ చేస్తాను. పల్నాడు రెండు ముక్క అయినా సరే - ఒక ముక్కను నీ బిడ్డల్లో పెద్దవాడైన పెదమల్లి దేవుడు రాజవుతాడు; ఇక మీరు నిశ్చింతగా వుండండి."

చెయగల్గింది లేక విజ్జెలదేవి -

"నీ ఇష్టం నాయనా బ్రహ్మన్నా! నీవు నా కొడుకులాంటివాడివే. నీ తమ్ములకు అన్యాయం కలక్కుండా చూడు."

బ్రహ్మన్న భారతం గుర్తుకొచ్చింది -

అరివీరభయంకరుడైన కర్ణుడి దగ్గరకు మేలిముసుగు వేసుకుని, పుత్రభిక్ష నర్థించటానికి వెళ్ళిన నిర్భాగ్యురాలైన కుంతి గుర్తుకొచ్చింది.

తన బిడ్డ కోసం యాచనకైనా సిద్ధపడని తల్లి, స్త్రీ అవుతుందేనోగానీ "అమ్మ" అవటానికి వీల్లేదు.

పెద్దభార్యగా రాణివాసానికొచ్చిన వీరవిద్యాదేవి కళ్ళ ముందే పల్నాటి చరిత్రలో దురూహ్యమైన మార్పులు వచ్చిపడ్డాయి.

**********

నలగాముడు రక్తసంబంధ మమకారాల్లేని కటిక కసాయిగా తయారయ్యాడు. "ప్రస్తుత కర్తవ్యమేమిటి నాయనా బ్రహ్మన్నా?" అన్నది వీరవిద్యాదేవి. "ఆలోచిస్తున్నాను" అన్నాడు బ్రహ్మన్న.

"కన్నమా.."

"చిత్తం తండ్రి"

"మన సైన్యాల్ని సమీకరించుకుని గురజాల మీద దండయాత్ర చెయ్యి. కావలసింది కాకమానదు. అర్ధరాజ్యం అడగడం ఒక్కటే మన ప్రస్తుత కర్తవ్యం. నలగాముడు ధర్మంగా, మన రాజ్యభాగాన్ని మనకిస్తాడా సరేసరి, కాదంటే ఆ తర్వాతి సంగతి కత్తులతోను, కాల్బలంతోనూ - యుద్ధక్షేత్రంలో తప్ప తేల్చుకోవటానికి వీలుండదు."

వీర కన్నమదాసు బ్రహ్మనాయుని ఆజ్ఞను పాలించి గురజాలను చుట్టుముట్టాడు.

*(కాని కొన్ని చరిత్రలలో తన బావమరిది కన్నమనాయుడునితో ఈ పనులన్నీ చేయించాడని వున్నది. ఈ రెండింటిలో ఏదైనా కావచ్చు. ఏమైనా అటు కన్నమనాయుడు గాని, ఇటు కన్నమదాసుగానీ, ఒకర్ని కరు మించిన సాహిసికులు; బలపరాక్రమ తేజోవిరాజితులు)*

బ్రహ్మనాయుడి బలగం, మలిదేవాదుల పక్షాన ఉండి, గురజాల మీద దండయాత్ర కొచ్చిందని తెలియగానే - నలగాముడు కలవరపడి, రాయబారానికి వెళ్ళిన కన్నమనాయుడితో ఇలా అన్నాడు -

"యుద్ధం ఎందుకు? బ్రహ్మనాయుడు కాకితో కబురు చేస్తే ఆయన మాట కాదంటానా? అన్నదమ్ముల మధ్య యుద్ధమేమిటి? సగం రాజ్యాన్ని నేను మలిదేవాదులకిస్తాను."

ఈ తంత్రాంగమూ - రాజ్య విభజనా నాయుకురాలు చేయించినదే. ఎందుకంటే, బ్రహ్మనాయు డితనికి దూరంగా వుండకపోతే, తన పంజరంలో చిక్కుకున్న నలగాముడు, ఏదో క్షణాన ఎగిరిపోవటానికి వీలున్నది. అదీగాక తను ఆడే ఆటలు చెల్లవు.రాజకీయ పరిజ్ఞానమూ - పదవీ స్థిరమనుకునేవాళ్ళు, ప్రజల జీవితాలతో

చెలగాటమాడుతారు. నాయకురాలి ప్రస్తుత పరిస్థితి అలాగే ఉన్నది.

నలగాముని మాటను మన్నించి బ్రహ్మనాయుడు మలిదేవాదుల పక్షాన, రాజ్యవిభాగం కోసం గురజాల బయలుదేరి వచ్చాడు. నలగాముడు బ్రహ్మన్నకు ఎదురేగి - మేళతాళాలతో తీసుకొచ్చి సపర్యలు చేసాడు. ఐతే ఈ రాజ్యపు పంపకాల్లో న్యాయం జరగలేదని బ్రహ్మనాయుడూ, అతని పక్షాన వున్న వీరులూ అభిప్రాయపడ్డారు. కానీ గంభీరుడైన బ్రహ్మనాయుడు, నలగాముని మాటలను మన్నించి తన రాజ్యభాగాన్ని పొంది వెనుదిరిగాడు.

గురజాలకు పశ్చిమంగా ప్రవహించే నది "చంద్రవంక" - నదుల్లో అందమైన పేరున్న చంద్రవంక పరమ పావనమైనదని పల్నాటి ప్రజలు అభిప్రాయపడతారు.

ఈ చంద్రవంక నదీ తటానే, బ్రహ్మనాయుడు వూరును వెలయింపజేసి "మాచెర్ల" అని పేరు పెట్టాడు. కొంతకాలం తర్వాత అది అన్ని హంగులునూ సంతరించుకుని, పట్టణంలా రూపుదిద్దుకుని - మలిదేవాదులకు రాజధానీ నగరమయింది.

అంతేకాదు - కులదైవమైన చెన్నకేశవుడికి మాచెర్లలో గుడి కట్టించాడు బ్రహ్మన్న.

నిజానికి బ్రహ్మనాయుడంత తెలిగివిగలవాడు, సాధువర్తనుడూ పల్నాటిసీమలో ప్రభవించనేలేదేమో! అందుకనే, మాచర్ల ప్రభువులకు మంత్రయిన బ్రహ్మన్న - వీరుల్నీ, పండితుల్నీ, శూరుల్నీ - ఏ తెగకా తెగగా విభజించి కట్నకానుకలతో సన్మానించాడు. చరిత్ర మొత్తాన్ని తిరగేస్తే, కుల మతాల విషయంలో, బ్రహ్మన్నంత విశాలమైన మనసు గలవాడు మరొకడు దొరకడు. అతను నిజమైన దేశసేవకుడు.

బ్రహ్మన్న మలిదేవాదులతో మాచెర్ల స్థిరపడటానికి రెండు, మూడేళ్ళు పట్టింది. వీరులైన కొంతమందితో తరలివచ్చిన బ్రహ్మనాయుడు చంద్రవంక నదికి, కొత్త రూపురేఖల్ని ఏర్పరిచాడు. మాచెర్లను కట్టటంతో, చంద్రవంకనది రాజమాతలాగా వున్నది.

**********

మాచెర్ల ప్రభువులకి కావల్సిన ప్రస్తుత కార్యం పెళ్ళి.

పెదమలిదేవుడికి అందమైన, కులవతియైన రాచకూతురుని ఇచ్చి చెయ్యాలన్నది వీరవిద్యాదేవి సంకల్పం.

మాచెర్లకు కూతవేటు దూరంలో వున్న "కళ్యాణపురం" రాజు వీరసోముడికి అపరంజి బొమ్మలాంటి అందమైన పిల్ల వున్నది. ఆ కుందరదన పేరు "శ్రీరమాదేవి".

*(శ్రీరమాదేవిగా రూపాంతరం చెంది వుండవచ్చునని నేను (రచయిత) భావిస్తున్నాను. పేర్లు రకరకాలుగా మార్పులను చెంది, కొంతకాలానికి ఒక పేరుతో స్థిరపడిపోతాయి)*

స్వతహాగా శైవుడైన వీరసోముడు - వైష్ణవుడయిన మలిదేవుడికి తన కూతుర్ని ఇవ్వటానికి ఒప్పకోక బ్రహ్మన్నతో విరోధం తెచ్చుకున్నాడు.

"పగవారిలో నగుపాలు చేయటం ప్రజ్ఞకాదు వీరసోమా! ఆడపిల్లను అడగటానికొస్తే నిరసిస్తావా? మా అవసరం వచ్చిన రోజున నీవే "దేహీ" అంటూ వస్తావు. చూసుకో" అని బ్రహ్మన్న వీరసోముడికి కబురుపెట్టాడు.

వీరసోముడు కొన్ని నిబంధనలకూ, కొన్ని కట్టుబాట్లకూ లోబడిన మనిషి. దాన్ని ఛాదస్త స్వభావంగా కూడా చెప్పకోవచ్చు.

కావలసిన కార్యం కానందుకు తిరిగి మాచెర్ల చేరాడు బ్రహ్మన్న.

********

*(పల్నాటి వీరచరిత్రలో మనస్సులను కదిలించే పవిత్ర ప్రేమకథ ఒకటున్నది. అయితే ఇది పల్నాటినాట ఎందుకు ప్రాముఖ్యత సంతరించుకోలేదో ఇప్పటికీ అంతుపట్టదు. ఆ కథను ఇక్కడ ఉటంకించాల్సిన అవసరంవుంది.)*

వీరసోముడికి అయిదుగురు తమ్ములు. వారిలో ఒకడయిన "నంది సోముడు" కూతురు "నాగులాదేవి". ఆ పిల్ల తన మేనత్త కొడుమైన "శివసింగు"ను ప్రేమించింది.

ఈ ప్రేమాయణం వీరసోముడికి గానీ, అతని తమ్ములకుగానీ ఇష్టం లేదు. దానికి ఇతమిత్థమైన కారణం దొరకదు. రాజ్యాధికారాలు, రాజుల మనస్తత్వాలూ భయంకరమైనవి. రాజచరిత్రల్లో "ప్రేమ" అనే రెండక్షరాల మాట రక్తపాతాలు చేయించిన సంఘటనలు కోకొల్లలు.

శివసింగు వుంటున్న చోటు "శివనండ్ల". నాగులాదేవీ, శివసింగు తరచూ రహస్యంగా కలుసుకుంటూ వుండేవారు. వీరసోముడు తన తమ్ముని కూతురు శివసింగుతో కలుకోవటానికి వీల్లేదని కట్టడి చేశాడు.

ప్రేమ ఎన్ని త్యాగాలనైనా చేయిస్తుంది. అది కోటలను ఎక్కిస్తుంది. కాపలాదారుల్ని నరికిస్తుంది. దొంగతనాలు చేయిస్తుంది.

శివసింగు కోట ఎక్కి వచ్చి, కాపలాదారుల కళ్ళల్లో కారం చల్లి, రాజాంత:పురంలోకి ప్రవేశించి, నాగులాదేవిని కలుసుకుంటూనే వుండేవాడు. నాగులాదేవి భయపడుతూ వుండేది.

"బావా! నాకు భయంగా వుంది. ఏదో ఒకనాడు మన అదృష్టం బాగుండక నీవు పట్టుబడితే, నిర్దయగా నా తండ్రులు నిన్ను వధిస్తారు. ఆనాడు నాకు ఆత్మహత్య మినహా మరో మార్గం లేదు."

"నన్నేం చెయ్యమంటావు నాగులా?"

"నన్ను ఇక్కణ్ణుంచి శివనండ్లకు తీసుకుపో!"

"ఎట్లా?"

"దానికి నేనొక పథకం వేశాను.

కాపలా సైనికులకు లంచం ఇచ్చి, అర్ధరాత్రిపూట నాగులాదేవి తన బావతో పారిపోయి వచ్చి శివనండ్లకు చేరింది.

ఈ ఉదంతం తెల్సిన వీరసోముడు, అతని సోదరులు ఉగ్రులై శివసింగుకు తమ కూతురును ఒప్పజెప్పవలసిందిగాను, చేసిన పనికి క్షమాపణలు చెప్పకోవల్సిందిగానూ కబురుపెట్టారు.

శివసింగు మేనమామలకు ఇట్లా కబురు పంపాడు:

"నాగులాదేవి నా భార్య. పెళ్ళయ్యాక ఆమె నా హక్కయింది. నాకు ఈ రాజ్యం మీద ఎంత హక్కుందో ఆమె మీదా అంతే. ఆమెను నేను పంపను. క్షమాపణ ఎందుకు చెప్పాలో అర్థం కావటం లేదు. ఆమె, నేను ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకున్నాం. మీరంతా ఏదైనా చెయ్యగలిగితే, మీ మనస్సుకు వచ్చిన విధంగా చెయ్యండి. జరగబోయేది జరక్క మానదు" అని.

**********

మూర్ఖులు, దురభిమానులూ ఐన తన సోదరులతో శివనండ్ల మీదకు వీరసోముడు దండెత్తి రావచ్చని ఊహించింది నాగులాదేవి.

"బావా!"

"నాగులా!"

"నా ఒక్కదాని కోసం శివనండ్లలో రక్తపుటేరులు ప్రవహింపజేయలేను. నన్ను కళ్యాణపురం పంపించు. ఎట్లా రాసివుంటే అట్లా జరుగుతుంది." అని కన్నీరు పెట్టుకుంది.

స్వతహాగా అభిమానధనుడైన శివసింగు నాగులాదేవి కన్నీరు తుడిచి "నాగులా! ఉంటే కలసివుందాం. చనిపోతే కలిసే పోదాం. వీరులైనవాళ్ళకు యుద్ధాలు తప్పవు. రాజులకు ఈ కలహాలు సర్వసామాన్యాలు. భార్యను నేను వదులుకోలేను. అలాగే రాజ్యాన్నీ వదులుకోలేను. ఈ కోటను జయించటం సామాన్యమైన విషయంగాదు. ఐనా కాలమే తుదితీర్పును ఇస్తుంది. నీవు నిశ్చింతగా వుండు".

*********

నాగులాదేవి ఊహించినట్టుగానే వీరసోముడు శివనండ్ల మీదకు దండెత్తివచ్చాడు.

కొన్ని ఏళ్ళపాటు ముట్టడి వేశాడు వీరసోముడు. హోరాహోరిగా జరిగిన యుద్ధంలో తన సైనికులను,

అశ్వికదళాన్ని పోగొట్టుకొన్నాడు సోముడు. ముమ్ముందు ఏం చేయాలో తోచలేదు. తికమక పడ్డాడు. ఈ యుద్ధంలో విజయలక్ష్మి శివసింగును వరించింది.

ఈ సందిగ్ధ పరిస్థితిలో వీరసోముడికి బ్రహ్మనాయుడు గుర్తుకొచ్చాడు. ఒకానొకనాడు తన కూతురును ఇవ్వటానికి నిరాకరించిన వీరసోముడు, తన ఆత్మాభిమానాన్ని వదులుకొని - బ్రహ్మనాయుని సహాయాన్ని అర్థించాడు.

బ్రహ్మనాయుడు మలిదేవాదులతో సంప్రదించి - వీరసోముడికి యుద్ధంలో సహాయం చేస్తానని మాట ఇచ్చాడు.

ఈ యుద్ధం జరుగుతున్న కాలంలో శివసింగుకు, నాగులాదేవికి ఇద్దరు పిల్లలు పుట్టారు.

బ్రహ్మనాయుడు తన సైన్యంతో శివసింగు కోటను ముట్టడించాడు. ప్రచండమైన బ్రహ్మనాయుని సైన్యానికి శివనండ్ల కోటను స్వాధీనం చేసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

మాచెర్ల సైన్యం కోటలోకి చొచ్చుకువస్తోంది.

నాగులాదేవి తన పిల్లల్ని వక్షం మీదకు లాక్కొని దు:ఖిస్తోంది. శివసింగు అంత:పురపు పశ్చిమద్వారంలో నిలబడి చూస్తున్నాడు.

తన రాజ్యాధికారం అంతరించబోతోంది. తను పిరికివాడుగా మరణించకూడదు.

**********

తన భార్యను పిల్చాడు - "నా జీవితం, రాజ్యాధికారం ముగియడానికి సిద్ధంగా వున్నాయి. ఈ కోటను వదిలి పిల్లలతోను, నీతోను పారిపోవడానికి నా మనసు ఒప్పుకోవడంలేదు. అలాగని వీరసోముడికి లొంగి, దిక్కులేని చావు చావనూ లేను. అందుకని...."

"బావా..."

"నాగులా! ఈ రెక్కలు రాని, దిక్కులేని పక్షులను నీకు వదిలిపోతున్నాను. తల్లివైనా, తండ్రివైనా నీవే!

వీరసోముడికి శత్రుత్వం నా మీద. నీ మీద ఏ పగా లేదు."

"బావా! నీవు లేని బ్రతుకు మీద నాకు ఆశలేదు. తుచ్ఛమైన అలాంటి బ్రతుకు బ్రతికే కన్నా చావడమే మేలు. మరి పిల్లలంటావా! ఎలా రాసిపెట్టి వుందో వాళ్ళకు అలానే జరుగుతుంది. ఆ కత్తితో ముందు నన్ను పొడవండి. పుణ్యస్త్రీగా నాకు అంతకంటే మరో భాగ్యం లేదు."

"నాగులా!"

నాగులాదేవిని ముందుగా పొడిచి, తన తలను నరుక్కున్నాడు శివసింగు.

**********

అప్పటికి ప్రొద్దు గ్రుంకబోతున్నది.

సూర్యుని చివరి వెలుగు పడమటి కిటికీ నుండి దూసుకువచ్చి, నెత్తుటి మడుగులో పడివున్న ఆ అమరప్రేమికుల మీద పడి ఆశీర్వదిస్తున్నట్టుగా కనిపిస్తున్నది. పెద్ద దిక్కులను పోగొట్టుకున్న పసికూనలిద్దరూ హృదయవిదారకంగా ఏడుస్తున్నారు.

బ్రహ్మన్న లోనికి వచ్చేసరికి కంట పడ్డ ఈ దృశ్యానికి చలించిపోయాడు. "చెన్నకేశవా!" అన్న మాటలను అతని నోటినుండి అప్రయత్నంగా వెలువడ్డాయి.

వీరసోముడు కత్తిపట్టుకుని లోనికి వచ్చి "ఏడీ ఆ దుర్మార్గుడు?" అని అరిచాడు.

బ్రహ్మనాయుడు విషాదపూరితమైన నవ్వు నవ్వి - "కత్తి పడేయ్ వీరసోమా! సింహం మరణించింది. వాళ్ళ ఆత్మశాంతి కోసం తల వంచి నిలబడు" అన్నాడు.

**********

ప్రతి రాజ చరిత్రలోనూ, ఈ విధమైన రక్తపాతాలతో, ఆత్మత్యాగాలతో నిండిన ప్రేమ కథలు కనిపిస్తాయి. సజీవ సాహితికి ఇవి మెరుగులు పెడతాయి. ప్రాణం కన్నా ప్రేమే ఎక్కువైతే, ప్రేమంత గొప్పది ఈ ప్రపంచంలో మరెక్కడా

దొరకదు.

బ్రహ్మనాయుడు క్షణం నిశ్శబ్దంగా నిలబడి "వీరసోమా! ఈ ప్రేమికుల్ని చంపిన పాపం మనిద్దరికీ చుట్టుకుంటే, ఆ పాపంలో సగభాగం నాకూ ఉంది" అని బైటకి వచ్చాడు. వచ్చేటప్పుడు పిల్లలిద్దర్నీ చేరే చంకలో ఎక్కించుకుని మరీ వచ్చాడు.

పశ్చాత్తప్తుడైన వీరసోముడు మౌనంగా బ్రహ్మన్నను అనుసరించాడు.

ఈ యుద్ధం తర్వాత తన కూతురు శ్రీరమాదేవిని పెద మలిదేవుని కిచ్చి బేషరతుగా పెళ్ళి చేసాడు వీరసోముడు.

ఈ అధ్యాయం ముగింపులో ఒక్క మాట చెప్పాలని వున్నది.

నాగులాదేవిలాంటి స్త్రీల ప్రేమ పవిత్రతలోనే ఈ దేశం పవిత్రతను సంపాదించుకొన్నది. అనార్కలిని పోగొట్టుకొన్న సలీం నెత్తురు చరిత్ర - అనార్కలి సమాధిపై ఎర్ర గులాబీలను పూయించింది.

అవివేకపు అరాచక రాజకీయమే నాగులాదేవినీ, శివసింగునూ బలితీసుకొన్నది. కాలం ఏదైనా కథలు ఒక్కతీరుగానే ఉంటాయి.

ప్రేమ జయిస్తుంది. కానీ ప్రేమికులు ఉండరు. కాలగర్భంలో కలిసిపోయిన ప్రేమకథల్లో రాచరికం ఆనాటికి జయించి వుండవచ్చు గాక, కానీ గొప్ప ప్రేమకథలు అజరామరంగా వుండిపోతాయి.

వీటిల్ని చరిత్రపుటల్లోంచి తీసివేయడానికి లేదు. అవి శాశ్వతత్వాన్ని సంపాదించుకున్నాయి. ఇట్లాంటి ప్రేమకథలను విని కృతజ్ఞతా పూర్వకమైన ఒక నిశ్వాసాన్ని వదిలిపెట్టడం మనసున్న మనిషి కనీస కర్తవ్యం!

రహ్మనాయుడికి మాల కన్నమదాసు ఎలా ముఖ్యుడో, నాయకురాలు నాగమ్మకు "వీరభద్రుడు" అంతే ముఖ్యుడు.

వీరకన్నమదాసు-వీరభద్రుడూ ఒకేరకపు గొప్ప యోధులు. వీరత్వానికి పల్నాటి ప్రతీకలు.

మనిషి కన్నా భయంకరమైన జంతువుగానీ, అవిశ్వాసకరమైన ప్రాణిగానీ మరొకటి లేదు. మనిషి పాలు తాగి పెరిగిన పాప, పెద్దయ్యాక అవిశ్వాసకరంగా, దుష్టుడుగా మారటానికి అవకాశమున్నది. కాని మనిషికి కుక్కపాలు పోసి పెంచితే, విశ్వాసకరంగా పెరుగుతాడనేది నాగమాంబ నమ్మకం. అందుకే దిక్కూదివాణం లేని పసివాణ్ణొక్కణ్ణి కుక్కపాలు పోసి పెంచి పెద్దవాణ్ణి చేసింది. వాడే వీరభద్రుడు. "నాగభూషణుడి"కి అలనాటి వీరభద్రుడెంతో, నాగమాంబకు పలనాటి వీరభద్రుడూ అంతే.

కుక్క కన్నా మిక్కిలి విశ్వాసకరుడు వీరభద్రుడు. నాగమ్మ మాట అతనికి శిలాక్షరం. వీరభద్రుణ్ణి మరో రుద్రుడిగా, నాగమ్మ బీరాలు పోతూ వుండేది.

మున్ముందు ఎటువంటి విపత్తు సంభవించినా అతడు మరణించందే, తన మీద ఈగ వాలనీయడని ఆమె అభిప్రాయం. నిజానికీ అంతే.

*(ఐతే కొంతమంది చరిత్రకారులు, పల్నాటి చరిత్రలో వీరభద్రుణ్ణి ఎక్కడా పేర్కొనలేదు. కానీ వీరభద్రుడు వుండి వుండాలి. ఎందుకంటే, వీరులైనవాళ్లంతా బ్రహ్మనాయుడి పక్షానే వున్నట్టు పల్నాటి చరిత్ర పేర్కొంటుంది. అమిత మేధాసంపన్నురాలైన నాగమ్మ కనీసం వీరభద్రుడులాంటి విశ్వాసపాత్రుడూ-వీరుడూ లేకుండా వుండి వుంటుందన్నది ఆలోచించదగ్గ విషయమే).*

*********

కళ్యాణపురపు వీరసోముడితో మాచెర్ల ప్రభువులు వియ్యమందాలనుకున్న తర్వాత - నలగామరాజులకు కబురు పంపాలా వద్దా అన్నది ఇక్కడి వీరులకు - ప్రభువులకు వివాదాస్పదమైన విషయమయింది.

కొంతమంది "వద్దు" - కొంతమంది "తప్పు" అని నిర్ధారించారు. "పగ" సంగతి ఎలావున్నా అగ్రజుడైన నలగాముడికి కబురు పంపటం బాధ్యత, ధర్మమూ అని బ్రహ్మన్న అభిప్రాయపడితే, మలిదేవాదులు దీనికి అభ్యంతరం పెట్టలేదు.

కబురందినా నలగాముడు మాచెర్ల రాలేదు. ఐనా బ్రహ్మన్న తన బాధ్యతల ప్రకారం కట్నకానుకలతో చాలాకాలం తర్వాత గురజాల వచ్చాడు.

ఈ అనతికాలంలో బ్రహ్మన్న అపూర్వ పర్యవేక్షణలో మాచెర్ల పచ్చపచ్చగా - తేరిపార చూడరాని బలమైన రాజ్యంగా పేరు మోసింది.

ఐతే బ్రహ్మన్న బలపడటం నాగమ్మకు ఇష్టం లేదు.

పక్కన పొరుగు రాజ్యం బలపడుతూవుంటే అది ఎవరికైనా కంటిగింపే! అదీగాక తమ నుంచి రాజ్యం పంచుకున్న దాయాదులు గొప్పవారయితే నాగమ్మ సహించేదెట్లా?

ఈ పొరుగున వున్న రాజ్యం ఇట్లా పచ్చగా వుంటే, ఏదో ఒకనాడు తమకు ప్రమాదం తప్పదు. మంచివాడైన నలగాముడు నాగమ్మను మంత్రిణిగా చేసిన తర్వాత అతనిలో స్వార్థం నాగుపామై పడగ విప్పి బుసలు కొడుతున్నది.

కట్న కానుకలు తీసుకొచ్చిన బ్రహ్మనాయుణ్ణి గౌరవించిన నలగాముడు, ఉండటానికి బ్రహ్మన్నకో విశాలమైన రాజసౌధాన్ని విడిదిల్లుగా ఇచ్చాడు.

**********

"ఐతే బ్రహ్మన్నలో వున్న బలహీనతేమిటి?" అని నాగమ్మ ఆరాలు తీయించింది.

ప్రతి మంచివాడికీ ఒక బలహీనత వుంటుంది. ధర్మరాజుకు జూదపు పిచ్చి ఉన్నది. అట్లాగే బ్రహ్మనాయుడికి కోడిపందాల పిచ్చి.

ఈ సంగతి తెల్సిన నాగమ్మ, నలగాముడితో బ్రహ్మనాయుణ్ణి కోడిపోరుకు ఒప్పించమని పురిగొల్పింది.

ఇటువంటి దురాలోచనలకు నలగాముడు దూరంగా ఉంటూ వచ్చాడు. ఐనా నాగమ్మ మంత్రాంగం ముందు అవన్నీ నిలవకుండాపోయాయి.

"పొరుగున మీ దాయాదులు బలవంతులైపోయారు. ఏదో ఒకనాడు వాళ్ళు మీ మీద ఉప్పెనలాగా విజృంభించే ప్రమాదం వుంది. కాబట్టి మాచెర్లని ఏదో రూపేణా వశపర్చుకోవాలి. ఇక మీ ఇష్టం."

నలగాముడి నెత్తికి నాగమ్మ వ్రాసిన పసరు పనిచేసింది.

**********

తెల్లవారబోతున్నది. బాలభానుడు గురజాల మీద రంగులు పూస్తున్నాడు. సుప్రభాతం అందంగా నర్తిస్తున్నది. నిజానికి నాగమాంబ ఆలోచించిన విధానంలోనూ తప్పులేదు. ఎందుకంటే, మాచెర్లను రాజధానిగా చేసుకున్న మలిదేవాదులు ఇవ్వాళ పెరిగి పెద్దవారయ్యారు. బ్రహ్మన్న మంత్రిత్వంలో నిమ్మకు నీరెత్తినట్టున్నారు. అంతేకాక, వీరసోముడితో వియ్యమందాక, మలిదేవుల ప్రాభవం పెరిగింది. కాబట్టి ఏదో రూపేణా బ్రహ్మన్నను సాధించాలి.

ఉదయపు కాలకృత్యాలైనాక, చెన్నకేశవుణ్ణి ధ్యానించుకుని బయటకు రాబోతున్న బ్రహ్మనాయుడికి రెండు పుంజులు కత్తులు కట్టుకుని పోట్లాడడం కనిపించింది. ఒక పుంజు పారిపోయింది. నాగమాంబ చప్పట్లు కొట్టి, నవ్వి అంది-

**మాచెర్ల పుంజులకు రోసాలు లేవు**
**మాచెర్ల ప్రజలకూ మీసాలు లేవు**
**గుండెగలిగిన పుంజులకు గురజాల పేరు**
**దండి మగవీరులకు పేరు మావూరు**

బ్రహ్మనాయుడి పౌరుషానికి దీన్ని ప్రతీకగా చెప్పుకొంటారు. నాగమ్మ మాటలను విన్న బ్రహ్మనాయుడు కళ్ళు చింతనిప్పుల్లా చేసి పారిపోయే పుంజును చూసి -

**తిరిగిరావే పుంజ బ్రహ్మన్న ఆన**
**ఎరిగి తన్నవె తన్ను గుండెలోతుల్లోన**
**మాచెర్ల పుంజులకు కలవు రోసాలు**
**మంత్రి బ్రహ్మన్నకు "కలవె" మీసాలు**

*("కలవె మీసాలు" అన్న మాట, నీచ సంబోధనలో నాగమ్మను ఉద్బోధించి అని ఉండవచ్చు. ఇది పుంజుకూ అన్వయిస్తుంది)*

అని పారిపోయే పుంజును చూసి గట్టిగా అరిచాడు. పారిపోయిన పుంజు వెనక్కు తిరిగి వచ్చి, గురజాల పుంజు గుండెల్లో ఎగిరి తన్ని, చంపి - కూతకూసింది.

"మగతనం మగువల కేమి తెలుస్తుంది. నాగమాంబ ఇప్పటికయినా తెలుసుకో!" అన్నాడు.

పారిపోయిన పుంజు, వెనక్కు తిరిగివచ్చి - గురజాల పుంజును చంపటంతో నాగమ్మ నవనాడులూ క్రుంగిపోయాయి. ఐనా బింకం వదలక -

"పారుబోతు పుంజులతో పోరు పరువా, ప్రతిష్ఠా? ఆడిన మాటను తప్పని బ్రహ్మన్న రాజ్యాన్ని పణంగా పెట్టుకుని, పోరుకొస్తే - బలాబలాలు తేల్చుకోవచ్చు" అన్నది.

గురజాల ప్రభువులను, ఇంతలేసి మాటలాడుతూ వుంటే రక్తం కాగిన బ్రహ్మన్న - "అలాగే...నీ ముక్కువా, నీ ప్రభువుల ముక్కువా తీరుస్తాము" అని అభయం ఇచ్చాడు.

ఆత్మ గౌరవం కోసం ఈ పందానికి ఒప్పుకున్నాడన్న మాటేగానీ, బ్రహ్మన్నకు ఎందుకనో బెరుగ్గానే వున్నది. ఈ పందాలవల్ల సంభవించే విపరీత పరిణామాలు ఊహించలేని అమాయకుడు కాడు బ్రహ్మన్న.

పాచికలాటతో కురు-పాండవ యుద్ధం సంభవించింది. మరి ఈ కోడిపోరు ఏం తెచ్చిపెట్టనున్నదో?

"రాజ్యాన్ని పణంగా పెట్టి కోడిపోరుకు ఒప్పుకున్నాం మలిదేవా - ఓడినవారు రాజ్యాన్ని వదిలి ఏడేళ్ళు వనవాసానికి పోవాలి" అన్నాడు బ్రహ్మనాయుడు.

పెదమలిదేవుడు తలెత్తి -

"మీ గౌరవమే మా గౌరవం మహామంత్రీ! అభిమానం లేని రాజ్యం అక్కరలేదు. క్షాత్రం వుంటే క్షత్రియుడు. నాగమ్మ ఉబలాటం తీరుద్దాము" అన్నాడు.

"ఐతే పందెం నిర్ణయించిన రోజేది?" అని అడిగాడు బ్రహ్మన్న అన్న పెద్దన్న.

"ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి, కోడేరు పొలిమేరలో"

"అట్లాగే కానీ!" అన్నాడు కన్నమనాయుడు.

**********

కళ్యాణపురం వీరులైన యాదవులకు ప్రసిద్ధి.

పల్నాటి రాజ్యానికి చెందిన "భీముడు" బలగర్వంలో తనకు మించిన బలవంతుల్లేరనుకునేంత మూర్ఖుడు.

కళ్యాణపురం పెళ్ళివేడుకల్లో, భోజనపంక్తిలో కూర్చున భీముడు, "వీర పడాలు"ను ఎద్దేవా చేసాడు -

వీరపడాలు నవ్వి "నీకేం కావాలి?" అన్నాడు.

"అసలైన నువ్వుల నూనె కావాలి. బంతిలో నెయ్యి వడ్డించుకోన్నను" అన్నాడు భీముడు.

"అదెంత పని" అని వీరపడాలు చేతుల మధ్య నువ్వులను పిండి, విస్తట్లో నూనె వడ్డిస్తే - "పర్వాలేదు. మీ వూళ్ళోనూ మగవాళ్ళున్నారు" అని భీముడు నవ్వితే - "మగతనం పెళ్ళి భోజనాల విస్తళ్ళ ముందు కాదు; బైట గోదాలో" అని నిర్లక్ష్యంగా నవ్వాడు వీర పడాలు.

"ఎక్కడ? ఎప్పుడు?" అన్నాడు పల్నాటి యోధుడొకడు.

"మీ ఇష్టం" అన్నాడు వీరపడాలు.

కళ్యాణపురంలో వేళ్ళ మీద లెక్కపెట్టగల్గిన గొల్ల యోధుల్లో వీరపడాలు ఒకడైతే; ద్వంద్వయుద్ధంలో అతనికతనే సాటి. చాణూర, ముష్టికుల్ని జయించగల్గినంత యోధు డతను.

పెళ్ళి వేడుకల్లో ఒక భాగంగా పల్నాటి భీముడికీ, కళ్యాణపురం వీరపడాలుకూ ద్వంద్వయుద్ధం జరిగింది. మహా

పరాక్రమవంతుణ్ణని విర్రవీగే భీముణ్ణి క్షణాల్లో చిత్తుచేసిన వీరపడాలును చూసి బ్రహ్మన్న ఆశ్చర్యపోయాడు. ఇటువంటి వీరులు ఇప్పుడు మాచెర్లకు అవసరం.

అత్తగారింటికి రావటానికి సిద్ధంగా వున్న శీరమాదేవి దగ్గరకు వెళ్ళి "తల్లీ" అని సంబోధిస్తే శీరమాదేవి సిగ్గుతో తలవంచి, భక్తితో బ్రహ్మనాయుడికి నమస్కరించింది.

"అమ్మా! అత్తగారింటికి రాబోయే ముందు ఆరణంతో పాటు, ఆవుల్నీ, ముగ్గురు యాదవ వీరుల్నీ కావాలని అడుగమ్మా. అందులో ముఖ్యంగా "వీరపడాలు"ని కావాలని కోరు" అని చెప్పాడు.

వీరసోముడు బ్రహ్మన్న అనుకున్నట్లు - వీరబోయడు, వీర పడాలు, బాల గోపన్నలను పంపాడు.

ద్వంద్వయుద్ధంలో వీరు ముగ్గురూ వేలాది వీరుల్ని మాచెర్లలో తయారుచేశారు.

**********

"మహామంత్రీ! మన తరఫున పోరాడే పుంజు సిద్ధంగా వున్నదా?" అన్నాడు పెదమలిదేవుడు.

"వున్నది"

"ఏది? ఎక్కడా?"

"తెప్పించుతాను. ఆ పుంజు ఇక్కడలేదు. పానుగల్లులో వుంది. ఆ పుంజు కోసం వీరపడాలును పంపిస్తున్నాను."

"అలాగే కానీండి"

*********

బ్రహ్మన్న అనుజ్ఞ పొందిన వీరపడాలు, వీరబిరుదాలను ధరించి పానుగల్లు బయలుదేరాడు.

పానుగల్లు పొలిమేరల్లో అడ్డువచ్చిన కొంతమంది శూరుల్ని వధించి పుంజును పట్టుకొచ్చిన వీరపడాలును

బ్రహ్మనాయుడు కట్నకానుకలతో సత్కరించాడు.

జాతిలక్షణాలు గల్గిన ఈ పుంజు వీరత్వానికి పెట్టింది పేరు.

*(ఈ పుంజు పేరు - "చిట్టిమల్లు" అని కొన్ని చరిత్రల్లో వుంది. కానీ ఈ పుంజును గోదాలోకి దింపిన పల్నాటి పందెగాడి పేరు "చిట్టిమల్లు" ఐవుండవచ్చని కొంతమంది చరిత్రకారులు భావిస్తున్నారు. పేరు ముఖ్యం కాకపోతే "మాచెర్ల పుంజు" అని పాఠక సౌకర్యార్థం పిలిస్తే బావుంటుందని అనుకుంటున్నాను.)*

కోడి పందాలకు వెళ్ళేటప్పుడు, శుభ శకునాల కోసం పందెగాళ్ళు నిరీక్షిస్తారు. ఇది ఒక్క కోడిపందాలప్పుడే కాదు; ఏ శుభకార్యానికైనా ఈ పట్టింపులు హిందూ రక్తంలో పేరుకొనిపోయి వున్నాయి.

నిజానికి బ్రహ్మన్న కోడిపందానికి బయలుదేరినప్పుడు అన్నీ అపశకునాలే కనిపించాయట.

బయలుదేరి వెనక్కు రావటం మంచిదికాదని, ఏదైతే అదే అవుతుందని బ్రహ్మనాయుడు కోడేరుగుట్టల్లో కోడి పందానికి బయలుదేరి వెళ్ళాడు.

*********

"పాలువాయి"ని ఆనుకుని వున్న కోడేరు గుట్టల్లో కోడిపందాల కోసం, నాగమ్మ అన్ని ఏర్పాట్లూ గావించింది.

నాగమ్మ తెప్పించిన పుంజు "పెట్టమారి". పెట్టమారి పుంజు చూట్టానికి గమ్మత్తైనది. అది సగం పెట్టగానూ, సగం పుంజుగానూ కనిపిస్తుంది.

నాగమ్మకు ఇంకో భయం వుంది. ఈ కోడిపందెంలో బ్రహ్మన్నే జయిస్తే ఏం చెయ్యాలి? అందుకని గురజాల వీరుల్ని నాలుగువైపులా సిద్ధం చేయించింది. తురక యోధులకు గుర్రాలూ, కట్నకానుకలనూ ఇచ్చింది.

ఇన్నీ చేసిన నాగమ్మ రాజమర్యాదలను తూచా చప్పకుండా పాటించింది. నాగమ్మ చెప్పినట్లు నలగాముడు, నరసింగరాజుతో కలిసి - బ్రహ్మనాయుడు, మలిదేవాదులను రాచమర్యాదలతో సగౌరవ స్వాగతాన్ని ఇచ్చాడు.

నాగమ్మ కోడిపందానికి స్థలం నిర్ణయించి - చుట్టూ ఖరీదైన కంబళ్ళను, పట్టు తివాచీలనూ పరిపించింది. ఎవరి

వైపు వారు కూర్చునేట్టు అమర్చింది.

నలగాముని మర్యాదల్ని చూసి బ్రహ్మన్న సంతోషించాడు. తమకై అమర్చిన రత్న పీఠాల మీద రాజులు, ప్రముఖులు కూర్చుంటే, సామాన్య ప్రనలు తివాచీల మీద, ఎత్తైన మంచెల మీదా కూర్చున్నారు.

అశేష ప్రజానీకమంతా కోడేరు కోళ్ళపందెంలో పాల్గొన్నారు. పెళ్ళికి తరలచి వచ్చినట్టు, తిరుణాళ్ళకి మూగినట్టు వున్నది జనసందోహం. మాచెర్ల-గురజాల వీరుల్లో, ప్రజల్లో మంచి ఉద్రేకం నిండుకొని వున్నది.

అనుకున్న కాలానికి పుంజులను గోదాలోకి దించారు.

అనుకున్న కాలానికి పుంజులను గోదాలోకి దింపారు.

మాచెర్ల పందెగాడు "గోపన్న" బ్రహ్మనాయుడి చేతిలోంచి పుంజును తీసుకున్నాడు. బ్రహ్మనాయుడు పుంజు రెక్కలను నిమిరి నెమ్మదిగా "మా భవిష్యత్తు నీ మీద ఆధారపడి వున్నది" అన్నాడు.

మాచెర్ల పుంజు "కొక్కొరొక్కో" అని విజయగీతం పాడినట్టు కూతకూస్తే, మాచెర్ల వీరుల చేతులు మూతుల మీదకొచ్చి మీసాలను సగర్వంగ దువ్వుకున్నాయి.

నాగమ్మ తెచ్చిన నలగాముని తరఫు పుంజు పేరు "నల్లమల్లు". పెట్టమారి పుంజును చూసిన గురజాల వీరులు సిగ్గుతో తలలు దించుకున్నారు. ఐతే తమ పరువు కోసం నలగామరాజు వైపున నిలబడటం తప్పనిసరయినది.

చరిత్ర పుట్టిన తర్వాత ఇంత గొప్ప కోడిపోరు ఎక్కడా జరగలేదనే విషయంతో చాలామంది ఏకీభవిస్తారు. (ఇవ్వాల్టివరకూ - పల్నాడు వాడవాడలా ఈ సంగతిని ప్రస్తావించి, వీరత్వం ఉద్భవించిన పల్నాటి వీరకథను వింపిస్తారు).

**********

రెండు పుంజులూ గోదాలోనికి దిగాయి. పందెగాళ్ళిద్దరూ పుంజులను వదిలారు. మధ్యవర్తి ఇరుపక్షాలకూ కావలసినవాడైన అలరాజు.

పందెం ప్రారంభించబోయే సమయానికి ఇరుపక్షాల పందెగాళ్ళకు పాటించవల్సిన విధులను గురించి హెచ్చరించాడు అలరాజు.

పోరు మొదలైంది.

ఇరుపక్షాల్లో పౌరుషం పెరిగిపోతున్నది.

కత్తులు కుత్తుకల్లో గుచ్చుకోవాలన్నట్లు - రెక్కలు రిక్కించి - డొక్కలు వుబ్బించి - ఈకలు మెడల మీద గుండ్రని గుత్తిలా ఏర్పరచుకుని - చావుబ్రతుకుల మధ్య, నెత్తుటిధారల మధ్య పుంజులు పోట్లాడుకుంటున్నాయి. మాచెర్ల ప్రభువుల పుంజు ధాటికి, గురజాల పుంజు గింజుకుంటోన్నది. తప్పకాళ్ళు పడ్డాయి.

విరామంలో పుంజులను నీళ్ళకు ఎత్తారు.

మాచెర్ల ప్రభువులు, వీరులు పొందబోయే విజయం యొక్క ఉత్సాహంతో అరుస్తూ, మీసాలు దువ్వుకుంటున్నారు.

నాగమ్మ గుండె నీరయితే, నలగాముడు దిగాలుగా తలను నేలకు వంచుకున్నాడు.

**********

రెండవసారి పుంజులను బరిలో వదిలారు.

ఇప్పుడు గురజాల పుంజు రెక్కల మధ్య ఉక్కుకవచం ఉంది.

యుద్ధం తారుమారయింది.

ఈ విచిత్రమైన మార్పేమిటో మాచెర్ల ప్రభువులకు అర్థం కాలేదు. కానీ ఇందులో ఏదో కుతంత్రం వున్నదని బ్రహ్మన్న గుర్తించాడు.

ఐనా మాచెర్ల ప్రభువుల పుంజు విసిరే విసుర్లకు గురజాల పుంజు గుక్కతిప్పకోలేక పోతున్నది.

మోసమే జయించటం అనాదిగా చరిత్రల్లో జరుగుతున్నదే గనుక ఇక్కడా నాగమ్మే గెలిచింది.

బ్రహ్మన్న ఓడిపోయాడన్న వార్త పల్నాడంతా పాకిపోయింది.

మాచెర్ల పందెగాడు గోపన్న లేచి - "మోసంతో పందెం జయించింది నాగమ్మ. ఈ పందెంలో తీర్పు ఇవ్వకూడదు" అన్నాడు.

అప్పటికే నాగమ్మ పుంజును బరి నుంచి తప్పించింది.

అలరాజు గురజాల ప్రభువులు పందెంలో నెగ్గినట్టు తీర్పు చెప్పాడు.

సంతోషంతో నాగమాంబ నవ్వితే - కోపమొచ్చిన అలరాజు కత్తి విసిరాడు. కొంచెంలో కత్తి నుంచి తప్పకుంది నాగమ్మ. అలరాజు క్రోధంతో "న్యాయానికి కట్టుబడి ఈ తీర్పునిచ్చాను. ఇదీ విజయమనుకుంటే నువ్వెంత పొరబడుతున్నావో అర్థమవుతుంది. తల్చుకుంటే ఈ క్షణంలో మాచెర్ల వీరులు మిమ్మల్ని మసిచేస్తారు. ఆడదానివని క్షమించాను. ఫో!" అన్నాడు.

*("చాతబడి" అనే క్షుద్ర దేవతా ప్రక్రియతో మాచెర్ల పుంజును నాగమ్మ నిర్వీర్యం చేసిందనే కథ కూడా ప్రచారంలో ఉంది. అలాగూ జరిగివుండవచ్చు. ఏది ఏమైనా ఈ ధర్మయుద్ధంలో అధర్మం జయించింది. ఆరవెల్లి నాగమాంబ గెలిచింది)*

మాచెర్ల పందెగాడు గోపన్న ఒక్కడిని స్వేచ్ఛగా వదిలినట్లైతే అతని చేతిలో చాలామంది పల్నాటి ప్రజలు చచ్చేవాళ్ళు. కానీ ధర్మానికి, మర్యాదకు కట్టుబడ్డ మాచెర్ల ప్రభువులు మౌనంగా ఉండిపోయారు.

న్యాయం అనేది ఒక కట్టుబాటు. నాగమ్మది మోసం అని తెలిసినా ధర్మానికి కట్టుబడిన బ్రహ్మనాయుడు మలిదేవాదులతో అరణ్యవాసానికి సిద్ధమయ్యాడు.

మాచెర్ల వీరుల్లో పగ రగుల్కొంటోంది.

"ఇది అధర్మయుద్ధం. మనం అరణ్యవాసం చేయనక్కరలేదు" అని కొంతమంది అన్నారు.

"మాట పాటించనివాడు బ్రతికున్నా చచ్చినవాడితో సమానం. ఆడి తప్పని జాతి మనది - పందెంలో మోసం జరిగినా, మనం ఓడినట్టే లెక్క!"

మలిదేవాదులు బ్రహ్మన్నను సమర్థించారు,

తమ పరివారమూ, అంతపురకాంతలూ - మలిదేవాదులతో ఆరోజున అరణ్యవాసానికి ప్రయాణమైనాడు
బ్రహ్మన్న.

"తల్లీ కృష్ణమ్మా!" అని నమస్కరించాడు బ్రహ్మన్న. కృష్ణవేణీ నదీమతల్లి తన చల్లనిహస్తంతో ఆశీర్వదిస్తున్నట్టుగా అనిపించింది బ్రహ్మన్నకు.

ఒకనాటి పాండవుల అజ్ఞాతవాసం గుర్తుకొచ్చింది బ్రహ్మన్నకు - "చెన్నకేశవా! నీ ఇచ్ఛ తండ్రీ!" అని అనుకున్నాడు.

పరివారంతో బాటు ఆలమందలున్నాయి. మందీమార్బలం మామూలే.

కప్పెరకప్పెర చీకటి పడుతున్న వేళ, బ్రహ్మన్న తన పరివారంతో దిగిన చోటు - "పెందోట".

ఆ రాత్రి గడిచిపోయింది.

సూర్యభగవానుడు కృష్ణమ్మకు ఉదయపు అందాల్ని చెక్కుతున్నవేళ, బ్రహ్మనాయుడు తన జనంతో కృష్ణను దాటి ఒక చిన్నపల్లెకు చేరుకున్నాడు. దాన్నే నివాసస్థానంగా చేసుకున్నాడు. అ

వూరి పేరు "మండాది".

**********

అలరాజుతో పేరిందేవి పెళ్ళి ఎప్పుడైయిందీ - పేరిందేవి బాల్యంలోనా? కోడిపోరుకు ముందా? మలిదేవాదులు అరణ్యవాసం వెళ్ళకముందా? అన్నది స్థిరపర్చటం కష్టం. ఐతే ఖచ్చితంగా ధృవీకరించాల్సిన విషయమేమిటంటే పేరిందేవి అలరాజు భార్య.

అరణ్యవాసాన్ని మలిదేవాదులతో గడిపాడు అలరాజు.

మాయాకోడిపందెంలో కత్తి విసిరిన అలరాజు మీద కుత్తుక దాకా కోపమున్నది నాగమ్మకు - తన శత్రువు (అలరాజు), నలగాముడికి బంధువు (అల్లుడు) - పైగా రేపు గురజాలకు కాబోయే ప్రభువు కూడా.

ఈ అలరాజును హతం చెయ్యకపోతే తన ఉనికికి ప్రమాదం. అలరాజును ఎలా హతమార్చాలని నాగమ్మ పథకాలు వెయ్యడం మొదలుపెట్టింది. జీవితంలో మనుషుల బ్రతుకులతో ఎలా చెలగాటమాడాలో బాగా వంటబట్టించుకొంది నాగమ్మ.

మార్గం నిష్కంటకమూ, సురక్షితమూ కావాలంటే రాజకీయంగా ఆలోచించాల్సినవి కొన్ని వున్నాయి.

తన అమోఘమైన మేధస్సుతో, నాగమ్మ వేసిన కోటలో పాగా తిరుగులేనిది. నలగాముడిని చెప్పు కింద తేలులా మార్చుకోగల్గిన నాగమ్మ, నరసింగరాజును "కుక్క"గా మార్చుకుంది. నరసింగరాజు

నాగమ్మ "తానా" అనకముందే "తందానా" అని పలికే స్థితిలో వున్నాడు.

అంతేగాదు, నాగమ్మ నెమ్మదిగా నెమ్మదిగా పేరిందేవిని మచ్చిక చేసుకున్నది. ముక్కుపచ్చలారని ముద్దరాలు పేరిందేవి, నాగమ్మ మంత్రాంగంలో పడిపోయింది.

"అలరాజు ఇల్లాలా! ఓ పేరిందేవీ" అని పలకరించేది.

పాము పడగనీడలో కప్పకు రక్షణ లేదనే విషయం అమాయకురాలు అలరాజు ఇల్లాలికి తెలీదు.

**********

కాలం మహాప్రవాహంలాంటిది. ఏది ఎట్లా జరిగినా కాలానికి, ప్రపంచంతో సంబంధంలేదు.

వత్సరాలు దొర్లిపోతున్నాయి.

మండాదిలో బ్రహ్మనాయుడు కొత్తరాజ్యాన్ని దాదాపూ నిర్మించుకున్నాడు.

బ్రహ్మన్న ఎక్కడవున్నా బలపడిపోతున్నాడన్న భయం ఒకటే నాగమ్మకు వుంది. ఎలాగైనా అతన్ని సాధించాలి.

శైవమతాన్ని అణగద్రొక్కిన బ్రహ్మన్న - తన తండ్రిని హత్యజేసిన బ్రహ్మన్న - తన మీద కత్తిగట్టిన బ్రహ్మన్న - ఎప్పుడూ ప్రమాదకరమైన వ్యక్తే. ఋణశేషమూ, శత్రుశేషమూ ఎప్పుడూ పీకల మీద కత్తిలాంటివే. ఏంచెయ్యాలి?

కంట్లో నలుసూ, కాలిముల్లూ, కత్తికి ఎదురు ఎప్పుడూ ఉండకూడదు. బలిసిన శత్రువు ఏమారిన క్షణాన ఎప్పుడైనా కబళించవచ్చు.

ఇవన్నీ ఆలోచించిన నాగమ్మ, నలగాముడికి దుర్బోధలు చేసింది. మలిదేవాదుల ఆలమందలను పోడిపించమన్నది.

"ఎందుకు?" అన్నాడు నలగాముడు.

"కాళ్ళూ, చేతులూ కూడాదీసుకోకముందే - ఈవిధంగా బ్రహ్మన్నను మనం యుద్ధానికి పురికొల్పితే - దెబ్బ మీద దెబ్బగా మలిదేవాదులు నిర్వీర్యులైపోతారు."

"ధర్మం కాదు" అన్న నలగాముడి మాటలకు -

"విన్నారా నరసింగరాజా?" అన్నది నాగమ్మ.

"మహారాజా! మన మంత్రి నాగమాంబ చెప్పిందే నిజం. మలిదేవాదులు బలపడుతున్నారు. అరణ్యవాసం గడుస్తూనే వున్నది. ఆ తర్వాతైనా మనం రాజ్యం పంచిపెట్టక తప్పదు. ఒక్క ప్రశ్న అడుగుతున్నాను. అసలు మనం రాజ్యం ఎందుకు పంచిపెట్టాలి?"

నలగాముడు నిశ్శబ్దంగా వూరుకున్నాడు.

"మౌనం అర్ధాంగీకారమా?" అన్నది నాగమ్మ.

"కాదు. సంపూర్ణాంగీకారమే!" అన్నాడు నరసింగరాజు.

ఐతే మండాదిలో వున్న ఆలమందలను హతం చెయ్యడానికి ఎవర్ని నియమించాలి? అన్నది ఇప్పటి ప్రస్తుత ప్రశ్న.

**********

నిజానికి, బ్రహ్మన్న మీద చెంచురాజు "వీధుల పల్నేటి"కి కోపమున్నది. అందుకని నాగమ్మ కీలెరిగిన వాతను "పల్నేటి"కి కబురంపితే, కబురందిన మరుక్షణం పల్నేటి గురజాలకు వచ్చి వాలాడు.

ఉచితగౌరవాలతో ఉచితాసనం పొందిన మూర్ఖుడు - అల్పసంతోషి పల్నేటి - "ప్రభూ! తమరు కబురంపిన కారణమేమిటో?" అన్నాడు.

"పరాక్రమతేజో విరాజా, పల్నేటి రాజా" - అని నాగమ్మ అతిశయోక్తి బాణం విసిరితే, ఆ మాటకు పడిపోయిన పల్నేటి - "చెప్పండి మహామంత్రీ! మీ మాటే మా మాటగా వింటాం" అన్నాడు.

"కేవలం వింటేనే సరిపోదు; ప్రభువుల కార్యం నిర్వర్తించాలి" అన్నది.

వికటాట్టహాసం చేసి, పల్నేటి - మూతి మీసం తిప్పుతూ "అభయం - చెంచురాజులు అన్నమాట తప్పరు. మీ మాటే మా కార్యంగా నిర్వహిస్తాము." అన్నాడు.

"చెప్పండి ప్రభూ" అన్నది నాగమ్మ.

"మహత్తర భోగాలను అనుభవిస్తూ మండాదిలో మలిదేవాదులు బలపడిపోతున్నారు. బ్రహ్మన్న దేవుడిలా చెలామణి అవుతున్నారు; వ్యక్తిపూజ జరుగుతోంది బ్రహ్మన్నకు. బ్రహ్మన్న బ్రతికివుంటే గురజాలకు భద్రత లేదు.

పల్నేటి! యోధానయోధులు నీ చేతికింద వున్నారు. మంచితరుణం మించకుండానే, మండాదిలోవున్న బ్రహ్మన్న ఆలమందల్ని మరలించి మన రాజ్యానికి చేర్చు.

వీరులనుకున్న వాళ్ళనంతా మండాదిలోనే తెగటార్చు. కృష్ణలో పీనుగులు తేలాలి. చచ్చిన తన

ప్రజల్ని చూసుకుని, బ్రహ్మన్న క్రుంగిపోవాలి." అన్నాడు నలగాముడు.

ముందుచూపు, మంచీ-చెడుల్ని మర్చిన చెంచు పల్నాటి - "చిటికెలో మీ కార్యాన్ని నిర్వర్తిస్తాను" అన్నాడు.

"ఈ పని మీతోనే సాధ్యం చెంచురాజా" అన్నది నాగమ్మ.

"మా తండ్రిని, నా చిన్నతనంలో పొట్టనబెట్టుకున్న బ్రహ్మనాయుడి మీద ఎప్పుడు పగ తీర్చుకోవాలా అని చూస్తున్నాను. కాలం కలసివచ్చింది. ఇంతకన్నా అదును దొరికేదెప్పుడు? రేపే నా ప్రయాణం" అన్నాడు పల్నేటి.

కట్నకానులు, ఖర్చు వెచ్చాల్నీ అందుకున్న పల్నాటి తన ప్రజలతో తెప్పలు దాటి మండాది దరిదాపులో చేరుకున్నాడు.

మండాది గుట్టుమట్టులు తెల్సుకోవడానికి అతనికి రెండు మూడు రోజులు పట్టింది.

"యాదవ లంకన్న" ఆలమందలకు అధికారి.

వేగులవాళ్ళు చెప్పిన మాటలతో పల్నేటి ఇరుకున పడాల్సివచ్చింది. లంకన్న, వట్టి చేతులతో మనుష్యుల్ని చంపగలడు. వీరపడాలు, వీరన్న లాంటి వాళ్ళు మందల్ని కాస్తున్నారని, బ్రహ్మనాయుడి ఆలమందల్ని అదిలించటం మంచిది కాదనీ హెచ్చరించాడు.

మూర్ఖంతో అతిశయుడైన పల్నేటి వేగుల మాటల్ని వెనక్కునెట్టి - " ఏమైనాసరే! ఆలమందలను హతంజేస్తా"నని పట్టుబట్టాడు.

ప్రొద్దు గుంకింది.

కృష్ణమ్మ కడుపులో దాక్కున్నది పడమటి సంధ్య-చిరుచీకటి-చిరుగాలీ కలిసి ఆడుకుంటున్నాయి.

ఆవులు పొదుగులను ఒప్పజెప్పి నెమరువేస్తున్నాయి. లేగదూడలు "అంబా-అంబా"అని అరుస్తున్నాయి.

ఏమరపాటుతో బాటు ఆయుధహీనులైన మండాది యాదవుల మీద తన అనుచరులతో విరగదీసుకుపడ్డాడు పల్నాటి.

**********

అసలు ఏంజరిగిందో తెలియని అనిశ్చిత స్థితి.

శత్రువులు వచ్చి పడ్డారని ఊహించుకున్నాడు లంకన్న. వెంటనే వీరుల్ని పేరుపేరునా పిల్చాడు.

ఆయుధ సమీకరణ జరిగేలోపలే గొల్లవీరులు నెత్తురు మడుగుల్లో విలవిలా తన్నుకుని చచ్చిపోయారు.

అట్లా ఐదారుగురు వీరులు అప్పటికప్పుడు మండాది ఆలమందల రణక్షేత్రానికి బలైపోయారు.

ఆవులు చెదిరిపోయి, ఎటుపదితే అటు కట్టు కదిలి పరుగెత్తడం మొదలుపెట్టాయి.

లంకన్నకూ, పల్నేటికీ భీకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో పల్నేటి చచ్చాడు. కానీ లంకన్నకు భయంకరమైన గాయాలు తగిలాయి. అతని నాడినాడినా నెత్తురు విరజిమ్మింది.

"చెన్నకేశవా!" అని ఆఖరి పిలుపు పిలిచి తన ఆఖరి శ్వాస వదిలాడు లంకన్న.

చావగా మిగిలిన చెంచు వీరులు ఆలమందల్ని తోలుకుని వెనక్కు మళ్ళారు.

వెన్నెల మెరుస్తోంది. బ్రహ్మన్న మాటలను శ్రద్ధగా వింటున్న మలిదేవాదులకు ఆలమందల వద్ద నుంచి కబురు వచ్చిందని ఒక వార్తాహరుడు వచ్చి చెప్పాడు.

"తక్షణం ప్రవేశపెట్టు" అన్నాడు బ్రహ్మన్న.

వార్తాహరుడు తెచ్చిన మాట వినగానే, బ్రహ్మన్న మహోదగ్రుడై, కుంతం పట్టుకుని - "అందర్నీ హతమారుస్తా"నని లేచి నిలబడ్డాడు.

ప్రక్కనే వున్న కన్నమ "ఈ చిన్న పనికి మీరు కావలా తండ్రీ? ఆ పనిని నేను నిర్వర్తించుకు వస్తాను." అన్నాడు.

**********

కన్నమ తన సైన్యంతో పరుగుపరుగునపోయి, ఆలమందల్ని తోలుకుపోతున్న వారిని అడ్డగించి, దొరికిన వారిని దొరికినట్టు తెగనరికి, పారిపోతున్న ఇద్దరు చెంచుల్ని పట్టుకుని మలిదేవాదుల వద్దకు హాజరు పరిచాడు.

కన్నమ ముందుకు తోస్తే - పెదమలిదేవుడు ముందుకొచ్చిపడిన చెంచు భటుడ్ని కాలితో నెత్తిన తన్ని "ఏమిట్రా ఈ దారుణం?" అని ప్రశ్నించాడు.

ఉన్నది ఉన్నట్లుగా వివరించాడు ఆ చెంచు భటుడు.

"నాగమ్మ మాటలతో నాశనమైపోయిన నలగాముడు ఏం చేస్తున్నాడో అర్థం కానంత మూర్ఖుడైపోయాడు. అన్యాయంగా మా మందను పొడిపించిన నేరానికి నేను గురజాల గుండెల్లో నిద్రపోతాను. ఫో! పోయి నీ ప్రభువుకు మేము మా వీరులతో దండెత్తి వస్తామని మా మాటగా చెప్పు" - అన్నాడు పెదమలిదేవుడు.

బ్రహ్మన్న క్షణం నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

పులిపాలు తేగల్గిన "లంకన్న" లేడు. ఎదురొచ్చినవాణ్ణి గుద్దుకు చంపగల్గిన వీర "వీరడు" కనిపించడు. దేవతల్ని సైతం యుద్ధంలో నిలువరించగలిగేంత చేవ వున్న మిగతా యోధులంతా అధర్మయుద్ధంలో ఆఖరైపోయారు. ఎంత అన్యాయం జరిగింది?

ఆలమందలను కంటికి రెప్పల్లా, కన్నబిడ్డల్లా కాపాడిన యాదవ వీరులెవ్వరూ లేకుండాపోయారు.

పచ్చని పసరిక చేలల్లో వాళ్ళ రక్తం ప్రవహించిపోయింది. కృష్ణమ్మ యాదవ రక్తాన్ని తనలో కలుపుకుని నిర్వేదంతో ప్రవహించిపోతున్నది.

**********

"ప్రభూ - చెన్నకేశవా?" అనే మాట అప్రయత్నంగా బ్రహ్మన్న నోటినుండి వెలువడింది.

"ఏమిటీ పరీక్ష తండ్రీ?" అన్నాడు.

ఈ సంఘటనతో బ్రహ్మన్న బాగా క్రుంగిపోయాడు. తన మంచితనం సమూలంగా నాశనమైపోతున్నట్టు అనుకున్నాడు. ఎందుకు నాగమ్మ తన మీద ఇంత కక్షగట్టింది? నలగాముడు మాత్రం ఇంత దిగజారిపోవాల్సిన అవసరం ఏమి వచ్చింది?

రాచరికం - దాన్ని నిలబెట్టుకోవాలనే తపన మనుష్యుల్ని ఎంత దిగజారుస్తుంది?

ఏమైనాసరే; దెబ్బకు దెబ్బ తీయాల్సిందే. మంచితనం హద్దులు దాటకూడదు. స్థబ్దుగా నిద్రపోతున్న మృగరాజును నిద్ర లేపాడు నలగాముడు. పంజా వేటును అనుభవించాల్సిందే ఆ మూర్ఖుడు.

నాగమ్మ పెద్ద గొయ్యి తవ్వింది. అందులో నలగాముడు పడిపోవటానికి సిద్ధమౌతున్నాడు. తన గుండెల మీద వేసుకుని పెంచిన పసివాడు నలగాముడు. తన మీదే కత్తి గడితే, ఏం చెయ్యాలో అర్థంగాని స్థితిలోకి వచ్చాడు బ్రహ్మన్న.

రాత్రి చాలా భాగం గడిచాక నిద్రవచ్చింది మహామంత్రి బ్రహ్మనాయుడికి.

మనిషి జీవితంలో కాలానిదెప్పుడూ చిత్రమైన పాత్ర. కాలం మనిషినెప్పుడైనా కనికరించవచ్చు; కాటు వేయావచ్చు.

అధర్మపు పందెంలో రాజ్యాన్ని పోగొట్టుకున్న మాచెర్ల ప్రభువులు మండాదిలో అనుభవించిన జీవితం అంత సుఖకరమైనది కాదు.

రాజప్రాసాదాలలో, హంసతూలికా తల్పాల మీద పవళించిన ప్రభువులు, దుర్భరమైన వనవాసంలాంటి బ్రతుకునే గడిపారు.

వీరులైన తన పరివారం మరోసారి హృదయవిదారకమైన దెబ్బతిన్నారు. ఆత్మశాంతి లేక అలమటించిపోయిన బ్రహ్మన్న, కాలం తీసిన దెబ్బకు లొంగిపోక తప్పింది కాదు.

నాలుగైదురోజులు భయంకరమైన మౌనముద్రను దాల్చిన బ్రహ్మన్న రూపాన్ని తల్చుకుంటే మలిదేవాదులుకు ఒళ్ళు జలదరించడం మొదలుపెట్టింది.

బ్రహ్మన్నలో వచ్చిన ఈ మార్పుకు మండాది ప్రజలంతా బెంబేలెత్తిపోతే, మలిదేవులకు కుడిభుజం విరిగినంత పనయింది. "మన లోకంలోకి బ్రహ్మన్న ఎప్పుడు వస్తాడు?" అని అనుకోవటం మొదలుపెట్టారు.

మలిదేవాదులు, బావ గండు కన్నమ మొదలైన వాళ్ళంతా ఆయన దగ్గరకు పోయి - "బ్రహ్మన్నా! మేమంతా నీ బిడ్డల్లాంటివాళ్ళం. నీ పరిస్థితే ఇట్లా ఉంటే మా గోడు వినేవారెవరు? మమ్మల్ని రక్షించు" అని వేడుకున్నారు.

బ్రహ్మనాయుడు తల పైకెత్తి -

"దొంగచాటుగా మన మందలను పొడిపించిన గురజాల రాజు నలగామరాజు గుండెల్లో నిద్రించకపోతే నా ఆత్మ శాంతించదు. మలిదేవా! ఇక విను. గురజాలకు నేనే స్వయంగా దండెత్తి - నలగాముణ్ణి లొంగదీసుకుంటాను." అని ప్రకటించాడు.

బావ గండుకన్నమ నివారించినా - మలిదేవాదులు అడ్డు చెప్పినా వినక - బ్రహ్మన్న యుద్ధానికి బయలుదేరాడు.

**********

మహావీరుడైన గండ భైరవుడు, బండారి, దామెన - మొదలైన వేళ్ళ మీద లెక్కపెట్టగల్గిన కొంతమంది వీరుల్ని వెంటబెట్టుకుని గురజాల వైపుకు ప్రయాణించాడు.

ప్రయాణానికి ముందు వీరవిద్యాదేవి వద్ద ఆశీర్వాదం పొంది - "తల్లీ! ఈ యాత్రలో నాకు జయం కలిగేటట్లు ఆశీర్వదించు" అని వేడుకున్నాడు.

వీరవిద్యాదేవి "నాయనా బ్రహ్మన్నా! నీవు అసామాన్యుడివి. ఎప్పుడూ జయించేది ధర్మమే. వెళ్ళిరా తండ్రీ!" అని దీవించింది.

బ్రహ్మనాయుణ్ణి సాగనంపడానికి వచ్చిన పెదమలిదేవుడు "మాలో అగ్రజుడైన నలగాముణ్ణి సంహరించవద్దని ప్రార్థిస్తున్నాను" అని ప్రాధేయపడ్డాడు.

మలిదేవుని సోదరప్రేమకు సంతోషించిన బ్రహ్మన్న "అలాగే" అన్నాడు.

ఈ యాత్రలో తనను విజయుణ్ణిగా చేయమని చెన్నకేశవుణ్ణి కోరాడు బ్రహ్మన్న.

**********

కొంతమంది వ్యక్తిత్వం అపూర్వమైనది. ఇంకొంతమంది కళ్ళల్లో అపూర్వమైన తేజస్సు ప్రకాశిస్తుంది. వారి మాటలకు తిరుగు ఉండదు. ఆ మాట వేదం - బ్రహ్మన్న ముఖవర్చస్సు అలాంటిది. బ్రహ్మన్న తన యోధులతో మరలి మాచెర్ల పట్టణానికి విచ్చేశాడు.

నిద్రపోతున్న కొండచిలువలా స్థబ్దుగా ఉన్నది మాచెర్ల. చంద్రవంక నది కూడా దిగులుగా ప్రవహిస్తున్నట్లుగా వున్నది. కళాకాంతుల్లేని మాచెర్లను చూడగానే బ్రహ్మనాయుడి కడుపులో పెదపేగు కలుక్కుమన్నది. తుప్పలతో, తుమ్మలతో పాడుబడిన అడవిలా వున్న మాచెర్లలో అడవి జంతువులు అడ్డదిడ్డంగా తిరుగుతున్నాయి. తను నిర్మించుకున్న మాచెర్లకు పట్టిన దుర్గతి ఇది.

నిత్య ధూప దీప నైవేద్యాలతో - కనులపండువగా విలసిల్లిన మాచెర్ల చెన్నుడు ఖిన్నుడై వాడిన హారాలతో వున్నాడు.

"తండ్రీ! మా బ్రతుకులకు సుఖం ఎప్పుడు? విధి కల్పించిన వినోదంలో మేము నలిగిపోతున్నాము." అన్నాడు బ్రహ్మన్న, చెన్నకేశవుణ్ణి చూసి.

క్రూరమృగాలను అదలించి, చెన్నుణ్ణి చంద్రవంక జలాలతో అభిషేకించి - పట్టుశాలువా చించి వత్తి చేసి దీపాలను వెలిగించి చెన్నకేశవుణ్ణి ఆరాధించాడు.

వేసిన మాలలు కంఠాన అలంకరించుకున్న కేశవుడి కన్నుల్లో చిరునవ్వులు వెలిగినట్లుగా అనిపించింది బ్రహ్మన్నకు.

**********

ప్రొద్దు ఏడు గడియలు పైకెక్కింది.

ఇనుడు తన కాంతులతో గురజాలను రంగురంగులతో ముంచెత్తుతున్నాడు.

బ్రహ్మన్న తన మీద యుద్ధం చేయడానికి వచ్చాడన్న వార్త నలగామునికి అందింది. బ్రహ్మనాయుడి పరాక్రమం తెలిసిన నలగాముడు భయంతో -

"నాగమ్మా - మహాప్రళయం ముంచుకొచ్చింది. అభినవ పరశురాముడికిమల్లే, బ్రహ్మన్న వచ్చేశాడు. ఎంతమందిని యమపురికంపుతాడో, ఎంతమంది రక్తం నాగులేటిలో ప్రవహించాలో, ఎంతమంది రుధిరస్నానం చేస్తారో? తల్చుకుంటేనే గుండెలవిసిపోతున్నాయి" అన్నాడు.

కొంతమంది వీరులను తన చేతికింద ఉంచుకుని నాగమ్మ - బింకంతో అంది..

"నాగమ్మ ఉండగా నలగామరాజు దిగులు పడనవసరం లేదు. గంధర్వులు తీర్చబోయే కార్యం ఆసన్నమయింది. ఏ కుందేలు కోసం ఎదురుచూస్తున్నామో, అదే దారితప్పి, సరాసరి వంటింటిలోకి వచ్చింది. అందుకు సంతోషించాలిగానీ, విచారించాల్సిన పనిలేదు రాజా" అన్నది.

ఐతే నాగమ్మ అనుకున్న "కుందేలు" మృగరాజని మర్చిపోలేదు నలగాముడు. కానీ నాగమ్మ దుర్బోధలు విన్న నలగాముడు - చిటికెలో గొప్ప అశ్వికదళాన్ని, గొప్ప వీరుల్ని ఏర్పాటు చేశాడు. ఐతే బ్రహ్మన్న మీద యుద్ధం అంటే అతనికి ఇంకా బెరుగ్గానూ, భయంగానూ వున్నది.

సేనా నాయకులు - బ్రహ్మన్న రాక కోసం ఎదురు చూస్తూ, తమ వీరులతో నిలబడి వున్నారు.

**********

బ్రహ్మన్న తన కొలది సైన్యంతో రణరంగంలో వీర విహారం చేసాడు. రక్తం ఏరులై పారించాడు.మృగరాజు జూలు విదిలంచి, కారాటవిలో వేటకు వెళ్ళినట్లుగా బ్రహ్మన్న రణరంగంలో విహరించాడు. ఎలా మృగరాజు దొరికిన
జంతువును దొరికినట్టే హతమారుస్తుందో, అలా నలగాముడు మహావీరులనుకున్న వారినందరినీ పేరు పేరునా పిలిచి మరీ సంహరించాడు బ్రహ్మన్న. అది చూసి నలగాముని సేనాపతుల గుండెలు నీరయ్యాయి.

అది కుంతమో, శివుని త్రిశూలమో అర్థం కాలేదు. అతను చేస్తున్నది యుద్ధమా లేక ప్రళయప్రభంజన విలయతాండవమా? ఇంత తక్కువ సైన్యంతో సంఖ్యాబలం వున్న తమని నిర్వీర్యం చేస్తుంటే, నలగాముని సేనాధిపతులకు ఏం చెయ్యాలో పాలుపోకుంది. చెట్టు నిండి, పండిన పళ్ళలా తలలు నేల రాలుతుంటే నాగమ్మ తల దిమ్మదిరిగిపోయింది.

బ్రహ్మనాయుని వీరత్వం ముందు నాగమ్మ కుటిలత్వం తాత్కాలికంగా తలవంచింది.

*********

విజయాన్ని సాధించి తిరిగివచ్చిన బ్రహ్మనాయుడికి అఖండమైన స్వాగతాలతో విజయగీతికలు పాడుతూ మాచెర్ల ప్రభువు, మలిదేవుడితో సహా, ప్రజలూ - ప్రముఖులంతా ఎదురు వచ్చారు.

బ్రహ్మనాయుడు చిరునవ్వుతో నగరప్రవేశం చేసాడు.

మరునాడు ఉదయం మలిదేవుడు కొలువుదీర్చి, ప్రముఖులతో కూర్చున్నవేళ బ్రహ్మనాయుడు విచ్చేసి తన స్థానంలో గంభీరంగా కూర్చున్నాడు.

"యుద్ధవార్తలు వినిపించండి మహామంత్రీ" అన్నాడు మలిదేవుడు.

బ్రహ్మనాయుడు క్షణం తాళి...

"నాశనమైపోయేవరకూ కురు యువరాజు దుర్యోధనుడు పాండవులను అదును దొరికినప్పుడల్లా, కష్టాలపాల్జేసాడు. ఇవ్వాళ నలగాముని పరిస్థితి అదే. శకునివంటి నాగమ్మ నాటిన విషవృక్షం శాఖోపశాఖలతో విస్తరించిపోయింది. ఆ విషవృక్షచ్ఛాయన సేదతీర్చుకుంటున్న నలగాముడికి గుండెల నిండా విషపుగాలి నిండివుంది.

మతాలను అడ్డుపెట్టుకుని - గొప్ప ఆటగాడిచేతిలోని తోలుబొమ్మలాగా, నలాముణ్ణి ఆడిస్తున్నది నాగమ్మ. మన మధ్య అగాధాలు పెరిగినవి. దాయాదులను ఏవిధంగా హతమార్చాలా అని, నాగమ్మా-నలగాముడూ ఆలోచిస్తున్నారు. మండాది మనకు అనుకున్నంతగా అచ్చిరాలేదు. ఇప్పుడు ఇక్కడినుంచి వెళ్ళిపోవాలి - తప్పదు."

"ఎక్కడికి మహామంత్రీ?"

"మేడపి"

"ఇది తక్షణ కర్తవ్యమా?"

"ఔను"

"అట్లాగే"

**********

మలిదేవాదులు తమ ప్రజలతో మేడపిని చేరుకున్నారు. ప్రకృతి పక్షపాతం చూపించిన ఈ మేడపి అందాలకు నిలయం. కానీ చిన్న పల్లె.

తమ కాల్బలంతో, అశ్వాలతో, వీరులతో రెండవ రోజు ప్రొద్దు వాటారుతున్న వేళకు మేడపి చేరుకున్నారు.

రాజులు తల్చుకుంటే దేనికి కొదవ?

మరో పట్టణాన్ని ఏర్పరిచాడు బ్రహ్మనాయుడు. కోటలు - దానితో బాటు పేటలు - పేటలకు బాటలు.

అన్నీ తయారయ్యాయి. మేడపి ఇప్పుడు వయసొచ్చిన సొగసుకత్తెలాగా, అందాలతో విరగపడిపోతున్నది.

ఇప్పుడది మేడపి పల్లె కాదు. అందమైన పట్టణం.

నిమ్మకు నీరెత్తినట్లు సుఖజీవనం గడుపుతున్నారు పలనాటి ప్రజలు.

**********

కాలపు సెలయేరు జరజరా పాకుతూ సంవత్సరాలను తనలో కలుపుకుంటూ పోతున్నది. మానవ జీవితంతో పెనవేసుకుపోయిన కాలానిది ఎప్పుడూ అద్భుతమైన పాత్రే.

ఏడేళ్ళను మింగింది కాలం.

అరణ్యవాసం ఆఖరిరోజు కూడా అయిపోయింది. ఇవ్వాళ నూతనకాంతులతో బాలభానుడు విజయగర్వంతో తూర్పుదిక్కున నిప్పుకత్తులు నూరుతున్నాడు.

"అరణ్యవాసం అయిపోయింది" అనుకున్నాడు బ్రహ్మన్న.

మేడపిలో జీవితం సుఖంగా సాగుతున్నదిగనుక "మాకు మళ్ళీ మాచెర్ల అక్కర్లేదు" అనుకున్నాడు మలిదేవుడు.

మలిదేవుడు హెచ్చరించలేదు గనుక కొంతకాలం తటస్థంగా ఉండిపోయాడు బ్రహ్మన్న.

మరో అర్ధసంవత్సరం గడిచిపోయింది.

**********

మలిదేవాదులు తమ ప్రజలతో మేడపిని చేరుకున్నారు. ప్రకృతి పక్షపాతం చూపించిన ఈ మేడపి అందాలకు నిలయం. కానీ చిన్న పల్లె.

తమ కాల్బలంతో, అశ్వాలతో, వీరులతో రెండవ రోజు ప్రొద్దు వాటారుతున్న వేళకు మేడపి చేరుకున్నారు.

రాజులు తల్చుకుంటే దేనికి కొదవ?

మరో పట్టణాన్ని ఏర్పరిచాడు బ్రహ్మనాయుడు. కోటలు - దానితో బాటు పేటలు - పేటలకు బాటలు. అన్నీ తయారయ్యాయి. మేడపి ఇప్పుడు వయసొచ్చిన సొగసుకత్తెలాగా, అందాలతో విరగపడిపోతున్నది.

ఇప్పుడది మేడపి పల్లె కాదు. అందమైన పట్టణం.

నిమ్మకు నీరెత్తినట్లు సుఖజీవనం గడుపుతున్నారు పలనాటి ప్రజలు.

*********

కాలపు సెలయేరు జరజరా పాకుతూ సంవత్సరాలను తనలో కలుపుకుంటూ పోతున్నది. మానవ జీవితంతో పెనవేసుకుపోయిన కాలానిది ఎప్పుడూ అద్భుతమైన పాత్రే.

ఏడేళ్ళను మింగింది కాలం.

అరణ్యవాసం ఆఖరిరోజు కూడా అయిపోయింది. ఇవ్వాళ నూతనకాంతులతో బాలభానుడు విజయగర్వంతో తూర్పుదిక్కున నిప్పుకత్తులు నూరుతున్నాడు.

"అరణ్యవాసం అయిపోయింది" అనుకున్నాడు బ్రహ్మన్న.

మేడపిలో జీవితం సుఖంగా సాగుతున్నదిగనుక "మాకు మళ్ళీ మాచెర్ల అక్కర్లేదు" అనుకున్నాడు మలిదేవుడు.

మలిదేవుడు హెచ్చరించలేదు గనుక కొంతకాలం తటస్థంగా ఉండిపోయాడు బ్రహ్మన్న.

మరో అర్ధసంవత్సరం గడిచిపోయింది.

**********

"అది కాదు!"

"నాయనా! మలిదేవా! గురజాల ప్రభువు నుండి మనం కుక్షి నింపుకోవటం కోసం తృణకణాలను కోరుకోవటం లేదు. ధర్మంగా రావలసినదాన్ని అడుగుతున్నాం. ఎంతకాలం ఈ మేడపిలో మన బ్రతుకు? గుత్తరాజ్యాలతో తనది లేని ఈ బ్రతుకు ఎంత హేయమైనదో ఆలోచిస్తే నాకు నిద్ర రావడం లేదు"

క్షణమాగి -

"కాలం ఎప్పుడూ ఒక్కర్నే కనికరించదు. కాలం కాటందిన పాండవులు పరుల పంచలో గడిపిన దుర్భరమైన జీవితాన్ని ఊహించు. దుర్యోధనుడు నశించాడు. మనకి రావలసినది నలగాముడే ఇస్తే మంచిది. అధవా ఇవ్వడూ - బలాబలాలు తేల్చుకుంటాము"

"కానీ..."

"మారణహోమమంటావా? రాజులు యుద్ధాలు చెయ్యాలి. రాజ్యాన్ని పరిరక్షించాలి. తనది నిలుపుకోవాలి" తన రాజ్యాన్ని కోరుకోలేని - లేదూ - నిలుపుకోలేని రాజు నిమిత్తమాత్రుడైన యజమానే కాని నిజమైన ప్రభువు కాలేడు. ప్రజారంజకం చేయాల్సిన పరిపాలనలో తాత్కాలిక కష్టాలే భవిష్యత్ సుఖాలకు సోపానాలు."

"ఐతే..ప్రస్తుత కర్తవ్యం..రాయబారమేనా!"

"అవును, మానవులుగా మనం చేయాల్సిన బాధ్య ఇతి. రేపటి విధి మీద ఇవ్వాల్టి "భూతం" ఆధారపడి వున్నది."

"మీ ఇష్టం" అన్నాడు మలిదేవుడు.

**********

యాదవ చంద్రమ్మ దగ్గర పెరిగిన శుక్లపక్షపు చంద్రుడు "బాలచంద్రుడు" - చంద్రుడు కళల్ని, తేజస్సును రంగరించుకుని పదిహేనేళ్ళ వాడయ్యాడు.

మహరాజుల వెంట్రుకల్ని పెంచాడు. గుర్రపుస్వారీలో, కర్రపేటులో, కత్తిపోటులో తనను మించినవారు లేదన్నట్టున్నాడు.

బాలచంద్రుడు ఎక్కడ పెరిగాడో, ఎంతడివాడయ్యాడో బ్రహ్మనాయుడికి - మాచెర్లలో వుండగానే అరణ్యవాసానికి ముందే తెలిసింది. పెద్దవాడైన బాలచంద్రుణ్ణి ఇప్పుడు అదుపులో పెట్టటం సామాన్యమైన పనికాదు.

పల్నాటిసీమలో పెరిగిన వీరచంద్రుడతడు. కత్తి పట్టుకుంటే ఎదురులేని మొనగాడతడు.

తన కొడుకు ఎక్కడ పెరిగాడో ఐతాంబకు తెలిసివచ్చింది. తన దగ్గరకు రప్పించుకున్నది.

బాలచంద్రుడు తననుంచి దూరమైనప్పుడు ఏడు కులాలనుంచి ఏడుగుర్ని తెచ్చి, తన బిడ్డల్లానే పెంచింది. లాల పోసింది-జోల పాడింది.

ఇప్పుడామె మేడపిలో కొడుకులతో సుఖంగా ఉంటున్నది.

ఐతే, బాలచంద్రుడి జీవితానికో క్రమం లేదు. విచ్చలవిడైన జీవితం అతనిది. మరీ, వయస్సు రాబోయే దశకు చివరిభాగంలో ఉన్నాడతడు. వయస్సు ఉత్త జలపాతంలాంటిదైతే, అది బాలచంద్రుడి విషయంలో గట్టు తెగిన ఏరులాంటిది. మిగతా సోదరులలో అతనే పెద్ద. అతగాడి మాటను మిగిలినవారు జవదాటలేదు.

**********

ఒక శ్రావణ్ శుద్ధ ఏకాదశి రాత్రి "శ్యామాంగి" అనే మిఠారి నృత్యం జరుగుతున్నది. అది వయస్సుతో రెపరెపలాడుతున్నది. దాని కంచుకము - దాని వక్షపు ఎత్తుకు వదలయ్యేట్టుగా వున్నది. అది కళ్ళతో సైగ చేస్తే మన్మథుడు మూర్ఛపోతాడు.

అది పౌర్ణమికి నాలుగురోజుల ముందు రాత్రి. వెన్నెల నిండు యవ్వనంలా మెరుస్తున్నది. చెన్నకేశవుడి గుడిలో శ్యామాంగి నృత్యం. ఇసుక వేస్తే రాలనంత జనం. అన్ని కులాల, అన్ని మతాల మనుషులూ అక్కడున్నారు.

ముందువరసలో, తన ఇష్టసఖులతో కూర్చునివున్నాడు బాలచంద్రుడు. నృత్యం మొదలైంది.

శ్యామాంగి అందం, పాట, ఆ శరీరపు నునుపూ, వొంపూ, దాని వగలూ చూసి బాలచంద్రుని కోడెకారు వయసు చిటికెలో మారిపోయింది. బాలచంద్రుడు శ్యామాంగి వలపుల వలలో చిక్కుకున్నాడు.

బాలచంద్రుడి అందం చూచి శ్యామాంగికి కూడా మతిపోయినంత పనయింది. అతని మెప్పుకోసం, వివశురాలై నృత్యం చేసింది.

"ఏమైనాసరే! ఈమె నాకు కావాలి" అని అనుకున్నాడు బాలచంద్రుడు.

**********

"ఎవరు?"

"బాలచంద్రుడు!"

"ఏ బాలచంద్రుడు?"

"మహామంత్రి బ్రహ్మనాయుడి ఏకైక పుత్రుడు"

శ్యామాంగి తల్లి ముసలిది. దాని రొమ్ము పడమట చంద్రుదళ్ళే దిగజారిపోయింది.

"రండి ప్రభూ-రండి" అని ఆహ్వానించింది.

బాలచంద్రుడు లోపలికి వచ్చి

"శ్యామాంగి ఎక్కడ?" అన్నాడు.

ముసలిది కులుకు నవ్వు నవ్వి - కప్పురపు తాంబూలమిచ్చి - "పైన" అన్నది. బాలచంద్రుడు గుప్పెడు కాసుల్ని దాని ముఖాన చల్లాడు.

(శ్యామాంగికి మారుపేరు "సబ్బాయి" - దాన్ని ముద్దుకు అలా పిలిచారు కాబోలు.

పేరు ఎలా వచ్చిందో నిర్ధారించడం కష్టం.)

ఏ క్షణానైనా బాలచంద్రుడు ఇట్లా వస్తాడని శ్యామాంగికి తెలుసు. సాని సబ్బాయి, ప్రియులను ఆకర్షించుకోవటంలో అందె వేసిన చేయి. ప్రియులను టక్కులతో నొక్కిపట్టే "కళే" లేకపోతే "కళావంతుల" బ్రతుకు బూడిదలో పన్నీరే.

బాలచంద్రుడు మేడ పై భాగంలో హంసతూలికా తల్పంతో అలంకరించిన గదికొచ్చాడు.

అగరువత్తుల వాసన గుప్పుమన్నది.

సబ్బాయి జిగజిగలాడుతున్నది.

రొమ్ము మీద ముత్యాలహారం వేసింది. విరిదండలు సిగలో నొగసుగా తురిమింది. కస్తూరి కాటుకను కంటి కొసల మీద అందంగా దిద్దింది. కటిసీమ క్రిందుగా చీరను నొగసుగా జారవిడిచింది. దాని తొడల లావణ్యం అందంగా మన్మథుని విడిది ఇల్లులా ఉంది.

జారవ్యాత్తిలో వున్న కళలన్నింటినీ కుమ్మరించింది సబ్బాయి.

"శ్యామాంగీ!"

అది బెట్టుగా మాట్లాడలేదు కానీ గుట్టుగా ఒక చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వుకు బాలచంద్రుడి మతిపోయింది. ఆ లాస్యంలో జాతి వజ్రాలు వొలికినట్లు కంపించాయి.

"శ్యామూ!" - శ్యామాంగి సిగ్గుతో మొగ్గయి, అటునుంచి ఇటుకు తిరిగి "ప్రభూ!" అంది.

అతను అంతులేని తమితో చెక్కిలి పంటితో నొక్కి "సిగ్గా! పలకవేం?" అన్నాడు.

"రాకరాక ప్రభువులు మా ఇంటికొస్తే - మాట తడబడుతోంది. మనసు తొణుకుతోంది." అన్నది.

"సెరజాణవే!" అన్నాడు.

అది నవ్వి "మాజాతే అంత" అన్నది.

"అంటే - "

"జాణలు కాక మా జాతిలో పుడితే - మురుగు కాల్వలో పూసిన పువ్వులతో సమానమే!" అన్నది.

అతను దాని రొమ్ము మధ్యభాగంలో తలదాచుకున్నాడు.

"నిన్ను చూస్తే పిచ్చెక్కుతున్నది" అన్నాడు.

సబ్బాయి అతన్ని తన మీదకు లాక్కుని "ఈ శరీరము, ఈ సుఖమూ మీకొరకే - దోరపండును కొరికి తినండి" అన్నది.

తొలి శృంగారంలో సుఖం దొరికిన బాలచంద్రుడు దాని ఇంట రసికరాజ్యపు బందీ ఐనాడు.

*********

రాత్రంతా శ్యామాంగి ఇల్లూ, పగలంతా వినోదాలతో, ఆటలతో బాలచంద్రుడు క్షణం తీరికలేని మనిషయ్యాడు. బాలచంద్రుడు బొంగరాలాటలో ప్రవీణుడు.

వ్రతాలు నోయగా నోయగా లేకలేకపుట్టిన కొడుకు - మనసులో ఏం బాధపడతాడో అని, బాలచంద్రుడు తల్లి ఐతాంబ భయపడుతున్నది.

ఒక కొలిక్కిరాని రాచకార్యాలలో బ్రహ్మనాయుడు కొడుకు సంగతి ఎన్నడూ పట్టించుకోలేదు. పైపెచ్చు కొడుకును ఇటువంటి లాలసత్వానికి ప్రోత్సహించాడేమో కూడా. ఎందుకంటే పల్నాటినాట రక్తపుటేరులు పారిస్తాడని జ్యోతిష్కులు చెప్పిన మాట బ్రహ్మన్న మనసులో నాటుకుపోయింది. సహజంగా వీరుడూ, ఉద్రేకి ఐన బాలచంద్రుడు రాజకీయాలకు ఎంతదూరంగా ఉంటే అంతమంచిదని బ్రహ్మన్న ఉద్దేశ్యం.

ఈరోజుల్లోనే గండు కన్నమ కూతురు "మాంచాల"ను బాలచంద్రుడికిచ్చి పెళ్ళి చేశారు.

రంగరంగ వైభవంగా జరిగిన గొప్పపెళ్ళి అది. మాంచాల తల్లి "రేఖాంబ". మంచితనానికి పెట్టిన పేరు.

పెళ్ళైన తర్వాత వచ్చే తొలిరాత్రి, నగాతో అలంకరించిన గదిలోకి మాంచాలను పంపారు. అగరొత్తుల వాసనలతో, మల్లెపూల పరిమళంతో, అందంగా అలంకరించిన గదిలో, సిగ్గులు సింగారించిన మాంచాల కాలుమోపింది.

కానీ బాలచంద్రుడు గదిలో లేడు. అప్పటికే అతను శ్యామాంగి ఇంట్లో వున్నాడు.

భర్త ఇంకా గదిలోనే వున్నాడనుకుని నునుసిగ్గులతో చిటికిన వేలికి చీరంచు చుట్టుకుని, కుడికాలు బొటనవేలితో నేలరాస్తూ గదిలోనే నిలబడిపోయింది మాంచాల.

స్త్రీ సహజమైన బిడియంతో నిలబడిపోయిన మాంచాల కాలం కాసేపు గడిచాక తలెత్తి చూస్తే భర్త లేడు.

గదంతా తిరిగింది.

బైట చంద్రవంక నదిలో వెన్నెల నిరర్థకంగా పడుతోంది. ఆ వెన్నెలలానే ఆ రాత్రి మాంచాల బ్రతుకులో నిరుపయోగమైపోయింది.

కళ్ళ వెంట నీళ్ళొచాయి. నిట్టూర్పులతో, కన్నీళ్ళతో, మధ్యరాత్రి మీద మాంచాల కంటి మీదకు కునుకువచ్చింది.

**********

బాలచంద్రుడికి తన మీద ఇష్టమని సబ్బాయికి తెలుసును గానీ భార్య ముఖమైనా చూడకుండా, తొలిరాత్రి తనకోసం వస్తాడని ఊహించలేదు.

"ప్రభూ!"

"శ్యామా!"

"మీరు ఇలా వస్తే లోకం నన్ను ఆడిపోసుకొంటుంది. వెలయాలి వలలో చిక్కి మగనాలిని వదిలి వచ్చాడనే అపప్రధ నాకు నిలిచిపోదా?" అన్నది.

"అది నా ఇష్టం" అన్నాడు బాలచంద్రుడు.

దిక్కుమాలిన రాత్రి గడిచి మాంచాలకు తెల్లవారింది.

కోడలు ముఖం చూసి ఏం జరిగివుంటుందో ఊహించింది ఐతాంబ.

"రాత్రి అబ్బాయి లేడా?" అని అడిగింది ఐతాంబ.

రాబోయే కన్నీటిని కష్టం మీద అదుపులో పెట్టుకుని "మీ అబ్బాయి సంగతి ఇన్నేళ్ళు పెంచిన మీకే తెలియకపోతే నిన్న వచ్చిన నాకు ఎట్లా తెలుస్తుంది?" అని అన్నది మాంచాల.

బాలచంద్రుడు జీవితాన్ని ఇంత నిరర్థకంగా గడిపేస్తున్నాడనే సంగతి తెలిసి కూడా

బ్రహ్మనాయుడు ఏమీ మాట్లాడలేదు. "ఎట్లా జరగాలని వుంటే అట్లా జరుగుతుంది" అన్నాడాయన.

మలినిద్ర అయి మరలిపోబోతున్నప్పుడాఇనా భర్తను కంట చూడలేకపోయిన మాంచాల పగిలిన మనసుతో పుట్టింటికి పోయింది.

మోహం పాము విషం కన్నా బలమైనది.

దానికున్న శక్తి అపారమైనది. బాలచంద్రుడులాంటి వీరుణ్ణి కేవలం తుచ్ఛమైన స్త్రీ వలపులో, ఏటి ఇసుకమేటలాంటి స్త్రీ పొందులో, నీటి చలమ వుందని భావించటమేననీ, స్వతహాగా ఉద్రేకీ, చిన్నవాడూ ఐన బాలచంద్రుడికి ఎవరూ బోధించలేదు.

జీవితం అలా గాడితప్పింది.

*********

ఏది ఏమైనా తమ రాజ్యభాగం తమకు కావాలని, భట్టును రాయబారానికి పంపుదామనుకున్న మలిదేవుడు, బ్రహ్మనాయుడు ఇత్యాదులు ఇప్పుడు ఆ ఆలోచన మార్చుకుని 'అలరాజు''ను రాయబారిగా పంపాలనుకున్నారు.

మలిదేవుని ఆస్థానంలో సేనాపతిగా వుంటున్న కొమ్మరాజు కొడుకైన అలరాజును రాయబారిగా పంపటం ఉచితమని అందరూ భావించారు.

అలరాజు ఇటు పక్షానికి ఎంత ముఖ్యో అటు పక్షానికీ అంతే ముఖ్యుడు. అదీగాక ధర్మాధర్మాలను సరిగా తూచగల అలరాజు ఉచితానుచితాలు తెలిసిన వ్యక్తి. కత్తి పట్టుకుంటే ఎదురు లేడనిపించుకోగల అసహాయశురుడు. అతనే రాయబారానికి పోవడం రాజకీయంగా మంచి ఆలోచన.

నలగాముడు ఎంత మూర్ఖుడైనా, రాక్షసుడైనా, తన ఏకైక ముద్దుల కూతురు పేరిందేవి పసుపు, కుంకుమలను హరించేటంత నీచుడు కాడు. అందుకని అల్లుణ్ణి రాయబారినికి పంపితేనే నలగాముని మనసులోని ఉద్దేశ్యం తేటతెల్లమౌతుంది.

కానీ ఈ ఆలోచన కొమ్మరాజుకు నచ్చలేదు.

"నలగాముడు మూర్ఖుడూ, ఆలోచనాశూన్యుడు. అతనికి ఉచితానుచితాలు ఇసుమంతైనా తెలీదు. అలరాజును రాయబారానికి పంపటం నాకు సుతరామూ ఇష్టంలేదు" అన్నాడాయన.

"కొమ్మరాజా - అలరాజుకొచ్చిన భయం ఏమీ లేదు. నిస్సందేహంగా అతన్ని గురజాల పంపుదాం. ప్రభువుల కార్యాన్ని నిర్వర్తించగల గొప్ప సమర్థుడు మరొక్కడు కనిపించడంలేదు" అన్నాడు బ్రహ్మన్న.

"మునుపు భట్టును రాయబారిగా పంపుదామనుకున్నాం గదా! ఇంతలో మార్చుకోవలసిన అవసరమేమి వచ్చిందని? భట్టునో, మరే బ్రాహ్మణుణ్ణో రాయబారిగా పంపటం అనాదిగా జరుగుతున్నదేగదా!" అన్నాడు కొమ్మరాజు.

"నిజమే; ఐతే పెదమలిదేవుడు అలరాజును సూచించాడు. నాకూ అది సమ్మతంగానే కనిపించింది. ఎందుచేతనంటే, అల్లుడైన అలరాజు మాట మామగారైన నలగాముడు కాదనలేడుగదా!" అన్నాడు బ్రహ్మన్న.

"కానీ..." అన్నాడు కొమ్మరాజు.

"కొమ్మరాజా! నీ భయం నా కర్థమైంది. నాకూ ఒక కొడుకున్నాడు గదా! నీ బిడ్డ తిరిగివచ్చేదాకా, నా బిడ్డను నీ దగ్గరుంచుకో. బాలచంద్రుడి శౌర్యం నీకు తెలియంది కాదు. సాహసికుడైన నా కొడుకును నీకు కానుకగా ఇస్తున్నాను." అన్నాడు బ్రహ్మన్న.

ఐన కొమ్మరాజు మనసెందుకో సమాధాన పడలేదు. అలరాజును పంపాలంటే అతనికి ఏమిటోగా ఉంది.

మలిదేవుడి మాటను తీసివేయటానికీ మనసొప్పటంలేదు. కొడుకును గురజాల పంపటానికి గుండె

చాలటం లేదు. అందుకని క్షణం ఆలోచించి - "బావా బ్రహ్మన్నా - నేనన్నానని నీవు ఏమీ అనుకోవద్దు. ఒక్కసారి నీ చెల్లెలిని కూడా కనుక్కో!" అన్నాడు.

"అవశ్యం" అన్నాడు బ్రహ్మన్న.

**********

కొమ్మరాజు భార్య 'చల్లమాదేవి" ప్రస్తుతం వంకిదేవి అనే వూరిలో వుంది. బ్రహ్మనాయుడు వంకిదేవికి ప్రయాణమయ్యాడు.

బ్రహ్మనాయుడు తన ఇంటికి వస్తున్నాడని తెలిసిన చల్లమాదేవి, ఆయనకు సకల స్వాగతాలను ఎదురు పంపింది. దాసదాసీలు పన్నీటితో పాదాలు కడిగారు.

తలుపు చాటున నిలబడి, పరమసాధ్వి, దొడ్డ ఇల్లాలు ఐన చల్లమా దేవి, ఉచితాసీనుడైన బ్రహ్మన్నతో ఇట్లా అంది -

"అన్నా! రాకరాక మా ఇంటికొచ్చారు. మా గృహాన్ని పావనం చేసారు. నాకు చాలా సంతోషంగా వుంది. వచ్చిన కారణమేమిటో సెలవిస్తే వినాలని వుంది" అన్నది.

"చెల్లమ్మా! నీ కొడుకు అలరాజును ఉన్న సమస్యలన్నీ పరిష్కరించి, మన రాజ్యభాగం అడగడానికని గురజాలకు పంపాలనుకొన్నాము. బావ కొమ్మరాజు నీ అనుమతి కూడా పొందమన్నాడు" అన్నాడు.

ఈ మాటలు వినగానే చల్లమాదేవికి కళ్ళు తిరిగిన పనై, చిత్తరువులో బొమ్మలా బిత్తరపోయి-

"అన్నా! ఏమిటిది?" అన్నది.

"ఔనమ్మా! ప్రభువుల కార్యాన్ని నిర్వర్తించగల మరో సమర్థుడు కాన రావడం లేదు. అందువలన నువ్వు అనుమతినివ్వాల్సిందే తల్లీ!" అన్నాడు.

చల్లమాదేవి కళ్ళనీరు కళ్ళల్లోనే అదుముకుని, చలించిపోతున్న ఆత్మను అదుపులో పెట్టుకుని -

"అన్నా! మా అత్త కనిన ఐదుగురు కొడుకుల్లో, ఆ ఐదువంశాలకూ ఒక్కడే వారసుడీ అలరాజు. కళ్ళన్నీ వాడి మీదే పెట్టుకుని బ్రతుకుతున్నాం. నా భర్త, నిన్ను నమ్ముకుని మలిదేవుల కొలువులో వున్నారు. జరగరానిదేదైనా జరిగితే, మాకెవ్వరు దిక్కు? అప్పుడు ఏ దేవుడు మా మొరలు వింటాడు? ధర్మనిర్ణయంలో నిష్ణాతుడివైన నీకు తెలియని ధర్మమేమున్నది అన్నా!" అన్నది.

బ్రహ్మనాయుడు గంభీరంగా నిట్టూర్చి - "చెల్లెమ్మా! నేనూ పిల్లలుగల తండ్రినే. నీకు ఒక్కడే కొడుకైన అలరాజు ఎలానో, నాకూ ఒక్కడే ఐన బాలచంద్రుడూ అలాగే. అందుకే నా కొడుకును నీ భర్తకు దానమిచ్చాను. వీరపత్నులు, వీరమాతలైన వాళ్ళు మాత్రమే తమ భర్తలను, సుతులను

రాచకార్యాలకు పంపుతారు, రణాలు చేయించుతారు. అలరాజు శౌర్యపరాక్రమాలు తెలియక తల్లి మనసుతో ఆలోచిస్తున్నావే తప్ప, నీకు బిడ్డలైన పల్నాటి ప్రజల గురించి ఆలోచించలేకపోతున్నావు. వారు సుఖంగా బ్రతికే మార్గాన్ని నిష్కంటకం చేసుకువచ్చి, పల్నాటిలో తన పేరును సుస్థిరం చేసుకుంటాడు అలరాజు. దీవించి పంపు తల్లీ - నిన్ను చేతులు జోడించి అర్థిస్తున్నాను" అన్నాడు బ్రహ్మన్న.

అంతటి బ్రహ్మన్నే దోసిలొగ్గి నిలబడేసరికి, ఎదురు చెప్పలేకపోయింది చల్లమాదేవి.

"అన్నా! నీకెదురు చెప్పలేకపోతున్నాను. కానీ గతి తప్పుతున్న నా మతిని అదుపులో పెట్టుకోలేకపోతున్నాను. సరే! మీ ఇష్టప్రకారమే కానివ్వండి" అంది.

బ్రహ్మనాయుడు సంతోషంగా భోజన, తాంబూలాలను స్వీకరించి వెనక్కు మరలాడు.

చల్లమ్మ కళ్ళనుంచి రాలి పడిన కన్నీటి కళ్ళాపికి తడిసిన ఆ లోగిలోని ముగ్గులు మౌనంగా రోదించాయి.

**********

కొలువుకూటంలో కూర్చున్న నలగాముని దగ్గరకు అలరాజు పంపిన వార్తాహరుడొకడు వచ్చి- "అలరాజుగారు రాయబారానికి వచ్చి రెంటాలలో వున్నారు. మీరు రమ్మని సెలవిస్తే వెళ్ళి వినిపిస్తాను" అన్నాడు.

"అవశ్యం" అన్నాడు నలగాముడు.

"ఆజ్ఞ" అని వెళ్ళిపోయాడు వార్తాహరుడు.

భ్రుకుటి ముడిచి "అలరాజు వచ్చిన కార్యమేమిటో?" అన్నది నాగమ్మ.

"తను రాజ్యభాగం అడగటానికి వచ్చాడు కాబోలు ధర్మమే కదా?" అన్నాడు నలగాముడు.

"అది వీల్లేదు" అన్నది నాగమ్మ.

"అదేమిటి నాగమాంబా..."

"అది అంతే ప్రభూ! కోడి పందెంలో మనం రాజ్యాన్ని జయించాం. దాని మీద అన్ని హక్కులూ మనవి. అట్లా రాజ్యం ఇవ్వంటానికి వీల్లేదని నా మనవి."

"కానీ ధర్మం అంటూ ఒకటిన్నది గదా?"

"ధర్మం...ధర్మం! ఆ ధర్మం బ్రహ్మన్నకూ ఉండాలికదా? ఆనాడు కోడిపందెంలో మనం ఓడిపోతే, వనవాసం సంగతేమోగానీ, మనలను నిలువ నీడ లేకుండా, నామరూపాలు లేకుండా నాశనం చేసేవాడే. ధర్మం మనవైపున, దైవం మన పనుపున ఉండి జయించాము గానీ లేకపోతే మన బ్రతుకు అధ్వాన్నమై పోయి ఉండేది."

నరసింగరాజు జోక్యం కలిగించుకుని - "నాగమాంబ చెప్పినది సరైనదే అని నా అభిప్రాయం" అన్నాడు.

నలగాముడు ఆలోచనలో పడ్డాడు.

కోడేరు గుట్టల్లో జరిగిన కోడిపందెం ఇంకా గుర్తున్నది నాగమాంబకు. "ఆనాడు అలరాజు తన మీద కత్తి విసిరాడు. నాగుబాము కాటు అందుకోవల్సిందే. అతన్ని నాశనం చెయ్యకపోతే తన కంటికి నిద్రరాదు. బ్రతుకుకు సుఖం లేదు." అనుకున్నది నాగమ్మ.

ఆ పూటకు కొలువు చాలించాడు నలగాముడు.

మరుసటిరోజు రాయబారానికి వచ్చాడు అలరాజు.

ఏకాంతమందిరంలో నరసింగరాజును ఒంటరిగా కలుసుకున్నది నాగమ్మ.

"నరసింగరాజా!"

"మహామంత్రిణీ!"

"అట్లా కూర్చోండి. నేను చెప్పబోయేదేమిటో ఒకసారి జాగ్రత్తగా వినండి. ఆపైన మీ ఇష్టం"

"చెప్పండి"

"నలగామరాజు ఎవరు?"

"మా అన్న"

"ఎట్లాంటి అన్న?"

"దాయాది అన్న."

"దాయాదులు సోదరుల చావు కోరుతారనే విషయం మీకు తెలియంది కాదు!"

"........"

"పోతే! ఇప్పుడు రాయబారినికి వచ్చిందెవరు?"

"అలరాజు"

"అనగా!"

"మా అన్న అల్లుడు"

"అంటే?"

"మా పేరిందేవి భర్త" - నరసింగరాజు గొంతులో చిరాకు, కనుబొమల ముడిలో అసహనం కనిపించాయి నాగమ్మకు.

నాగమ్మ ఒక్క నవ్వు నవ్వి "మూర్ఖులే కోపం తెచ్చుకుంటారు. అవునా?" అంది.

నరసింగరాజు స్థబ్దుడైనాడు.

నాగమ్మ నరసింగరాజు ముఖంలోకి తీక్షణంగా చూస్తే, అది ఆతని గుండెల్లో దిగబడినట్లైంది.

"నరసింగరాజా! రేపు రాయబారానికి వస్తున్నవాడు అలరాజు. అరివీర భయంకరులైన పల్నాటి వీరుల్లో ఒక్కడు. అదీగాక, అతగాడు మీ అన్నకు అల్లుడవడం చేత ఈ రాజ్యానికి ఉత్తరాధికారి కూడా!"

నరసింగరాజు చప్పున తలెత్తి నాగమ్మను చూసాడు.

నాగమ్మ భృకుటి విరిచి, కుటిలమైన నవ్వు నవ్వి - "ఈ విషయాలు మున్ముందు మాట్లాడుకుందాం. అలరాజు రాయబారానికని ఇంకొన్ని క్షణాల్లో రానున్నాడు. అక్కడ రాయబారాన్ని నేను చెడగొట్టదల్చుకున్నాను. మీరు చేయవలసింది ఏమనగా...అక్కడ నన్ను సమర్థించడమే"

"అనగా?"

"గంధర్వులు తీర్చవలసిన కార్యాన్ని నేను తీరుస్తాను" అని నర్మగర్భంగా అంది.

***********

ఆ తర్వాత ఇద్దరూ కలిసి సభా భవనానికి వచ్చారు.

ఈలోపునే అలరాజు సభాప్రాంగణా ముఖద్వారం నుంచి, లోపలికి విచ్చేసాడు. విచ్చేసి, దూత గనుక ప్రభువుకూ, ఉచిత స్థానాలనలంకరించిన పెద్దలకూ వినమ్రుడై నమస్కరించాడు.

"అంతా క్షేమమా?" అన్నాడు నలగాముడు.

"ఆ...సేమమే" అన్నాడు అలరాజు.

"ఇంతకూ తమ రాకకు కారణం?" అంది నాగమ్మ.

"వింపిస్తాను మహామంత్రిణీ" అని అలరాజంటే "చిత్తం!" అని ఎద్దేవగా అన్నది నాగమాంబ.

"పల్నాటి ప్రముఖులకు, పండితులకు, ప్రజలకు, అందరకూ మరోసారి నా నమస్కారాలు. ప్రభూ, వినిపించమన్నారా?" అన్నాడు అలరాజు.

"అవశ్యం" అన్నాడు నలగాముడు.

"మహారాజా! కోడిపందెంలో రాజ్యాన్ని వదులుకున్న మలిదేవాదులు, ఉభయుల అంగీకారప్రకారం ఏడేళ్ళు అరణ్యవాసం చేసారు. మరో ఆర్నెల్లు ఆపైన గడిచాయి. అనుకున్న మాట ప్రకారం తమ

రాజ్యం తమకు ఇవ్వమని నన్ను రాయబారిగా పంపారు. ఈ రాయబారాన్ని మన్నించి, వారి రాజ్యం వారికివ్వండి. ప్రభువులు ఉచితానుచిత నిర్ణయం చేయగలరని భావిస్తున్నాను."

"ప్రభువులకు ఉచితానుచితాల గురించి రాయబారులు బోధించాల్సిన పనిలేదు" అన్నది నాగమ్మ.

"చిత్తం. కానీ నా ధర్మాన్ని నేను నిర్వర్తిస్తున్నాను." అన్నాడు అలరాజు.

"రాజ్యం ఇవ్వకపోతే!" అన్నాడు నలగాముడు.

"యుద్ధమే..." అన్నాడు అలరాజు.

"అంతా మీరే నిర్ణయించుకున్నాక, ఇప్పుడీ రాయబారమెందుకు?" అన్నాడు నలగాముడు.

"ప్రతి పనికీ, ప్రతి ధర్మానికీ, ప్రతి సంఘానికీ, ప్రతి రాచరికానీ కొన్ని కట్టుబాట్లుంటాయి. రాయబారమనేది ప్రాచీనంగా వస్తున్న ఒక రాచరికపు కట్టుబాటు. దాన్ని మీరు మన్నించినా, మన్నించకపోయినా మేము మా బాధ్యతగా వచ్చాము."

ఈ జవాబుకు నలగాముడు మండిపడి - "అల్లుడా!" అన్నాడు.

"నేను అలరాజును. ప్రస్తుతానికి దూతను. అల్లుడా అని పిలవకండి" అన్నాడు అలరాజు.

నలగాముడు దెబ్బతిన్న పులిలా హుంకరించి - "అలరాజా - మలిదేవాదులు కోడిపందెంలో ఒడ్డి వాళ్ళ రాజ్యాన్ని పోగొట్టుకున్నారు. నిజానికి మాచెర్ల మాది. ఏడేళ్ళ తర్వాత వచ్చి మా రాజ్యాన్ని భాగాలు చెయ్యమనే అధికారం మలిదేవాదులకు లేదు" అన్నాడు.

అలరాజు క్షణంసేపు సభవైపు కలయజూసి - "నలగామరాజా! ఇదేనా మీ తుదినిర్ణయం?" అన్నాడు.

"ఔను" అన్నాడు నలగాముడు.

"మరొక్కసారి ఆలోచించండి" అన్నాడు అలరాజు.

రెట్టించిన అలరాజు స్వరం విని మహోదగ్రుడైన నలగాముడు - "అలరాజా! నీ బాధ్యత నువ్వు నిర్వర్తించావు. అంతేకానీ ఇన్నిసార్లు మమ్మల్ని హెచ్చరించాల్సిన పనిలేదు. పల్నాటి ప్రభువులమైన మా దగ్గర అసంఖ్యాక సేనాబలగం వున్నది. ఏనుగులతో, గుర్రాలతో, పదాతి దళాలతో మేము ఎవరినైనా ఎదిరించడానికి సిద్ధంగా వున్నాం. మీసముంటే, రోసముంటే, ఈ యాచనెందుకు? ఈ శుష్కమైన హెచ్చరికలెందుకు? రాయబారాలెందుకు? యుద్ధమే మీ లక్ష్యమైనప్పుడు మన మనతనాన్ని కారెంపూడిలో, కదనరంగంలో తేల్చుకుందాం"

కోపంతో రెచ్చిన కళ్ళలో నిప్పులు కురిపిస్తూ - "ఏం చూసుకుని, ఎవర్ని చూసుకుని మిడిసిపడుతున్నారో ఆ రానున్న యుద్ధంలో, కాలం ఇవ్వనున్న తీర్పులో, కారెంపూడి రణక్షేత్రాన నేల కూలుతున్న సమయాన అలరాజు రాయబారం విలువేమిటో మీకు జ్ఞప్తికి రాక మానదు. యుద్ధం మీద మీకు అంత అలవికాని మమకారమే వుంటే, దూతగా తగదన్నా అలరాజుగా కాదనను. బ్రహ్మనాయుడి అపూర్వ పర్యవేక్షణలో మాచెర్ల ప్రభువులు సమాయత్త పర్చిన సేనలు వీరభూమిలో విజృంభించి రక్తపుటేరులు పారించే వేళ - మీ మీ పరాక్రమాలు ఏ పాటివో మేమూ చూడకపోము." అని గర్జించాడు అలరాజు.

సభలో కూర్చున్న వీరుల్లో ఒకడు లేచి - "మలిదేవాదుల రాజ్యం వారికివ్వటమే ధర్మం ప్రభూ!" అని అంటే నాగమ్మ వెంటనే అందుకుని - "రాజ్యం పోగొట్టుకున్న మలిదేవులకు రాజ్యాన్ని తిరిగిపొందే అధికారం లేదు. ఈ రాయబారాలతో ఏమీ ప్రయోజనం లేదు" అన్నది.

"ప్రజాభీష్టాన్నైనా మన్నించండి ప్రభూ" అని అలరాజు అంటే "యుక్తాయుక్త విచక్షణా జ్ఞానాన్ని గురించి మీరు ప్రభువులకు ఉపదేశం చెయ్యాల్సిన పనిలేదు" అని ఎదురాడింది నాగమ్మ.

"చిత్తం!" అని తిరస్కార స్వరంతో నాగమ్మను అపహాస్యం చేసాడు అలరాజు.

తన వ్యంగ్యాన్ని తన మీదకే తిరిగి సంధించిన అలరాజుని చూసి "మూర్ఖులు రాయబారులుగా రా తగదు" అని నాగమ్మ అంటే నిలువెల్లా కోపంతో మండిపోయిన అలరాజు సర్రున కత్తి దుసి, క్షణం తాళి "దూతగా వచ్చాను గనుక బ్రతికిపోయా"వని అంటూ ఎత్తిన కత్తిని దించడం వీరలక్షణం కాదు గనుక పక్కనున్న చెక్క స్థంభాన్ని ఒక్కవ్రేటున కొడితే అది రెండు ముక్కలయింది.

భయంతో నాగమ్మ వళ్ళు ఝల్లుమంది.

అలరాజు ఆఖరి హితవుగా ఇలా అన్నాడు - "మహారాజా! దూతగా వచ్చిన నేను ఆ చివరి మాటల్ని చెబుతున్నాను. బ్రహ్మనాయుడంటే నీవేమిటో అనుకుంటున్నావు. తేరిచూడరాని శౌర్యధనుడాయన. కుంతలం పట్టుకుని రణభూమిలో నిలబడితే ఆ ఫాలాక్షుడే వచ్చినట్లుంటుంది. న్యాయానికి కట్టుబడి జరిగినంత కాలమూ మీ మోసాల్ని క్షమిస్తూ వచ్చాడు. గుర్తుందా! మా ఆలమందల్ని నువ్వు, నీ పరివారమూ వెనుకవ్రేటుగా వొడిపించినప్పడు, బ్రహ్మన్న ఒక్కడే దండేత్తి వస్తే,

బ్రాహ్మణుల వెనుక దాక్కొన్నావు. హు! ప్రాణభయంతో పారిపోయేవాళ్ళను, ఎదురు నిలబడి ఎదుర్కోలేని పిరికిపందలనూ తాకని మా బ్రహ్మన్న దయతో బ్రతికి పోయి ఈ సింహాసనం పై ఇంకా కూర్చుని వున్నావు.

ఇక మా వీరుల్ని పరిచయం చేస్తాను...వినండి...

కన్నమనాయుడు కత్తిపట్టుకుంటే, ఈ సభలో కూర్చున్న, మీసమున్న మొనగాడెవ్వడూ నిలవలేడు.

వీరకన్నమదాసు అగ్గితో సమానం. కొమ్మరాజు అపర ద్రోణాచార్యుడు. చిన్నవాడైనా, మా బాలచంద్రుడు ఏడుగుర్ని ఒకరి మీద ఒకర్ని వేసి కట్టగట్టి నరికితే క్రింద నేల కూడా తెగుతుంది.

ఇక నా గురించి...వద్దు....ఆత్మస్తుతి మంచిది కాదు. ఎదురునిల్చినప్పుడే అదే తెలిసి వస్తుంది" అన్నాడు.

ఈ మాటలతో అహం దెబ్బతిన్న నరసింహరాజు "అలరాజా!" అని భీకరంగా అరిచాడు "ఆపు. మీకు మూతిన మీసాలుంటే మాకు ముంజేతిన వున్నాయి. శౌర్యవంతులు, వీరులూ యుద్ధం చేసి చస్తారు. నీలా వ్యర్థప్రలాపాలతో పొద్దు పుచ్చరు. మాల కన్నమ లాంటి కడజాతి వాళ్ళను సరి వీరులుగా చెప్పకుంటున్నావే, నీలో క్షాత్ర రక్తం చచ్చిందా? వినటానికే సిగ్గుగా వుంది. కడజాతివళ్ళను కట్టగలిపి, చాపకూడు పెట్టిన బ్రహ్మన్న పౌరుషమేమిటో ఇక్కడ అందరికన్నా నాకే ఎక్కువ తెలుసు. రాజ్యం వీరభోజ్యం. ధర్మాన్ని గురించి చర్చలనవసరం. వీరత్వముంటే యుద్ధంలో మమ్మల్ని జయించి రాజ్యాన్ని పొందండి. గురజాల ప్రభువులు మహా వీరులు. ఎదురొడ్డడమే గానీ వెన్ను చూపడం లేదు" అన్నాడు.

పరిస్థితి చేయిదాటున్నదని గమనించిన నలగాముడు వేడిని చల్లార్చడానికి గానూ సభను చాలించాడు. సభామందిరం బైట "ఇంటికి రా అల్లుడూ" అని అలరాజును కోరితే, సున్నితంగా తిరస్కరించి "విడిదికే నా పయనం" అని నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు అలరాజు.

************

నాగమ్మ హృదయంలో కార్చిచ్చు రేగుతోంది. కత్తిని తన మీద విసరబోయిన అలరాజే మాటిమాటికీ గుర్తుకువస్తున్నాడు.

అతన్ని నిర్మూలించి తీరాలి. అతను బ్రతికివుంటే తన బ్రతుక్కు రక్షణ లేదు. తన మీద కత్తికట్టినవారు ఎవరైనాకానీ అంతం గాక తప్పదు. ఇది నిర్ణయంగా నిశ్చయించుకున్నది నాగమ్మ.

*ఐతే ఇక్కడ ప్రచారంలో వున్నా నాకు (రచయిత చిట్టిబాబు) తెలిసిన రెండు కథల్ని వినిపిస్తాను.*

మామగారైన నలగామరాజు మాటను కొట్టివెయ్యలేక, స్వతహాగా పెద్దమనసున్న అలరాజు విడిదికి విచ్చేశాడు. విడిది ఇంటిని అందంగా తీర్చిదిద్దారు. ధూపదీపాల్తో ఆ మేడకు కళ వచ్చింది.

నిజానికి నాగమ్మ మీద పౌరుషంతో కత్తి ఎత్తిన అలరాజు ఆ విషయాన్ని "కానున్నది కాకమానదు" అనే ఉద్దేశంతో మర్చిపోయాడు. కానీ నాగమ్మ ఎట్లా మరుస్తుంది?

తన మందిరంలో ఏకాంతంగా కూర్చుని నరసింగరాజును మరొక్కసారి వున్నపళంగా రమ్మని కబురుచేసింది. కబురు వినీ వినంగానే రయ్యిమని పరుగెత్తుకొచ్చాడు నరసింగరాజు.

"కూర్చోండి మహాప్రభూ!" అన్నది నాగమ్మ.

ఈ కొత్త సంబోధన వినగానే మతిపోయింది నరసింగరాజుకు - "అదేమిటి మహామంత్రిణీ?" అన్నాడు.

నాగమ్మ నరసింగరాజు ముఖంలోకి చూసి - "సమయం ఆసన్నమైనది నరసింగరాజా, బాగా ఆలోచించుకో! విజ్ఞులైన మీకు చెప్పగల్గిందేమీ లేదు. నలగామరాజు వెనుక చేతులు కట్టుకుని, గంగిరెద్దులాగా తలవూపి, ఆయన చెప్పిన ప్రతి పనీ చేస్తూ, ప్రత్యేకతలేక జీవిస్తారో, ఈ నాగమాంబ మాటలు విని, గురజాల ప్రభువై ప్రజారంజకంగా పరిపాలిస్తారో ఆలోచించి చెప్పండి!" అన్నది.

తనే మళ్ళీ కొనసాగిస్తూ "ఇవ్వాళ వచ్చిన దూతా....?" అని ఆగింది.

"అలరాజు"

"అనగా మీ అన్న అల్లుడు. ఒక్కమాటగా పేరిందేవి భర్త."

"ఐతే..."

నాగమ్మ చిత్రంగా నవ్వి "మీ తల సరిగ్గా పనిచెయ్యటం లేదు. అలరాజు పేరిందేవి భర్త. కావున నలగామరాజు తర్వాత గురజాలకు కాబోయే ప్రభువు" అన్నది.

"అవును. నిజమే!" అన్నాడు నరసింగరాజు.

"ని...జ...మే" - మాటను విరిచి చాలా ఎద్దేవగా అన్నది నాగమాంబ. "అలరాజు ఈ గద్దెమీద కాలుపెట్టిన రోజున మీరు కేవలం ఈ ఇంటి పనిజేసే మగదాసీవారు. నేనో? బైటకువెళ్ళగొట్టబడబోయే ఓ అనామక స్త్రీని. ఆహా! కోపం వద్దు నరసింగరాజా! కొంచెం శాంతంగా ఆలోచించండి." మిమ్మల్ని ఈ గురజాలకు తిరుగులేని ప్రభువుగా నిలిపి - మీ మంత్రిణిగా, ఆంతరంగికురాలిగా ఉండిపోవాలనేది నా చిరకాల వాంఛ" అన్నది.

ఏమీ మాట్లాడక మౌనం వహించాడు నరసింగరాజు.

"మీరు మహరాజు కావాలంటే ఒకేఒక మార్గమున్నది."

"ఏమిటది?"

"అలరాజును ఈ ప్రపంచంనుంచి శాశ్వతంగా పంపించివేయాలి"

"అమ్మో!"

"ఏమిటా పిరికితనం?"

"పిరికితనం కాదు. విధవగా మా పేరమ్మను నేను ఊహించలేను. పేరిందేవిని చిన్నతనంనుంచి నా గుండెల మీద వేసుకుని పెంచాను."

"మీ ఇష్టం. మహరాజుగా మిమ్మల్ని చూడాలని అనుకున్నాను. కానీ కర్మ ఇలాగుంటే నేనేం చెయ్యగలను!"

నరసింగరాజు ఆలోచనలో పడ్డాడు. విషబీజం అంటూ మానస క్షేత్రంలో మొలవాలేగానీ, అది క్షణాల్లో శాఖోపశాఖలతో విస్తరించిపోతుంది. నరసింగుని ప్రస్తుత పరిస్థితి అదే. "నేను రాజును కావాలి. అంటే అలరాజు అడ్డు తొలగాలి" అని అతను మనసులో పదేపదే అనుకోసాగాడు. మనిషి రెండు భావాల సంఘర్షణలో పడినప్పుడు ఉచ్ఛనీచాల బేరీజు విషయంలో తికమకపడ్తాడు.

పేరిందేవి తను కంటికి రెప్పగా పెంచిన పిల్ల. సుఖాలను చవిచూడనిది. తొలకరివయసులో, భర్త కోసం కళ్ళల్లో దీపాలు వెలిగించుకుని - అనుభవించబోయే ముందు జీవితం కోసం, ఆశలతో బ్రతుకుతున్న ముగ్ధ.

హేయమైన రాజ్యం కోసం - చరిత్ర బ్రతికున్నంత కాలం, తన పేరు పల్నాటి చరిత్రలో కళంకితంగా నిల్చిపోవటమా? - "ఛీ...ఛీ..వద్దు వద్దు. ఈ పాపపు పని నేను చెయ్యలేను" అని అనుకున్నాడు కాసేపు.

మళ్ళీ అతని మనసు రాజ్యాధికారం వైపు మళ్ళింది. రాజ్యం వీరభోజ్యం. రాజైనవాడు వెలలేని ఐశ్వర్యాలతో, తులలేని సుఖాలతో హాయిగా బ్రతుకుతాడు. శాసనకర్తయై సమస్త సామంత,

వందిమాగధ, పరివార జనాలతో, పాలితుల నీరాజనాలందుకుంటాడు. నాగమాంబ చెప్పింది ఈ వైభవం గురించే. ఆ వైభవ విలాసాన్ని తను కాకుండా అన్యులనుభవించడం అధర్మం.

అన్న తర్వాత అనుభవం, అర్హత ఉన్నది తనకే. అలరాజుకు దక్కే రాజ్యాధికారం కేవలం కాకతాళీయం. శత్రువుల్ని ఎదిరించి, మంత్రాంగాల్ని నెరిపి, ఈ రాజ్యాన్ని ఏకఛత్రాటిగా నిలిపే మహోన్నత ప్రయత్నంలో రాజుగారి తమ్ముడిగా కాక "నరసింగరాజు"గా తనదైన ముద్రవేసాడు, అలాంటి వాడికి కాక నిన్న లేక మొన్న, తన కళ్ళెదురుగా పుట్టిన ఓ కుర్రవాడికి అధికారం దక్కుతుందని అనుకోగానే అతని మనసులో విద్వేషాగ్ని ఒక్కసారిగా భగ్గుమంది.

అలరాజు సింహాసనమెక్కితే, పక్కనే తను చేతులు కట్టుకుని నిలబడ్డ దృశ్యాన్ని ఊహించుకుంటేనే కంపరమెత్తిపోతోంది. ఔను. అది దుస్సహమే - దుర్భరమే. అంతేకాదు హృదయవిదారకం కూడా. పారంపర్యంగా లభించాల్సిన అధికారం పరుల పాలైనప్పుడు తను అనుభవించబోయే దైన్యం, హైన్యం, మానసిక క్లేశం ముందు, పేరిందేవి వైధవ్యం అల్పంగా తోచసాగింది నరసింగుకు.

చరిత్ర దుమ్మెత్తిపోసినా, పేరిందేవిని విధవను చేసైనా సరే తను గురజాలకు మహాప్రభువు కావలసిందేనన్న కృత నిశ్చయానికి వచ్చేసాడు నరసింగు.

"మహామంత్రిణీ! ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?" అన్నాడు.

"కార్యమైతే ఉంది గానీ చేసేందుకు ధైర్యముందా?" అంది నాగమ్మ.

"ఆ(...కావలసినదానికంటే ఎక్కువే" అన్నాడు నరసింగరాజు పొగరుగా.

"ఒప్పుకున్న తర్వాత నీరుకారిపోకూడదు సుమా!" అంది నాగమ్మ కవ్వింపుగా.

"ఊహూ" అని తలనడ్డంగా ఆడించాడు నరసింగు.

"ఐతే జాగ్రత్తగా వినండి. విడిది ఇంటికి విచ్చేసువున్నాడు ఈ ఇంటి అల్లుడు. విందుభోజనాన్ని అతగాడు సుతరామూ అంగీకరించడు. తగినన్ని జాగ్రత్తలు చెప్పకుండా పంపివుండడా బ్రహ్మన్న. ఆ ప్రక్కనే వీరకన్నమదాసు వున్నాడు. ప్రభుభక్తిలో అతన్ని మించినవారు లేరు. కానీ కనీస మర్యాదగా పానీయాన్నైనా స్వీకరించమని అర్థిస్తే కాదనడు అలరాజు. ఇదే అదనుగా మనం తీసుకోవాలి.

మందిరంలో మీరు, నేను, నలగాములు, అలరాజు మాత్రమే ఉంటాము. నాలుగు పాన పాత్రలూ వుంటాయి. అందులో ఒకదానిలో విషం కలిపిన పానీయముంటుంది. అది నలగామరాజుకు ఇస్తాము."

"ఆ(...అన్నగారికి విషపాత్రనా?"

"హాహాహా...అక్కడే ఉంది కిటుకు నరసింగరాజా - అలరాజు ఒప్పకున్నా పానీయం తీసుకోడానికి ఒప్పకోడు కన్నమదాసు. స్వతహాగా మంచివారు, అల్లుడిపై అవ్యాజ్యమైన ప్రేమ ఉన్న నలగామరాజు తన పాత్రను అల్లుడికిచ్చి, అల్లుడి చేతి పాత్రను తను తీసుకుంటారు."

"వినడానికి బాగానే వుంది. కానీ అనుకున్నట్టుగా జరగకపోతే?"

"నిజమే. కీడెంచి మేలెంచటం విజ్ఞుల లక్షణం. మీరు అన్న ఆ ప్రమాదం లేకపోలేదు. కానీ అది జరగదని నా నమ్మకం. ఒకవేళ అదే జరిగితే నలగాముడు పరలోకానికి, మీరు మహరాజ స్థానానికి చేరుతారు."

"నాగమాంబా!"

"కంగారు పడకండి! ఒకవేళ మీరనుకున్నట్లే జరిగినా ఇది నీ మంచికే. విషాన్ని మీరిచ్చినట్లు ఎవ్వరూ నమ్మరు. అధికారం మీ చేతుల్లోకి సుఖంగా వచ్చి చేరుతుంది."

"అదీ నిజమే!" అన్నాడు నరసింగుడు.

**********

అలరాజు విడిదిలో కొచ్చేటప్పటికే, సెలరాజు మసక వెన్నెల మలామా వేశాడు భూమికి. ప్రకృతి రవరవలతో పులకించిపోతున్నది. విడిదిమందిరంలో విలాసినులు, పట్టు పరుపుల మీద కూర్చున్న ప్రభువులకు వింజామరలు విసురుతున్నారు.

"భోజనాలు కానిద్దామా?" అన్నాడు నరసింగరాజు.

"దూతగా వచ్చాన్నేను. విందుల కోసం కాదు." అన్నాడు అలరాజు.

"నీవు భోంచేయకపోతే నాకు తృప్తిగా ఉండదు నాయనా" అన్నాడు నలగామరాజు.

"వీల్లేదు" అన్నాడు అలరాజు.

"కనీసం పానీయాన్నైనా తీసుకో నాయనా" అని అభ్యర్థించాడు నలగాముడు.

అలరాజు వీరకన్నమదాసు వంక కన్నెత్తి చూసాడు. కన్నముదు వద్దన్నట్టు సైగ చేసి "బ్రహ్మన్న గారి మాట మరవకండి ప్రభూ!" అన్నాడు.

అప్పటికే పాత్రలు సిద్ధమైనాయి.

విషపాత్ర నలగాముని చేతిలో ఉంది.

"అంటే ఏమిటి కన్నమా నీ ఉద్దేశ్యం?" అన్నాడు నలగాముడు.

క్షణం నిశ్శబ్దం.

"కూతురి కాపురం కూలదోసుకునేటంత పాషండుడు కాడు నలగాముడు. నీకు అంత భయం ఉంటే నా పాత్ర తీసుకో అల్లుడూ"

"ఫరవాలేదు" అన్నాడు అలరాజు.

"కన్నమ తృపతి కోసం తీసుకో" అన్నాడు నలగాముడు.

నలగాముని చేతిలోని పానపాత్ర అలరాజు చేతిలోకెళ్తే, నాగమ్మ పాచిక పారినట్టుగా ఓ చిరునవ్వును పెదాల మీదికి తెచ్చుకుంది.

ఇచ్చకాలతో, ముచ్చట్లతో కాసేపు గడిచింది.

"వెళ్ళివస్తాను. సెలవ్" అన్నాడు అలరాజు.

"శుభం. అంతా మంచే జరగాలి నాయనా" అన్నాడు నలగాముడు.

దీవించడమైతే దీవించాడు గానీ, తన చేతుల మీదే అశుభం కల్లుతుందనీ, తన చిన్నారి కూతురు పచ్చని బ్రతుకులో చిచ్చు రేగబోయే భయంకరమైన క్షణం ఆసన్నమవబోతోందనీ అతగాడు ఊహించలేకపోయాడు.

తన్న తమ్ముడు, తన మంత్రి పన్నిన పన్నాగం తన చేతులారా ఇంతటి విపత్కర పరిస్థితికి దారి తీస్తుందని అనుకోవటానికి మాత్రం నలగామునికి ఆస్కారం ఎక్కడున్నది?

అలరాజు గుర్రమెక్కాడు. వెనకనే వీరకన్నమ.

అశ్వాలు ఆఘమేఘాలతో మాచెర్ల వైపు పరుగెత్తుతున్నాయి. రెండు యోజనాలు దూరం రాగానే అలరాజుకు కడుపులో దేవుతున్నట్లైయింది. వాంతి అయింది. భళుక్కున చారెడు రక్తం కక్కాడు. అప్రయత్నంగా అతని చెయ్యి గుర్రం కళ్ళాన్ని బిగదీసింది. ఉరుకులు, పరుగుల మీదనున్న గుర్రం ఒక్కసారిగా ఆగిపోయింది. వెనకనే వస్తున్న కన్నమ అలరాజును అందుకున్నాడు.

"కన్నమా"

"ప్రభూ!"

"కడుపులో మంటలు రేగుతున్నాయి. విషప్రయోగమే జరిగింది. గుండెలు బరువెక్కుతున్నాయి. శరీరం తూలుతున్నది. నువ్వొక్కసారి వెనక్కువెళ్ళి, పేరిందేవితో చెప్పిరా. వేగిరం వెళ్ళిరా" అన్నాడు.

"స్వామీ" అన్నాడు కన్నమదాసు. "ఎంత ఘోరం జరిగిపోయింది ప్రభూ" అని దు:ఖించసాగాడు.

ప్రభువాజ్ఞ మేరకు గుర్రాన్ని వెనక్కు మళ్ళించాడు కన్నమ.

పక్కనే వున్న నాగులేరు నెమ్మదిగా ప్రవహిస్తోంది.

ఆ నాగులేటి గట్టున మహావీరుడు, శత్రుభయంకరుడూ, నిష్కల్మషుడూ ఐన అలరాజు, కత్తిపట్టుకుంటే శత్రుసేనావాహినిని గజగజలాడించగల్గిన యువ వీరుడు, బ్రతుకు చివరి క్షణాల్లో, మృత్యువుకౌగిట్లో చేరబోతున్నాడు.

నాలుక పిడచగట్టుకుపోతున్నది. "తండ్రీ!" అన్నాడు గుర్రన్ని. ఆ క్షణంలో అదొక్కటే అతనికి తోడు, స్నేహితుడు, ప్రియబంధువు. యజమాని మాట విన్న గుర్రం చెవులు నిక్కబొడిచింది.

"దిగలేకపోతున్నాను నాయనా. నువ్వే ముందుకు వంగు" అన్నాడు.

ప్రభువు పలుకులు విన్న గుర్రం నాగులేటి నీళ్ళల్లోకి ముందుకు వంగింది. మరొక్క చారెడు రక్తం కక్కుకున్నాడు అలరాజు. దావానలమైన మంటలు మండుతున్నాయి లోన. గుర్రం నుండి క్రిందకు జారాడు అలరాజు.

బాధను భరించలేక సర్రున కత్తిదీసి పొడుచుకోబోయినాడు. యజమానికి గుర్రం తన డొక్కను అడ్డుపెట్టింది. కత్తి దెబ్బకు ముందుకు తూలింది గుర్రం. దోసిళ్ళలోకి నీళ్ళు తీసుకున్నాడు అలరాజు. ఆ నీళ్ళు నోట్లోకి పోకమునుపే అతని ప్రాణాలు పోయాయి. యజమాని పోయిన కొన్ని క్షణాల్లోనే తనూ ప్రాణం విడిచింది గుర్రం. నాగులేటి నీళ్ళల్లో ఆ ఇద్దరి రక్తం కొట్టుకుపోసాగింది.

పైన చెప్పినది ఒక కథ ఐతే, అలరాజు మరణం పై మరో కథ కూడ ఉంది.

అలరాజు మీద పగబట్టిన నాగమ్మ ఏకాంత మందిరంలో నలగామునిని కలుసుకున్నది. "ప్రభూ! నేను మంత్రి పదవినుంచి విరమించదలచుకున్నాను" అన్నది.

నలగాముడు ఉలిక్కిపడి - "అదేమిటి మహామంత్రిణీ! గురజాల-మాచెర్ల కత్తులు దూసుకుంటున్న ఈ పరిస్థితుల్లో మీరు ఇలా చెయ్యడం బావోలేదు" అన్నాడు.

"ఒక్క షరతు మీద మాత్రమే ఉంటాను"

"ఏమిటది?"

"మాటనిచ్చిన తర్వాత తప్పకూడదు"

"నిశ్చయంగా"

"ఐతే అలరాజును అంతమొందించడి"

"నాగమాంబా?" అన్నాడు దగ్గున పీఠం మీదనుంచి లేచిన నలగాముడు. "ఏమిటి మీరు మాట్లాడుతున్నది? అలరాజు నా స్వంత అల్లుడు. నా చిన్నారి కూతురి సౌభాగ్యం."

"నేను ధర్మం గూర్చి మాట్లాడుతున్నాను మహారాజా. అతను మీకల్లుడు కావొచ్చు. కానీ మనకు ప్రబల శత్రువు. మీ మంత్రినై మంత్రాంగం నెరపుతున్నది ఎందుకు? మీ క్షేమం, ఈ దేశ క్షేమం కోరి. మహరాజులై మీరు మాత్రం ప్రజా శ్రేయస్సును కోరరా? ఈరోజు సభలో నాపైన కత్తి ఎత్తిన అలరాజు, రేపు మీ మీద ఎత్తడని ఏమిటి నమ్మకం. అతని అడ్డులేకపోవడమే మనకు క్షేమం" అన్నది నాగమ్మ.

నలగాముడు బిత్తరపోయి, అచేనంగా కూర్చుండిపోయాడు. ఆతని మౌనమే అంగీకారంగా భావించింది నాగమ్మ. ఆమె పెదవులపై అప్పుడు పుట్టిన విషపు నవ్వు పల్నాటి చరిత్రలో రక్తపుటేరుల్ని పారించింది.

గురజాలలో "తంబళ్ళ జియ్యరు" అనే పూలమ్ముకునేవాడున్నాడు. పూలమాలలను అందంగా అల్లడంలో వాడు సిద్ధహస్తుడు. పూవు లోపల కాలకూట విషాన్ని కూడా నేర్పుగా కూర్చగల పనివాడు. నాగమ్మ కబురు విని, చిక్కబట్టిన గుండెలతో ఆమె విశల సౌధంలోని ఏకాంత మందిరంలో ప్రవేశించాడు.

"జియ్యరూ! పరమ రహస్యమొకటి చెబుతున్నాను. శ్రద్ధగా విను. ప్రభువుల మన రాజ్య క్షేమం కొరకు, ప్రజాశ్రేయస్సు కొరకు ఓ కఠినకార్యాన్ని నాకు అప్పగించారు. నీవు అందమైన జాతి పూలతో మాలను కట్టి అందులో విషాన్ని ఉంచాలి. అది వాసన చూసిన వారు తక్షణమే మరణించాలి. నేను చెప్పిన వ్యక్తికి నువ్వే స్వయంగా ఆ మాలను అందించాలి. తెలిసిందా!" అని గద్దించినట్టుగా అన్నది నాగమ్మ.

"చి...చిత్తం. ఆ వ్యక్తి ఎవ్వరో?" అన్నాడు.

కుటిలమైన నవ్వొక్కటి తన్నుకురాగా, విలాసంగా నవ్వుతూ "అలరాజు. మహారాజుగారి ముద్దుల అల్లుడు" అన్నది.

"ఆ(....పేరిందేవిగారి పెనిమిటి. అమ్మా...నేనీ పాపపు పని చెయ్యలేను" అని ప్రాధేయపడ్డాడు జియ్యరు.

నాగమ్మ కనుసైగతో వీరభద్రుడు కత్తి దూస్తే, ప్రాణభయం గుండెల నిండా అలుముకుంటుంటే సరేనని తలవూపాడు జియ్యరు. స్వంత ప్రాణం కంటే తీపి కాదుగా అలరాజు ప్రాణం!

సంధికార్యం ముగించుకుని వెనుదిరుగుతున్న అలరాజు, కన్నమదాసులు "మేడిచెర్ల" అనే ప్రాంతాన్ని చేరుకుంటున్నారు. సరిగ్గా అక్కడే వారికి ఎదురువచ్చాడు తంబళ్ళ జియ్యరు.

ఆ ఉషోదయపు చల్లగాలిలో జియ్యరు కట్టిన మాలల్లోని జాతి పూల పరిమళాలాలు గుప్పుమంటున్నాయి.

ఆ పరిమళాలను ఆఘ్రాణిస్తూ ఆగాడు అలరాజు. "ఓయీ! నీ మాలల సౌరభం అంతా ఇంతా కాదు. ఎక్కడికిన్ని మాలల్ని తీసుకెళ్తున్నావు?" అన్నాడు. "మహామంత్రిణి నాగమ్మ గారి శివార్చన కోసం దొరా" అన్నాడు జియ్యరు.

"హు(...చేయించేవన్నీ కుటిలోపాయాలు, చేసేది మాత్రం శివపూజలా?" అన్నాడు అలరాజు పరిహాసంగా. గట్టిగా నవ్వాడు కన్నమదాసు.

"చూడు! నేను కూడా భగవద్భక్తుడనే. దొంగపూజలను చెయ్యను సుమా! మరి నాకూ ఓ మంచి మాలనిస్తావా?" అన్నాడు హాస్యంగా.

"దొడ్డవారు. మీరడిగితే కాదనగలనా ప్రభూ. నా అదృష్టంఏనని భావిస్తాను. ఈ మాల తీసుకోండి. జాతైన పూలతో అల్లింది. దీని సుగంధం ముందు మిగతావన్నీ తీసికట్టే" అన్నాడు.

కాలకూట విషమున్న మాల అలరాజు చేతికి చేరింది. వారి గుర్రాలలా ముందుకు కదలగానే "మేడిచెర్ల"కు పరుగెట్టి ఓ ఇంటి నెలమాళిగలో దాక్కున్నాడట జియ్యరు. అలరాజు మరణిస్తే ఆతని ప్రక్కనే వున్న కాలయముడులాంటి వీరకన్నమడికి తన మీద అనుమానం రావడం ఖాయమనీ, తన తల వ్రక్కలు కావడమూ తథ్యమని వాడు భయపడ్డాడు.

అఘ్రాణిస్తున్న ప్రతిసారీ కాలకూటం అలరాజు గుండెల్లోకి చేరసాగింది.

అలరాజుకు కళ్ళు తిరుగుతున్నాయి. శ్వాస మందగిస్తోంది. చూపు ఆనకుండా పోతోంది. పువ్వులో వున్నది పరిమళం కాదని, కాలకూటమనీ అర్థమైపోయింది.

"కన్నమా"

"ప్రభూ!"

"చెండులోని విషయం గుండెకెక్కింది. తాళికట్టినదాదిగా, ఏ సుఖమూ ఎరుగని పేరిందేవి, గురజాల అంత:పురంలో నాగురించి కలలు కంటుంటుంది. ఏనాటికైనా నేను తన దగ్గరికి వస్తానని నమ్ముకుని వున్న ఆ అమాయకురాలి దగ్గరకు వెళ్ళు. నీ అలరాజు రాడని, ఎన్నటికీ రాలేడని చెప్పు. వేగిరం వెళ్ళు. మరో మాట రాయబారం విఫలమయ్యిందని, నాగమ్మ మంత్రాంగానికి ప్రతి తంత్రం చెయ్యాలని నా మాటగా బ్రహ్మన్నకు చెప్పు. వో...వో..." అని కన్ను మూసాడు అలరాజు.

కాలం రాజకీయం పేరుతో, దాయాది వైషమ్యంతో మహావీరుడైన అలరాజును క్రూరంగా మ్రింగివేయడాన్ని చూసిన కన్నమదాసుకు పాలుపోవడంలేదు. తను ప్రక్కనేవుండి కూడా ప్రభువును రక్షించుకోలేకపోయాడు.

కొమ్మరాజును ఎలా ఓదార్చాలి? ముద్దుల పేరిందేవికి ఈ విషయం ఎలా చెప్పాలి? మలిదేవుడు, బ్రహ్మన్నలకు ఎలా ముఖం చూపించాలి? చల్లనితల్లి రేఖాంబకు కన్నకొడుకులేడన్న సత్యాన్ని ఎలా చెప్పాలి?

కన్నమ గుర్రం డొక్కలో తంతే, అది సుడిగాలిలా గురజాల వైపుకు దూసుకెళ్ళింది.

పల్నాటి చరిత్రలో - అలరాజు పాత్ర అలా అంతమైపోయింది. పేరిందేవి కన్నీటితో మాత్రమే వ్రాయగల్గిన కథగా మిగిలిపోయింది.

*********

రాత్రి రాని భర్త తెల్లవారాకయినా తనను చూడడానికి వస్తాడనుకున్న పేరిందేవి, చీని చీనాంబరాలు అలంకరించుకుని తుదిమెరుగ్గా బొట్టుపెట్టుకోబోతున్నది.

"అమ్మా...పేరిందేవీ!" అనే కన్నమదాసు కేక వినగానే, చేతిలో వున్న కుంకుమభరిణె ఖణేలుమని జారికిందపడింది. ఒక విచిత్రమైన శబ్దం చేసింది. కుంకుమ నేలను రక్తవర్ణంలోకి మార్చింది.

జారిపోతున్న పైటతో, నేలరాలిపోయిన కుంకుమ భరిణె వంక చూస్తూ - "భగవాన్ ! ఏమిటీ అపశకునం" అనే మాటలు అప్రయత్నంగా ఆమె నోటి నుంచి వచ్చింది.

"పేరిందేవీ!"

తనను ఎవరో పిలుస్తున్నారు. ఎక్కడో పరిచితమైన గొంతు. కన్నమనిది కాదుగదా?

"కన్నమా! ఏమిటయ్యా ఆ కన్నీరు?"

"నీ బ్రతుకును కన్నీటిలో కలిపి అలరాజు అస్తమించాడమ్మా. చెల్లెమ్మా! మన నెలరాజు అస్తమించాడమ్మా!" అన్నాడు కన్నమదాసు.

"స్వామీ!" అంటూ కుప్పకూలింది పేరిందేవి.

అలరాజు మరణవార్త భయంకర దావానలంలాగా రచనగరు అంతా చిటికెలో పాకిపోయింది.

గురజాలలో ఎక్కడవిన్నా ఇదే మాట - "అలరాజు విషయప్రయోగంతో మరణించాడు" అని. నలగాముడు, నాగమ్మా - ఎవరో ఒకరు ఈ ఘోరాన్ని చేసివుంటారన్న మాటలు కూడా చాప క్రింద నీరులా పాకాయి.

ఈ వార్త విన్న నలగాముడు కుప్పకూలిపోతే, మొసలి కన్నీటితో "అయ్యో!" అని ఆక్రోశించాడు నరసింగరాజు. "ఎంత ఘోరం జరిగింది మా పేరిందేవికి?" అన్నది నాగమ్మ.

ఈ వార్త విన్న క్షణాన తండ్రీ-పినతండ్రీ-నాగమ్మ ముగ్గురూ నలగాముని మందిరంలో ఉన్నారు.

కాలి మట్టెలు మ్రోగించుకుంటూ, అవతరించిన శోకదేవతలాగా, అక్కడ ప్రత్యక్షమైంది పేరిందేవి. కరుడుగట్టిన స్మశాన నైరాశ్యంలో, ఘోరమైన నిశ్శబ్దం అంతఃపుర్రాన్ని అలుముకున్నది.

"విన్నారా నాన్నా?" అన్నది పేరిందేవి.

కూతురును ఆ స్థితిలో చూసిన నలగాముడు గుండె బద్దలౌతుండగా - "విన్నాను తల్లీ" అన్నాడు.

తన తలను నలగాముడు నిమరబోతే - "అంటుకోవద్దు. దూరంగా వుండు. నీకు మైల అంటుకుంటుంది" అంది పేరిందేవి.

"తల్లీ!" అని నలగాముడు తల్లడిల్లితే - " మరణించింది నా భర్త. నా ఇంటి మైల నీకు సోకడం ఎందుకులే నాన్నా!" అంది పేరిందేవి.

నలగాముడు భరించరాని శోకంతో విలవిల్లాడిపోతున్నాడు. తను చేసిన పాపమేమిటో ఆయనకు తెలిసివచ్చింది. ఇంత దురాగతానికి తనే పాల్పడ్డాడా? రాజ్యకాంక్ష కన్న కూతురి పసుపుకుంకుమకన్నా ఎక్కువా?

"ఏడుస్తున్నావా నాన్నా? ఏడ్వద్దు. కావాలని చేసినదానికి ఏడుపెందుకు? నా బదులు నీవు కన్నీరు పెట్టుకుంటున్నావా? నీ రాజ్యాన్ని ఇక నిశ్చింతగా ఏలుకో! కడసారిగా ఒక్క మాట చెప్పాలని వుంది. బహుశా ఇవి నేను నీతో మాట్లాడే ఆఖరు మాటలనుకుంటాను. పేరిందేవి కన్నీరొలికిన చోట శాంతి ఉండదు. పేరిందేవి నల్ల పూసలు తెగిన ఈ పల్నాటి సీమలో నాలుగు మణుగుల నల్లపూసలు తెగుతాయి. ఇది నా శాపం!" అన్నది.

అటువైపుకు తిరిగి నిలబడివున్నాడు నరసింగరాజు.

"చిన్నన్నా! ఒకసారి నా కళ్ళలోకి చూడు. నీ చిన్నారు పేరిందేవి ముఖంలోకి చూడు. నన్ను నిద్రబుచ్చిన నీ గుండెలను అడుగు - నీవు చేసింది ఎంత క్షమించరాని పాతకమో! కాలి పారాణి ఇంకా ఆరలేదు. కన్నుకల తీరలేదు. జీవితపు తొలిభాగం కదలలేదు. కంటి కాటుక రవ్వంత మాయలేదు. కట్టుకున్న బాసికపు ముడిక్రింద కందిన చర్మపు రంగు పోలేదు. తండ్రి తర్వాత తండ్రి వంటి వాడివి - ఏ చేతుల మీద పెళ్ళికూతురుని చేశావో, అదే చేతుల మీదే నన్ను కాటికంపుతున్నావా? నేనుపోయాక ఈ పల్నాటిలో తుమ్మలూ, జిల్లేళ్ళు మొలుస్తాయి. తర్నాల సీమలో రాళ్ళే దొరుకుతాయి. ఇది తథ్యం" అని నాగమ్మ వైపుకు తిరిగింది పేరిందేవి -

"మహామంత్రిణి...నాగమ్మా! నన్ను చూసి ప్రేమతో నవ్వితే, వెన్ను నిమిరితే నమ్మి మోసపోయాను. ఏ ఆడది చెయ్యలేని పాపం చేసి చరిత్రలో ఆడవాళ్ళు చెయ్యలేని పాపమేదీ లేదని ఋజువు పరిచావు. విధవగా, తాత్కాలిక రాజ్యభోగాలతో తుచ్ఛమైన జీవితం గడుపుతున్నావు నీవు. నీ తెలివి నా భర్తను చంపటానికే ఉపయోగపడితే, నీలాంటి దుర్మార్గురాలు ఈ పల్నాటి చరిత్రలో మరొక్కరు పుట్టరు. నీలాగా విధవగా బ్రతకలేను. సూర్యచంద్రుల సాక్షిగా, పల్నాటిసీమ సాక్షిగా, నాగులేటి నీటి సాక్షిగా, గతించిన నా పతిదేవుని పాదాల సాక్షిగా నేను నా భర్తతో సహగమనం చేసి ఇక్కడ అనుభవించలేని సుఖాలను అక్కడ అనుభవిస్తాను. ఇదే నా నిర్ణయం."

వడివడిగా పేరమ్మ అడుగులు వేసుకుంటూ అంత:పురం వదిలి బైటికొచ్చింది. అప్పటికే మాచెర్లలో కార్చిచ్చులాగా అలరాజు మరణవార్త చేరిపోయింది.

కన్నమనాయుడు క్రింద కూలి, తట్టుకోలేని శోకంతో "కొడుకా!" అన్నాడు.

అలరాజు తల్లి రేఖాంబ తమిలేని దుఃఖంతో "తండ్రీ! నా కడుపున చిచ్చుపెట్టిపోయినావా?" అని కొడుకు ముఖాన్ని గుండెల కదుముని, రాళ్ళు కరిగేట్టు, సర్వ ప్రపంచమూ విలవిల్లాడేట్టు కన్నీరు కారుస్తున్నది.

బ్రహ్మన్న నిరుత్తరుడైపోతే, మలిదేవుడు "అలరాజా! మా కోసం మరణించావా నేస్తం" అన్నాడు.

గుసగుసలతో మాచెర్ల కుతకుతలాడిపోతున్నది.

************

పేరమ్మ అంత:పురం వదిలి బయలుదేరబోయే ముందు కన్నతండ్రివంక చూసి ఇట్లా అన్నది - "నా పసుపు కుంకుమలు నిండిన ఈ నేలలో క్షామం విలయతాండవం చేస్తుంది. గురజాల వీరులంతా కారెంపూడి రణక్షేత్రంలో నేలరాలిపోతారు. నాలాగా వేలాదిమంది స్త్రీలు విధవలౌతారు." అని భవిష్యత్తును పలికింది.

మేడిచెర్లలోనే ఉన్న అలరాజు భౌతికదేహం వద్ద పల్లకీ దిగిన పేరిందేవి, భర్త ముఖాన్ని చూస్తూ క్షణం దిమ్మెరపోయి నిలబడి, ఆ తర్వాత ఆపుకోలేని దుఃఖోద్వేగంతో, పాదాల మీదపడి "వీరులైన భర్తలు రణభూమిలో మరణిస్తే, భార్యలు వీరపత్నులౌతారు. అధర్మంగా మరణిస్తే విధవలౌతారు. నేను విధవగా గాక సధవగా బ్రతుకుతాను. మీతోటే చితియెక్కి కాలి భస్మమౌతాను." అన్నది.

ఎవరు చెప్పినా పేరిందేవి వినక, చితినెక్కింది.

(**<u>రచయిత వివరణ:</u>** చరిత్రలు ఎప్పుడూ ఒకేరకంగా వివరించబడి ఉండలేదు. ఒక చిన్న విషయం మీద రకరకాల అపప్రథలు, నిర్ధారణలూ, విమర్శలూ మనం చూస్తూనే వుంటాము. సాహితీ పరమైన విమర్శలతో, పాక్షికమైన అనుభవాన్ని, అనుభూతులనూ, స్పష్టమైన నిర్ధారణలనూ ఏర్పరచుకోవడం విజ్ఞులైన పాఠకుల వంతు.

ఐతే, ఈ వీరభారతంలో, 'ఇట్లా ఖచ్చితంగా జరిగింది అనే విషయాన్ని రచయితగా నేను (చిట్టిబాబు) నిర్ధాకరించకపోవటానికి కారణం అదే. నాకు తెలిసినంత వరకూ - నాకు తెలిసిన విషయాలను

ఉల్లేఖించాను. రసజ్ఞులైన పాఠకులు తమకు ఇష్టమైన దానిని, ఖచ్చితం అనుకున్నదానిని మాత్రమే తీసుకోమని ప్రార్థిస్తున్నాను.

కొన్ని చరిత్రల్లో పేరిందేవి పల్లకీ ఎక్కి మేడిచర్ల వచ్చేదాక, కొనవూపిరితో కొట్టుకుంటున్న అలరాజు ఉన్నాడని రాయబడ్డది. విషయప్రయోగం జరిగిన తర్వాత ఇన్ని గంటలు అలరాజు బ్రతికి ఉండడం వీలుపడని విషయమని అనిపిస్తుంది. ఒకవేళ అట్లా బ్రతికివుంటే, మనుషులు జాలి చూపకపోయినా మృత్యువు జాలిచూపి, తన భార్యను కడసారి చూసుకోవటం కోసం అలరాజును బ్రతికించిఉండాలి. లేక పేరిందేవి భర్తతో ఆఖరి పల్కులు పల్కటం కోసమైనా అలరాజు బ్రతికి ఉండిఉండాలి.

తండ్రులు మోసం చేసినా, చావు మోసం చెయ్యక, కనీస సానుభూతులతో పేరిందేవి కోసం అలరాజును కొద్దిక్షణాలు బ్రతికించివున్నట్లైతే, మనుష్యుల ఇష్టజన సఖీసఖ పరివారం కన్నా మృత్యువు స్నేహపాత్రురాలు, విశ్వాసమరమైనదని రూఢిగా చెప్పవచ్చు. అలరాజు పేరిందేవి వచ్చేదాక బ్రతికేవున్నడన్న కథ ఇలా సాగుతుంది.)

పల్లకీ దిగిన పేరిందేవి భర్తను చూసి కంటికి కడివెడుగా కన్నీరు కార్చి - "ప్రభూ! వీరుడవైన మీకు ఈ దుర్గతి ఏమిటి?" అని వాపోయింది.

ఏడుస్తున్న పేరిందేవి కన్నీటిని తుడిచి, హీనమైన స్వరంతో "దేవీ!" అని, చెప్పదల్చుకున్న చివరి మాటను తనలోనే మిగుల్చుకుని అలరాజు మరణించాడు.

మరణించిన అలరాజు శరీరాన్ని మేడపి చేర్చారు. మాచెర్ల వీరులంతా తలో కొమ్ము కాసారు.

మరణించిన అలరాజు శరీరాన్ని సుగంధద్రవ్యాలతో, రుద్రాక్ష, బిల్వ పత్రాలతో కప్పారు. పెద్దబొట్టు పెట్టుకుని, పెదాల మీద గంభీరమైన చిరునవ్వు నుంచుకుని, పేరమ్మ చితిసెక్కింది.

ఎక్కి - "పల్నాటి వీరులారా - ప్రజలారా - ప్రభువులారా! నేడు నా భర్తతో సహగమనం చేస్తున్నాను. మీ తోబుట్టువు పేరిందేవి చివరి కోరిక ఒకటి ఉంది. పల్నాటి చరిత్ర తన రాజకీయ పాచికలాటలో నా భర్తను మ్రింగేసింది. నా భర్తను అక్రమంగా, ఘోరంగా చంపిన నరసింగరాజు శిరచ్ఛేధం చేస్తామని వీరులైనవారెవరైనా తమ మాటగా చెబితే, తృప్తిగా సహగమనం చేస్తాను. అలాంటి వారు ఎవరైనా వున్నారా?" అన్నది పేరిందేవి.

చేరిన జనసందోహం మౌనం వహించింది.

అలరాజు అంత్యక్రియలను చూడ్డానికి వచ్చిన వాళ్ళల్లో బాలచంద్రుడు కూడా ఉన్నాడు. పేరిందేవి మాటలు అతనిలోని కావేశాన్ని రగిల్చాయేమో, చటుక్కున ముందుకు వచ్చి "నీ భర్త చావుకూ, నీ సహగమనానికీ, మీ పచ్చని బ్రతుకులిలా అర్థాంతరంగా ముగియడానికీ మూలకారణమైన ఆ నరసింగరాజు తల నరికి, బల్లానికి గ్రుచ్చి వాడి చరితను నేను ముగిస్తాను సోదరీ! నీవు హాయిగా నీ భర్తతో స్వర్గభోగాలనుభవించు. పల్నాటి చెన్నకేశవుని మీద ఆన" అన్నాడు.

పేరమ్మ తృప్తిగా బాలచంద్రుని వంక చూసి, భర్త పార్థివదేహం ప్రక్కనే పడుకుంది.

నాలుగు మూలలా నిప్పంటుకున్నది. భగభగలతో, భుగభుగలతో అగ్నిహోత్రుడు ఆ పవిత్ర దంపతులిద్దరినీ తనలో కలిపేసుకున్నాడు.

అలరాజు మరణంతో పల్నాటి చరిత్రలో మొదటి అంకం పరిసమాప్తి అయిందనే చెప్పవచ్చు.

**********

ఈ మొదటి అంకం ముగింపుగా చిన్న సమీక్ష చెయ్యాలి.

కీ.శే. త్రిపుర్నేని రామస్వామి చౌదరిగారు పల్నాటి చరిత్రను గురించి విపులమైన పరిశోధనలు చేసారు. వారు ఈ క్రింది అర్థం వచ్చేలా ఒక వాక్యాన్ని వ్రాసారు:

"ఉత్తర హిందూస్తానంలో జరిగిన భారథ కథను (వ్యాస భారత కథను) తలచుకునే తెలుగు జాతి, తన కళ్ళ ముందే జరిగిన పల్నాటి వీరభార కథను ఎందుకు తలచుకోదు?" అని.

దానికి ఒకేఒక్క సమాధానం కనిపిస్తుంది. ఆంజనేయుడి బలంలాగా, తెలుగువారు తమ వీరచరిత్రల జోలికి, తమ కీర్తి ప్రతిష్టల జోలికి పోరు. అందుకే తెలుగువారు అన్ని రంగాల్లోనూ రాణించగలిగినా, సరైన గుర్తింపుకు నోచుకోరు.

ఈ విషయంలో శ్రీనాథ కవిసార్వభౌముడు తెలుగువాడయివుండి, తెలుగుజాతికి తీరని మహాపకారం చేశాడని చెప్పాలి. ఆయన వ్రాసిన ప్రతి కావ్యమూ, సుశాస్త్రీయమైన పద్య, గద్యాలలో వుంటే పల్నాటి కథను మాత్రం కేవలం "ద్విపద"గా వ్రాసాడు. ఎందుకలా అన్న ప్రశ్నకు "ఏమో!" అనే సమాధానం చెప్పాలి.

ఒక్క వీరభద్ర కవి మాత్రం పల్నాటి చరిత్రను "వీరభారతం"గా మధుర గంభీరమైన పద్యకావ్యంగా వెలయించాడు. కానీ అది తెలుగువారి ప్రజాదరణ పొందలేదు. "ఎందుకలా?" అన్న ప్రశ్నకు సాహితీప్రియులందరూ తమకు తామే సమాధానం వెదుక్కోవాలి.

ఇలాంటి వీరోచిత చరిత్రను, సాహిత్యాన్ని మర్చిపోయి, తెలుగునాడు-తెలుగువాడు స్వయంకృతాపరాధులైనారా? లేదా?

అచ్చమైన తెలుగు చరిత్రకు ఆలవాలమైన "పలనాడు" మీద శ్రీనాథుడు వ్యంగ్యపూరిత, హీనమైన పద్యాలను కొన్నింటిని చెప్పాడు. చాటువులుగా చెలామణి అయ్యే ఈ పద్యాలను ఆయనే చెప్పాడా? లేక ఎవరో చెప్పి ఆయన మీద రుద్దారా? అనేది కూడా ఇవ్వాళ పరిశోధకులు దీర్ఘంగా ఆలోచించవలసిన విషయం.

తెనాలి రామకృష్ణ కవి వ్రాసినవి చెప్పకుని, పిచ్చి సాహిత్యం విచ్చలవిడిగా ప్రచారం చేసినప్పటి శ్రద్ధను ఇలాంటి వీర కావ్యాలపై కూడా పెడితే వచ్చే నష్టమేమిటి? కష్టమేమిటి?

ఐతే ఇక్కడో మరో తిరకాసు కూడా ఉంది.

ఒక్క బాలచంద్రుడి యుద్ధఘట్టాన్ని మాత్రమే వ్రాసి శ్రీనాథుడు ఊరుకుంటే, కొండయ్య, మల్లయ్య అనేవారు మిగతా భాగాలను పూర్తిచేశారనే విషయం ఒకటి చర్చలోనే ఉంది. ఒకవేళ అట్లాగే జరిగితే, ఈ మంజరీ ద్విపద కావ్యం శ్రీనాథుని పేర ఎట్లా బైటికొచ్చింది?

నిజానికి ఈ వీరచరిత్రకు సంబంధిచిన పుణ్యం "శ్రీ అక్కిరాజు ఉమాకాంతం" గారికి చెందాలి. ఎందుకంటే తెలుగుల వీరచరిత్రకు తెలుగుకే సమర్పించిన తొలి తెలుగు కవి ఆయన. కృతజ్ఞతతో నమస్కరించటం మినహా చేయగలిగినదిలేదు. ఆ తర్వాత, శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు సమగ్ర పల్నాటి చరిత్రను వెలువరించారు.

మహామహులైన ఈ ఇద్దరు "కాంతులూ" లేకపోతే, ఈ వీరచరిత్ర సాహితీ ప్రపంచంలో సముచిత స్థానాన్ని పొందలేకపోయేదేమో. ఈ వెలలేని విలువైన చరిత్ర - జానపదుల పిచ్చికుంటల, వీధిభాగవతుల బ్రతుకు తెరువుకు మాత్రమే ఉపయోగించడం విచారకరం.

సాహితీ ప్రయోజనం లేని, చౌకబారు కథగా ఇది మిగిలిపోతే సిగ్గుతో మనం "మన చరిత్రకు పట్టిన దుర్గతి ఇదా?" అని సిగ్గుతో తలదించుకోవద్దా?

పల్నాటి వీరభారతానికి సముచిత న్యాయం జరిగి తీరాలి. వ్యాస భారతం - తెలుగు భారతాన్ని క్లుప్తంగా సమీక్షిస్తే -

**1. శ్రీకృష్ణుడు - బ్రహ్మనాయుడు:**

భారతంలో శ్రీకృష్ణుడు ఎంత గొప్పవాడో, పల్నాటి భారతంలో బ్రహ్మన్న అంటే గొప్పవాడు. ఇద్దరూ అఖండమైన తెలివితేటలుగల రాజకీయ చతురులు. ఇద్దరికీ వ్యక్తిపూజలు జరిగాయి. ఇద్దరూ తమ తమ కథాకాలంలో అగ్రగణ్యులు.

**2. ధర్మరాజు - నలగాముడు:**

ధర్మరాజుకు జూదపు పిచ్చి ఉన్నది. నలగామునకు కోడిపోరు పిచ్చి. ఐతే, అధర్మయుద్ధంలో ధర్మజుడు ఓడి, నలగాముడు గెలిచాడు. ఎవరు గెల్చి, ఎవరు ఓడారన్నారన్న ప్రశ్న కాదు. యుద్ధం సంభవించడానికి ఎంతవరకు కారణభూతులు అన్నది.

**3. ద్రౌపది - నాగమ్మ:**

ఆభిజాత్యంతో ద్రౌపది. అహంకారంతో నాగమ్మ - ఈ యుద్ధాలను చేయించారు. ఐతే ద్రౌపది అవమానింపబడి, అలిగి, కన్నీరు పెట్టుకుంది. పుట్టింటివారితో కలిసి యుద్ధం చేయిస్తానని ప్రతిజ్ఞలు చేయిస్తే, నాగమ్మ రాజసంతో యుద్ధాన్ని చేయించింది. ఏమైనా నాగమాంబ తెలుగువారి ఆడపడచు, మానవంతురాలు.

**4. అభిమన్యుడు - బాలచంద్రుడు:**

వీరుడైన అభిమన్యుడు. పద్మవ్యూహంలో, దెబ్బలు తిని నిరుత్తుడుడై ఆయుధహీనులనైనా చంపి వీరమరణం పొందాడు. వీరుడైన బాలచంద్రుడు రణరంగంలో చావుదెబ్బలు తిన్న ఆఖరి క్షణంలో కూడా రణసూత్రాలను పాటించాడు. చేతిలో ఆయుధం వున్నవారిని మాత్రమే సంహరించాడు. పేరిందేవికి ఇచ్చిన మాటప్రకారం నరసింగరావు తలతెగనరికి, "వీర మరణం" పొందాడు. ఏమైనా బ్రహ్మన్న కొడుకు కదా!

కీ.శే.త్రిపుర్నేని రామస్వామి చౌదరిగారు ఏమన్నారంటే - "ఒకవేళ అభిమన్యుడు - బాలచంద్రుడూ బ్రతికి ఉండి, రణభూమిలో వదిలితే ఎవరు గొప్ప వీరులో అన్న విషయంలో బలాబలాలు తెలిసివుండేవి." అన్నారు.

*పాఠకులు ఈ విషయాల్ని ఆలోచించగలరు:*

**రాయబారాలు:**

భారతంలో సంజయ రాయబారం జరిగితే, పల్నాటి వీరభారతంలో భట్టు రాయబారం జరిగింది. అలానే కృష్ణ రాయబారం తో పోల్చదగ్గది అలరాజు రాయబారం. కృష్ణుడు భగవంతుడు కాబట్టి కౌరవుల హత్యాయత్నాల్ని తిప్పికొట్టగలిగాడు. కేవల మానవుడైన అలరాజు వీరుడైనా కూడా ప్రత్యర్థుల కుట్రలకు బలయ్యాడు.

**అజ్ఞాత, వనవాసాలు:**

పాండవులు పన్నెండు సంవత్సరములు, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేస్తే, మలిదేవాదులు ఏడు సంవత్సరాలు అరణ్యవాసం చేసారు. మొదటి కథలో మాయా పాచికలాట కారణమైతే, రెండవ కథలో కోడి పందేలు.

**యుద్ధక్షేత్రాలు:**

పాండవ, కౌరవ యుద్ధం "కురుక్షేత్రం"లో జరిగితే - నలగాము, మలిదేవుల యుద్ధం "కారెంపూడి"లో జరిగింది. రెండు చోట్లా జరిగింది దాయాది యుద్ధాలే.

అక్కసు పట్టలేని దుర్యోధనాదులు విరటుని ఆలమందల్ని పొడిస్తే, నలగాముడు చెంచుల పల్నేటితో ఆలమందలను పొడిపించాడు.

ఏది ఎట్లా జరిగినా - మహాభారతంతో సరిసమానంగా పల్నాటి వీరభారతం గౌరవాన్ని పొందలేకపోయింది. వ్యాస భారతం అఖండ భారతాన్నీ తన్మయత్వంలో ముంచెత్తితే, తెలుగు భారతాన్ని తెలుగువారే ఆదరించలేదు. దీన్ని మన ఖర్మ అని సరిపెట్టుకుందామా?

**********

మొదటి అంకం ముగింపు వాక్యంగా అలరాజు మరణాన్ని చెప్పదలిస్తే - కారెంపూడి యుద్ధానికి వీరులంతా తయారైనారనేది రెండవ అంకానికి మొదటి వాక్యంగా చెప్పకు తీరాలి.

మొదటినుంచీ ఇరువర్గాలవారూ, యుద్ధానికి నిర్ణయించుకున్న స్థలం కారెంపూడి. నాగులేటి ఒడ్డునే వున్నది.

"నాగులేటి నీళ్ళలోన నాలుగు మణుగుల నల్లపూసలు తెగా"లని మహాసాధ్వి పేరిందేవి శాపం పెట్టింది. బహుశా అందుకేనేమో, పల్నాటి యుద్ధం ఇక్కడే జరిగింది.

**********

రాజ్యకాంక్ష ఎంత భయంకరమైనదో, కపట మంత్రిత్వము కూడా అంతే దారుణమైనదని పల్నాటి వీరచరిత్ర మనకు విప్పి చెబుతుంది. కోడిపందేలతో, కోరమీసాల దువ్వులతో మొదలైన ఈ పోట్లాట - ఆఖరుకు పరాకాష్ఠకు చేరుకున్నది.

దూతను చంపిన నేరానికి నలరాజు శిక్షార్హుడే!

అదీగాక అలరాజు ఇటు వర్గం కన్నా - అటు వర్గానికి ముఖ్యుడు. వీరాధివీరుణ్ణి కాలం కాటువేసి, పొట్టనబెట్టుకున్నది.

అలరాజు అభ్యర్థనను త్రోసిపుచ్చి నలగాముడు యుద్ధానికే సిద్ధమై చరిత్రలో తన పేరును, పేరమ్మ కన్నీటితో, పల్నాటి ప్రజారక్తంతో వ్రాసుకున్నాడంటే - అతనికి నాగమ్మ మాట మీద ఎంత గురివున్నదో మనకు అర్థమవుతున్నది.

అలరాజు హత్య "మేడపి"ని అతలాకుతలం చేసింది. వీరులైనవాళ్ళ హృదయాలలో నిండివున్నది కేవలం పగ-ప్రతీకారం మాత్రమే.

"బ్రహ్మన్నా! ఇక ఆగి - ఆలోచించి ప్రయోజనం లేదు" అన్నాడు పెదమలిదేవుడు కొలువు తీరి.

బ్రహ్మన్న ఈ మాటకు తలైతే వూపాడుగానీ, అవ్యక్తమైన బాధ కడుపులో సుడులు తిరుగుతున్నది. తను ఎన్నో కలలుగని నిర్మించుకున్న పల్నాటిలో రక్తం ప్రవహిస్తుంది కాబోలు. తను ఏదైతే జరగకూడదని అనుకుంటూ వచ్చాడో అదే సిద్ధంగా వున్నది.

యుద్ధం...యుద్ధం...యుద్ధం.

కాలం ఇంతమందిలో ఎంతమందిని ఉంచుతుందో?

ఈ ప్రశ్నకు "కాలం" మాత్రమే జవాబు చెప్పాలి.

మేడపిలో వీరులు యుద్ధానికి ఉరకలు వేస్తున్నారు. ఈ మహా ప్రవాహాన్ని ఆపి ప్రయోజనం లేదు.

**********

యుద్ధానికి వీరులంతా కదలకముందు - గద్దె మీద రాజుగా - కనీసం నామకా ఐనా కూర్చోటానికి ఎవరో ఒకరు కావాలి.

"బాల మలిదేవుడు" అనే పెదమలిదేవుడి కొడుకుకు పట్టాభిషేకం చేసారు. ఐతే, తాత్కాలిక మంత్రి ఎవ్వరు?

అనూచానంగా వస్తున్న బ్రహ్మన్న వంశంలోని వాడూ, బ్రహ్మన్నకు ఏకైక కుమారుడూ ఐన బాలచంద్రుడు తాత్కాలిక మంత్రి అయ్యాడు.

అంతా యుద్ధానికి బయలుదేరారు.

యుద్ధప్రయాణానికి కావలసిన శుభ శకునాన్ని చూసారు. నిష్ఠతో పరమశివుణ్ణి ప్రార్థించారు.

వీరులు కదలి కారెంపూడివైపుకు వెళుతూవుంటే, ఎక్కడో మహా ప్రవాహం కదులుతున్నట్లు కనిపించింది. నాగులేరు పొంగినట్లు ప్రజలు పొంగిపొర్లుతూ కదనసీమకు కదులుతున్నారు.

ఐతే కారెంపూడి రణక్షేత్రంలో అంతకుమునుపే చాలా యుద్ధాలు జరిగినాయి. అది ఇవ్వాళ పుర్రెలతో, బొమికెలతో నిండివుంది. అవి ఏ శౌర్యధనుల మాట్లాడలేని కంకాళాలో చెప్పలేము. ఈ కంకాళాలు బ్రతికివుండగా వీర రసోద్దీపనా చిహ్నామైన కథలు చెప్పివుండివుంటాయి. శౌర్యాన్ని ప్రతిబింబించివుంటాయి.

కారెంపూడి రణక్షేత్రం సిద్ధమైంది.

ఆ ప్రాంతాన్ని నాగులేటి నీళ్ళతో శుద్ధిచేద్దామనుకున్నారు ఇరుపక్షాలవాళ్ళు. కానీ ఆ రాత్రే బ్రహ్మాండమైన వర్షం కురిసింది. ఆ నేల తడిసి పుణ్యస్థలిగా అయ్యింది.

ఆ వాన ధర్మదేవత చిందించిన అశ్రుకణాలే వుండాలి. లేదా, మృత్యుదేవత విలయతాండవం చేసి అలిసిపోయినప్పుడు చిందిన స్వేద బిందువులై వుండాలి. లేదా అధర్మాన్ని, పాపాన్ని ప్రక్షాళించేందుకు దేవుడు కురిపించిన దివ్య వర్షమై వుండాలి.

ఏది ఏమైనా ఇప్పుడు కారెంపూడి రణపుణ్యస్థలి. వీరులకు కార్యస్థలి. యోధులకు ధర్మస్థలి. వీరత్వమే ఊపిరిగా బ్రతుకున్న ప్రతి ఒక్కరికీ ముక్తిస్థలి.

**********

కారెంపూడిలో బ్రహ్మన్నా, మాచెర్ల అఖండ సేనావాహినీ విడిదిచేసింది.

చివరిసారిగా మరో సంధి ప్రయత్నం చెయ్యటం మంచిదని అన్నాడు బ్రహ్మన్న. కానీ వీరులెవ్వరికీ ఇది ఇష్టం లేదు.

బ్రహ్మన్న మాటకు ఎదురు చెప్పలేని మలిదేవుడు మాత్రం "మీ ఇష్టం" అన్నాడు.

ఓపిక నశించిన వీరుడొక్కడు లేచి - "ఇక ఏ రాయబారాలూ వద్దు" అని అరిచాడు.

బ్రహ్మన్న గంభీరంగా సైనికుల వంక జూసి - " మాచెర్ల వీరులారా! ఒక్క విషయం వినండి. యుద్ధమంటే భయపడి నేను ఈ సంధి ప్రయత్నం చెయ్యడంలేదు. ప్రభువైనవాడు ప్రజా క్షేమాన్ని

ఆలోచించాలి. యుద్ధం ఏ రూపేణ వచ్చిన, అది వేలాదిమందిని బలి తీసుకుంటుంది. వీరులైనవారెందరో నేలకొరిగిపోతారు.

మూర్ఖులు అనవసర యుద్ధాలకు కాలుదువ్వుతారు. ఆలోచనాపరులు సందర్భోచితంగా ప్రవర్తిస్తారు.

సుభిక్షంగా, పాడిపంటలతో విలసిల్లే ఈ పల్నాటిలో రక్తపుటేరులు ప్రవహించటం నేను ఊహించలేకపోతున్నాను. అందుకనే దీర్ఘంగా ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చాను" అన్నాడు.

సభ నిశ్శబ్దమైంది.

బ్రహ్మన్నే మళ్ళీ అన్నాడు - "ఏది ఎట్లా జరగాలనివుందో అట్లానే జరుగుతుంది. దానికి వగచి ప్రయోజనం లేదు. మీరంతా మీ గోత్రాలను చెప్పకుని, నాగులేటిలో స్నానం చేయండి. వీరపూజలు చెయ్యండి. యుద్ధమే జరిగితే మనకే విజయం దక్కాలని పరమశివునికీ, ఆదిశక్తి అపర్ణకూ మ్రొక్కండి".

నాగులేటిలోని "వీరధార" మడుగులో వీరులైన వాళ్ళందరూ అంతే చేసారు.

**********

"ఐతే ఇప్పుడు ఎవర్ని దూతగా పంపాలి?" అన్నాడు మలిదేవుడు.

"భట్టుగారిని పంపుదాం" అన్నాడు బ్రహ్మన్న.

"ఈ పని ముందే చేసివుంటే అలరాజు మనకు దక్కేవాడుగా!" అని అప్రయత్నంగానే అనేసాడు మలిదేవుడు.

బ్రహ్మన్న వైరాగ్యం నిండిన నవ్వొక్కటి నవ్వి "మృత్యుహస్తం స్పృశించిన రోజున - ఎవరి చావునూ, ఏ విధంగానూ ఆపలేము. సృష్టి రహస్యం, సృష్టి రచనాక్రమం అయోమయంగానూ, అర్థం లేకుండానూ కనిపిస్తాయి. జరిగే ప్రతి ఘటన వెనుకా ఓ కనిపించని కారణముంటుంది. ఆ కారణం ముందే తెలిసినా మనం చెయ్యగలిగింది ఏమీ లేదు మలిదేవా! అంతా భగవదేచ్ఛ! చెన్నకేశవుని ఆన ఎలావుంటే అలాగే జరుగుతుంది" అన్నాడు.

మలిదేవుడు బ్రహ్మన్న ముఖంలోకి చూసాడు.

గంభీరమైన బ్రహ్మన్న ముఖంలోకి పెద్దతనపు ముడుతలు వచ్చి చేరాయి. కానీ పుట్టుకతో వచ్చిన రాజసం పోలేదు. అనుభవం నింపిన వర్చస్సూ తగ్గలేదు. వార్ధక్యం వచ్చినా, రాజసం సడలని వృద్ధ సింహంలా ఉన్నాడు బ్రహ్మన్న.

"రాజకీయాన్ని ధర్మబద్ధంగా నిర్వహించడమే మన కర్తవ్యం. మలిదేవా! సంధి ఒక ప్రయత్నం మాత్రమే కాదు. అదొక ఉన్నతమైన లక్ష్యం. మహారాజులకు ప్రజాశ్రేయస్సుకు మించిన కార్యం లేదు. మాచెర్ల ప్రభువులు ప్రజాకంటకులన్న అపప్రథ కాలగతిలో నిలవరాదు. అందుకనే ఆఖరి ప్రయత్నంగా మరొక్కమారు సంధి ప్రయత్నం చేద్దాం. ఆ పైన కానున్నది కాక మానదు" అన్నాడు బ్రహ్మన్న.

బ్రహ్మన్న గొంతులోని గాంభీర్యానికి, మాటల్లో ఉన్న లోతైన భావాలకు మలిదేవుడు ఎదురు మాట్లాడలేకపోయాడు.

"అలరాజు మరణానికి కారకుడైన నర్సింగరాజును మన కప్పగించాలన్న షరతు విధిద్దాం" అన్నాడు పెదమలిదేవుడు.

"శాంతితో బాటు ఆ అప్పగింతకూడా ముఖ్యమైనదే. ఈ రాయబారంలోని ప్రధానాంశమూ అదే" అని తన ఒప్పుకోలును తెలిపాడు బ్రహ్మన్న.

మరుసటిరోజున భట్టును రాయబారానికై గురజాలకు పంపాడు బ్రహ్మన్న.

**********

భట్టు నలగాముని కొలువు కూటానికి చేరేసరికి గద్దె మీద కూర్చుని, రాజసం వెలయిస్తున్నాడు నలగాముడు. కొలువు తీర్చి, అపూర్వ నాట్య ప్రదర్శనా వీక్షణలో లయించిపోయివున్నాడు.

తన ఏకైక ముద్దుల కూతురు మరణించినా, అల్లుడు అస్తమించినా - నలగాముడు ఈ సుఖభోగ ప్రలోభి ఐనాడంటే ఆశ్చర్యకరమైన విషయమే!

మమతా మాత్సర్యాలకు తల ఒగ్గనివాళ్ళు అరుదు. మొదటిదాని పవిత్రతకన్నా రెండవదాని తుచ్ఛత కోసమే నలగాముడు లోబడినాడు.

ముఖద్వార పాలకుడొకడు లోపలికి వచ్చి - "ప్రభువులకు వందనములు - వార్త తెచ్చినాను" అన్నాడు.

"ఏమిటది?"

సభలో కలకలం బయలుదేరింది. అందరికీ ఒకే జిజ్ఞాస. ప్రముఖ ముఖద్వార పాలుకుడు తెచ్చిన వార్త ఏమయివుంటుందో?

ద్వారపాలకుడు వందనపూరితంగా, సవినయంగా తలను మరొకసారి క్రిందకు వంచి - "మాచెర్ల నుంచి మలిదేవ మహారాజులు భట్టుగారిని దూతగా పంపారు"

"తక్షణమే లోపలికి ప్రవేశపెట్టు!"

నృత్యం అర్ధాంతరంగా ఆగిపోయింది. నట్టువకత్తెలు లోపలికి నిష్క్రమించారు.

గుర్రం దిగి భట్టు సభాస్థలికి వచ్చాడు.

"గురజాల ప్రభువులు, అఖండ శౌర్యధనులు, వీర విక్రమ పరాక్రమ తేజోవిరాజితులూ ఐన నలగామ మహారాజులకు జయము. దిగ్విజయము. ప్రభూ - నా పేరు భట్టు. మాచెర్ల నుంచి మలిదేవుల వారి రాయబారిగా వచ్చాను. తెచ్చిన వార్త వినిపించమంటారా?"

నలగాముడు నాగమ్మ ముఖం వంక చూసి "అవశ్యం" అన్నాడు.

"జరిగిందేదో జరిగిపోయింది. అలరాజును మీరు విషప్రయోగంతో దూత అనే రాచ మర్యాదలను, రణరంగ సూత్రాలనూ పాటించకుండా చంపించారు. ఇది మేడపిలో వున్న వీరుల్లో కోపాగ్నిని రగుల్కొల్పింది.

వీరులైనవారు, పరాక్రమ సాహసోపేతులు ఐన మలిదేవాదులు కారెంపూడిలో విడిది చేసియున్నారు.

యుద్ధం వల్ల ఇరుపక్షాల్లోనూ అసంఖ్యాక జన నష్టం జరుగుతుంది. కనుక ఏదో విధంగా తమ రాజ్యభాగం తమకు గౌరవ మర్యాదలతో ఇవ్వమన్నారు. అంతేకాదు, అలరాజు మరణానికి కారణమైన నరసింగరాజ ప్రబువులను తమకు ఒప్పజెప్పమన్నారు. లేదా వారినే సంధికి మా కారెంపూడికి పంపమన్నారు.

తమ్ముల రాజ్యం వారికెటూ తిరిగి ఒప్పజెప్పటం మీ కనీస ధర్మం! అంతే కాదు రాచ మర్యాద కూడా.

పల్నాడు ఈనాడు పాడిపంటలతో సుభిక్షంగా వుంది. ప్రజలు సుఖంగా వున్నారు. ప్రజాశ్రేయస్సే తమ లక్ష్యం అనుకునే ప్రభువులు యుద్ధం విషయంలో విముఖులు. ఆనక మీ ఇష్టం" అని ముగించాడు భట్టు.

నలగాముడు గద్దె పై నుండి తల ఎత్తి చూసి - "ఇప్పుడు కారెంపూడిలో విడిది చేసున్నారా?"

"ఔను" అన్నాడు భట్టు.

"అన్నీ నిర్ణయించుకునే వచ్చారా?"

"మీ భావమేమిటో నా కర్థం కాలేదు"

"భట్టూ! దూతగా నీ ధర్మాన్ని నీవు నిర్వర్తించావు. మేము చెప్పబోయే మాటలను కూడా విని మీ ప్రభువులైన మలిదేవాదులకు వింపించు. అలరాజును మేము చంపించామన్న అపప్రథను మా నెత్తిన నెట్టి, నానా దుర్భాషలాడుతున్నారు వారు. మీ ప్రభువుల దూతను చంపేంత భీరువులు, అప్రయోజకులు కారు గురజాల ప్రభువులు. లేని నిందలు మాకు చుట్టబెట్టి, తన పరువు ప్రఖ్యాతులను పెంచుకుంటున్నాడు ఆ బ్రహ్మన్న.

రాజ్యంగానీ, రాజకీయంగానీ ఏమీ అర్థం కాని మలిదేవుడు, బ్రహ్మన్న చేతిలో చిక్కిన చిలకై, నేర్పిన మాటల్నే పలుకుతున్నాడు. నీవు దూతవు గనక సరిపోయింది. లేకపోతే తలతెగి నేల రాలేది.

మలిదేవుడు ఉపసంహరించుకోవల్సిన ఈ రెండు వాక్యాలను జాగ్రత్తగా విను -

మొదటిది: అలరాజును మేము చంపలేదు. విషయప్రయోగం గిట్టనివారు ఎవరైనా చేసి వుండవచ్చు. నిజంగా విషప్రయోగం ద్వారానే చచ్చిపోయాడనేది మాచెర్ల వాళ్ళు చెప్పినంత మాత్రాన గురజాల వాళ్ళు నమ్మాలనే సిద్ధాంతం ఎక్కడుంది? అకస్మాత్తుగా మరణించిన

అలరాజును తన రాజకీయ ప్రయోజనార్థం మేమే మోసంతో చంపామనే అపవాదును బ్రహ్మన్న పుట్టించింది కావచ్చుగా? అసలు వారే ఈ కుతంత్రం చేసి వుండవచ్చు కదా!

ఇక రెండవది: అలరాజు మరణానికి, నరసింగరాజును ఒప్పగించడానికి ఏమిటి సంబంధం? గురజాల వీరులు గాజులు తొడుక్కోలేదు. వీరకంకణాలు తొడుక్కొని వున్నారు. ఈ మాట మా మాటగా మీ ప్రభువులకు చెప్పు.

చివరి మాట, కారెంపూడిలో విడిది చేసున్న మీ ప్రభువులతో ఇక రాయబారాలు అక్కర్లేదని, యుద్ధంలో బలాబలాలు తేల్చుకోవాలని, కారేంపూడి రణక్షేత్రమే తీర్పునిస్తుందని చెప్పు. ఇక వెళ్ళవచ్చు" అన్నాడు నలగాముడు.

భట్టు సభను ఓసారి కలయజూసి, అక్కడ నెలకొన్న మౌనాన్నే అంగీకారంగా భావించి, నలగామరాజుకు నమస్కరించి సభనుంచి నిష్క్రమించాడు.

పేరిందేవి సహగమనం తర్వాత బాలచంద్రుడిలో చాలా మార్పులొచ్చినాయి. అదివరికటిలాగా అతను స్వేచ్ఛగా సంచరించటం లేదు. ఐతే, స్వతహాగా సంక్రమించిన కొన్ని సుఖాలకు అతను బానిసైపోయాడు. స్త్రీ ప్రలోభిగా అతన్ని పల్నాటి చరిత్ర వర్ణిస్తున్నది.

ప్రపంచంలో గొప్పవాడనుకున్న ప్రతివాడికీ కొన్ని బలహీనతలున్నాయి. బాలచంద్రుడి బలహీంత స్త్రీ, ఆటలు.

ఐతే చితి ఎక్కబోయిన పేరమ్మ అన్న చివరిమాటలు అతని చెవిలో ఎప్పుడూ ప్రతిధ్వనిస్తూనేవున్నాయి. వీరరక్తం ఇప్పుడిప్పుడే అతని రక్తనాళాల్లో ఉరకలు తీయటం మొదలెట్టింది.

కొడుకులో వస్తున్న ఈ మార్పులను ఐతాంబ గ్రహిస్తూనేవున్నది. ఐనా కొడుకుతో ఆమె ఈ విషయాలను ఎన్నడూ ముచ్చటించలేదు. నిజానికి బ్రహ్మన్న కోరుకుంటున్నది కూడా అదే.

కర్తవ్యం నుంచి, వీరత్వం నుంచి, యుద్ధంనుంచి బాలచంద్రుణ్ణి విముఖుడిగా చేయటమే ఆ దంపతుల ప్రయత్నం. ఎందుకంటే, జ్యోతిష్కులు చెప్పిన ప్రకారం అతను యుద్ధక్షేత్రంలో చిచ్చర పిడుగు. అమిత ఉద్రేకి. కత్తిపట్టుకుంటే కాలుడే.

కారెంపూడిలో వీరులంతా యుద్ధానికి సమాయత్తమైవుంటే, మేడపిలో బాలచంద్రుడు కాలాన్ని నిర్లక్ష్యంగా గడుపుతున్నాడు. యుద్ధవార్త ఎప్పుడు వచ్చినా, అతను దూకడానికి సిద్ధంగా ఉన్నాడు. దాదాపూ సమవయస్కులైన అన్ని జాతులవారు బాలచంద్రుడికి స్నేహితులుగా ఉన్నారు.

బాలచంద్రుడికి ఇష్టమైన ఆట "బొంగరాల" ఆట. ఆ ఆటలో అతను సిద్ధహస్తుడు.

బాలచంద్రుడు రేపు బొంగరాల ఆట తన స్నేహితులతో ఆడుతున్నాడనే వార్త మేడపిలో పొక్కింది. (*ఆ రోజుల్లో బొంగరాల ఆటకు పల్నాటిలో అంత ప్రాముఖ్యత ఉండిఉండవచ్చు. అంతేకాక బాలచంద్రుడు బొంగరాల ఆటకు ఆ ప్రాంతంలో చాలా ప్రసిద్ధమైన ఖ్యాతిని పొందివుండాలి - రచయిత*)

'రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవా?' అన్నట్లు, ఐతాంబ కొడుక్కు బంగారపు బొంగరాన్ని చేయించి ఇచ్చిందట.

ఐతే ఐతాంబకు బాలుడు బొంగరాల ఆట ఆడటం ఏమాత్రం ఇష్టం లేదు. ఎందుకనో ఆమె ఆత్మలో అశుభం పొడసూపుతున్నది. అవన్నీ లక్ష్యపెట్టేవాడు కాదు బాలచంద్రుడు.

నయాన-నయగారానా ఎన్నో హితవులు చెప్పి "నీ కొద్దు నాయనా ఈ ఆట!" అన్నది ఐతాంబ. బాలుడు ఇదేమీ వినబడనట్లు నటించి పయనమయ్యాడు.

మేడపిలో విశలమైన రాజవీధులున్నాయి. రచ్చల్నీ, రాచబాటల్నీ వదిలి, ఊరికి దూరాన వున్న విశలమైన రావిచెట్టు నీడన బొంగరాలాట మొదలైంది. ఈ బొంగరాల ఆట చూడటానికి జనం కిటకిటలాడారని పల్నాటి చరిత్ర చెబుతున్నది.

కంటిగింపైన ఆట అది. వయసుతో పిటపిటలాడే జవరాళ్ళు గిర్రున బొంగరం నేలలో దిగుతున్నప్పుడు ఏదో అవ్యక్తమైన మధుర భావనలతో తేలిపోవడం మొదలెట్టారు.

బాలుడు బొంగరాల ఆట ఆడే రావిచెట్టుకి దగ్గరలో ఒక స్వచ్ఛమైన మంచినీటి కొలను వున్నది. ఆ కొలనుకు దగ్గరలో ఉన్న పేటలో ఇద్దరు అక్కచెల్లెళ్ళవంటి స్నేహితురాళ్ళు ఉండేవారు. ఒకరు బ్రాహ్మణ కన్యైతే, మరొకరు వైశ్యకన్య.

బాలుడి బొంగరాల ఆట చూట్టానికి ఇద్దరూ నీళ్ళు తెచ్చే వంకబెట్టుకుని బిందెలు తీసుకుని బయలుదేరారు. వాళ్ళ అసలు ఉద్దేశ్యం అందగాడైన బాలచంద్రుణ్ణి దగ్గరనుంచి చూడాలని. "అపర మన్మథుడు, పుష్పబాణాల్లాంటి నూనూగు మీసాలతో, తుమ్మెద రెక్కలాంటి కంటి రెప్పలతో, వాడి చూపులతో కన్నె వయసు గుండేల్ని ఝల్లుమనిపించగల అందగాడటే అతను. చూసివద్దాం పద" అని ఒకరినొకరు చూసుకుని చెప్పుకున్నారు.

వాళ్ళు వచ్చేసరికే ఆట మొదలైపోయింది.

ప్రజలు కేరింతలు కొడుతున్నారు. వెళ్ళ మధ్యనుంచి విడివడి, సర్రునమని నేల మీద జారి, చిత్ర చిత్ర ప్రదక్షణాలు చేస్తున్న ఈ విచిత్రమైన బొంగరాలాట ప్రజల్లో అద్భుతాశ్చర్యాలను కలిగిస్తున్నది.

బాలచంద్రుడు అందగాడు, వీరుడనే ఖ్యాతితోబాటు చిలిపి చేష్టలు చేసేవాడన్న అపప్రథ కూడా వున్నది. మొత్తానికి ఆడవాళ్ళు బాలుడికి దడుస్తారన్నది నిర్వివాదాంశం. అలాంటి బాలుణ్ణి చూడ్డానికి బయలుదేరిన ఈ ఇద్దరు యువతుల్లో బ్రాహ్మణ యువతి పేరు తెలియరాదు. వైశ్య పడుచు పేరు "అన్నమ్మ".

ఆలస్యంగా వచ్చిన ఈ ఇరువురు స్త్రీలు ప్రజల్ని తోసుకుంటూ ముందు వరుసలోకి వచ్చారు.

ఆలోపే బాలుడు బొంగరాన్ని వేగంగా తిప్పి వదిలిపెట్టేసాడు. అది గిర్రున తిరిగి, జర్రున జారి, అన్నమ్మ కాలిని అంటుకున్నది. వాడిగా వున్న బొంగరం ములుకు ఆవిడ కాలిలో లోతుగా దిగింది. బాధను భరించలేని అన్నమ్మ మూర్ఛపోయింది. శైత్యోపచారాలతో తేరుకున్న అనంతరం, అన్నమ్మ కళ్ళు తెరిచి ఆ భయంకరమైన బాధను భరించలేక ఇట్లా అన్నది:

"పిరికిపందా! ఆడవాళ్ళను బాధించటమే ప్రజ్ఞ అనుకున్నావు కదూ! మేడపిలో ఇప్పుడు మిగిలింది ఆడవాళ్ళు, పిరికిపందలైన మగవాళ్ళు మాత్రమే. మీ తండ్రులు, పెద్దలు, మిగిలిన వీరులందరూ కారెంపూడి రణక్షేత్రంలో కత్తులు నూరుతుంటే, పిరికిపందపై బొంగరాల ఆటలో ఆడవాళ్ళను హింసిస్తున్నావు నువ్వు. మలిదేవుడిచ్చిన అపార ధనాన్ని చూసుకుని మదమెక్కిపోయివున్నావు. వీరుడివైతే, మగతనమే వుంటే యుద్ధంలో సాటి మగవాళ్ళతో పోరాడు. ఇలా ఊరిమీద పడి పోతుటెద్దులా తిరక్కు. నీకు సిగ్గెయ్యడం లేదు?"

ఈ మాటలతో, ఐతాంబ పెంచుకున్న ఆరుగురి బిడ్డల్లో ఒకడైన అనపోతు కోపం తెచ్చుకుని, మహోగ్రుడై, ఈటెతో అన్నమ్మను పొడవబోయినాడు. కానీ, బాలచంద్రుడు అడ్డుపడి "సోదరా అనపోతు! తప్పు. అన్నమ్మ పనిగట్టుకు అనలేదు. స్త్రీ సహజమైన కోమలత్వంతో, తీవ్రమైన బాధను ఓర్చుకోలేక నన్ను అన్నది. దానికి నీవు ఉద్రేకపడాల్సిన పనిలేదు.' అని - అన్నమ్మ వైపు తిరిగి

"తల్లీ! క్షమించు! నాకు జ్ఞానోదయం కలిగించావు. నీవు అన్న మాట అక్షరాలా నిజం. అజ్ఞాతంగా, స్థబ్దుగా బ్రతుకుతున్న నాకు సరైన మార్గాన్ని చూపించావు. వీరభిక్ష పెట్టావు. ఔను! వీరులైన వాళ్ళు అబలల్లాగా ఇళ్ళల్లో బ్రతక్కూడదు. బ్రతక్కూడదు" అని అక్కడునించి కదిలాడు.

బొంగరాల ఆట ఆవిధంగా సమాప్తమైంది.

వీరుడైన బాలచంద్రుడు, మండే సూర్యునిలా ఇంటికొచ్చి, గంభీరమైన స్వరంతో "అమ్మా!" అన్నాడు.

సంధ్య వాలిపోయింది. పశ్చిమాద్రికి కుంకుమ రంగు పులిమి, సూర్యభగవానుడు, సముద్ర గర్భంలోకి కుంకిపోతున్నాడు. ఆ అసుర సంధ్యా క్షణాన ఐతాంబ సంధ్యా దీపం వెలిగిస్తున్నది.

కొడుకు గొంతులో వచ్చిన మార్పును పసిగట్టి "ఏమిటి నాయనా?" అన్నది.

"ఈ బ్రతుకు దుర్భరంగా ఉందమ్మా" అన్నాడు బాలచంద్రుడు.

"అంటే - "

"కారెంపూడి రణక్షేత్రంలో ధర్మాధర్మాలకు సమరం జరుగబోతున్నది కదామ్మ. నేనేమో పిరికిపందనై ఇక్కడే ఉంటున్నాను. కత్తులతో కుత్తుకలు తెగబోతున్న సమయాన మేడపిలో ఆడదానిలా బ్రతికే నా తుచ్ఛ జీవితం వెగటు కల్గిస్తున్నది. ఇప్పటికైనా అనుజ్ఞ ఇవ్వమ్మా. నన్ను నేనుగా బ్రతకనివ్వు"

ప్రొద్దున ఆటకు వెళ్ళబోయే కొడుకులో కేవలం బాల్య ఉద్రేకాన్ని చూసింది. బాలుడైన బాలచంద్రుణ్ణి చూసింది. కానీ ఇప్పుడు అదే కొడుకులో ప్రభంజనమైన వీరత్వాన్ని చూస్తోంది. అందుకని -

"నాయనా, ముక్కు పచ్చలారనివాడివి. పట్టుమని పదహారు వయసుకూడా నిండని పసివాడివి. పసికూనకు యుద్ధనీతులు తెలియవు. ఎత్తుకు పై ఎత్తు వేసే శక్తి ఉండదు నాయనా!" అన్నది.

బాలచంద్రుడు నవ్వి "కొదమసింగానికి పంజా విసురులో ఒడుపు సహజంగానే వస్తుందమ్మా. నేను సింగపు కూనను. కత్తి చేతిలో వుంటే ఫాలాక్షుణ్ణైనా ప్రతిఘటించగలవాణ్ణి. వీరమాత తన బిడ్డకు వీరత్వానికి బదులు పిరికిపాలు పోస్తున్నందుకు ఆశ్చర్యంగా వున్నది" అన్నాడు.

కాలం కాసేపు స్తబ్దుగా ఉంది. నిశ్శబ్దం.

నీలపు ఆకసాన జారే పువ్వుల్లా నక్షత్రాలు మెరుస్తున్నాయి. ప్రొద్దు ఇంకొంచెం పైకెగబ్రాకింది. ఐతాంబ వెలిగించిన దీపం రక్తం చిందుతున్నట్లు వెలుగు నిస్తున్నది.

వెలిగే దీపపు కాంతిలో బాలచంద్రుడి ముఖం మండే ఇనబింబంలా వున్నది.

తన కడుపున పుట్టి, ఎక్కడో దూరంగా పెరిగిన కూన, తనకు వీరత్వాన్ని గురించి బోధిస్తుంటే, నీటిపొరతో మసకబారిన కళ్ళతో, ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది ఐతాంబ. ఇలాంటి వీరుల్ని ఆపి ప్రయోజనం లేదని ఆవిడ మనసు అంటోంది.

ఆమె సంబాళించుకుని " నాయనా! నీకు తోచిందే చేయడం తప్ప, నేను చెప్పేది వినే స్థితిలో నువ్వు లేవు. ఎన్నో నోములు నోచగా, పుట్టిన మురిపాల బాలచంద్రుడిని వదిలి బ్రతుకలేను తండ్రీ!" అంది.

"ఐతే, నా బ్రతుక్కు ప్రయోజనమేముందమ్మా?"

"నాయనా! యుద్ధమంటే ఏమిటో అనుకుంటున్నావు. ఏనుగులు, రథాలు, కత్తులు-బల్లాలు, కదం త్రొక్కే గుర్రాలు, పగ ఎక్కిన పగవారు - ఎందరో ఉంటారు. పాలుగారే పసికూనవు. యుద్ధ ధర్మాలు, మర్మాలు, మోసాలు, కాపట్యాలు నీకు తెలియవు నాయనా!" అంది.

"అమ్మా! వీరులు ధర్మయుద్ధంలో వీర మరణం చెందుతారు. తమ యశశ్చంద్రికలను దిగంతాల దాకా వ్యాపింపజేసుకుంటారు. నన్ను కన్నందుకు నీవు, నీ కడుపున పుట్టినందుకు నేను శాశ్వత కీర్తిని పెంపొందించుకోవాలంటే ఇదొక్కటే మార్గం. నన్ను దీవించు!" అన్నాడు బాలచంద్రుడు. అతని గొంతులో స్థిరత్వం నిండివున్నది.

ఐతాంబ ఆవాక్కయిపోయింది.

నిజమే! సింహం పిల్లకు వీరత్వాన్ని గురించి ప్రత్యేకంగా బోధించాల్సిన పని లేదు. ఆఖరి అస్త్రంగా కొడుకును యుద్ధవిముఖుణ్ణి చేయడానికి ఐతాంబ అంది - "నాయనా, నీ భార్య మాంచాలను ఒక్కసారి చూసిరా. యుద్ధరంగానికి వెళ్ళబోయేముందు నిన్ను కోరే నా తుది కోరిక. హెచ్చరిక కూడా"

"అలాగే అమ్మా!" అన్నాడు బాలుడు.

*************

తన తోటి వయస్కులైన, వీరులైన తమ్ములను వెంటబెట్టుకుని యుద్ధరంగానికి బయల్దేరుదామనుకున్న బాలుడు సాని సబ్బాయి మీదున్న వ్యామోహాన్ని వదులుకోలేక, దానితో ఓ మాట చెబుదామని బయల్దేరాడు.

భార్యలు, భర్తలతో సుఖ జీవనయాత్రను చేస్తారు. సానులు ప్రియులతో సుఖజీవన తాత్కాలిక ప్రసంగాలు చేస్తారు.

వగలతో, కులుకులతో, టక్కులతో, నిక్కులతో విటుణ్ణి పల్టీలు కొట్టిస్తారు. ఈ కొత్త సుఖం అలవాటైనవారు తమ బ్రతుకులను సాని పాదాల దగ్గర పణంగా పెడతారు.

మాంచాల వంక తొలినాడైనా ఒక్కసారి కన్నెత్తి చూసినట్లైతే తను ఏ సబ్బాయినైతే మహాసౌందర్యవతని భావిస్తూ వచ్చాడో ఆవిడ మాంచాల అందం ముందు తీసుకట్టని తప్పకుండా తెలుసుకునేవాడు. కానీ అట్లా జరగలేదు.

సాని సబ్బాయి ఇంటికి వెళ్ళేసరికి తొలిజాము గడిచిపోయింది. కప్పెర కప్పెర చీకటి కప్పకొనివున్నది. ప్రజలు తమ తమ ఇళ్ళల్లో వెచ్చగా నిద్రపోతున్నారు.

సాని సబ్బాయి బాలచంద్రుడి గొంతు వినగానే, దాసీలను పిల్చి - "చూడవే, ఈ గొంతును నేను ఎప్పుడైనా గుర్తించగలను. తలుపు కొట్టే విటుడు బాలచంద్రుడు. నాకు ఒంట్లో బాగుండలేదని చెప్పు." అన్నది.

"బాగానే వుంటిరిగా!" అంది ఆ దాసీ.

"అక్కడే వుంది కిటుకు. ఇట్టాంటి మాటలతోనే ప్రియుల్ని విటురాళ్ళు బోల్తా కొట్టించాలి. చెప్పినట్లు చెయ్యి." అంది సబ్బాయి.

ఉన్న దీపాన్ని చిన్నాది చేసిన దాసీ తలుపు తెరిచి - "రండి ప్రభూ! శ్యామాంగికి ఒంట్లో నలతగా వుంది" అంది.

"అయ్యో! విచారకరమైన వార్త చెప్పావు. కారెంపూడి రణక్షేత్రానికి యుద్ధానికై వెళుతున్నాను. ధనాన్నిచ్చి వెళ్దామని వచ్చాను. ఏం చేస్తాం. దాని ఖర్మ!" అన్నాడు బాలచంద్రుడు.

ఈ మాట దాసీది వినగానే అప్పటికే అలంకరించుకొనివున్న సబ్బాయి మంచం మీదినుంచి దిగి క్రిందకు దిగి వచ్చింది.

"వెళ్తున్నారా స్వామీ?" అన్నది.

బాలచంద్రుడు దీక్షగా దాని ముఖంలోకి చూసి - "ఒంట్లో బావుండలేదని విన్నాను!"

"కొంచెం నలత"

"పాపం..."

ఈ మాటలు కొంచెం హేళనగా ధ్వనించిన సాని సబ్బాయి "ప్రభువులు, ఏమి పల్కినా చెల్లుబాటౌతుంది. వెల కట్టబడిన వారకంతలు నిజం చెప్పినా నమ్మరు. మీరు వచ్చారుగా. అంతేచాలు. కారెంపూడి రణక్షేత్రానికి వెళ్ళబోయే ముందు తమ పాదాల కొక్కసారి ప్రణామం చెయ్యనివ్వండి."

సోదరుల వంక చూసి - బాలచంద్రుడిట్లా అన్నాడు - "ఆడది పిల్చినప్పుడు వెళ్ళకపోవటం పురుషలక్షణం కాదు. కనుక వెళ్ళొస్తాను".

ప్రతి సానికీ ప్రతి చరిత్రలోనూ తల్లి వుంటుంది. వీళ్ళు ఎక్కువ కాలం బ్రతికివుంటారు కామాల్నూ. సాని సబ్బాయికి వృద్ధురాలైన తల్లి వున్నది. సందర్యం వెలిసినా ధనాశ చావలేదు. బాలచంద్రుణ్ణి చూసి, నెత్తిన మెటికలు విరుచుకుని "ప్రభువులు యుద్ధరంగానికి వెళ్తూ కూడా మా గృహం పావనం చేసారు" అన్నది.

"ఇంతకూ ఏమిటి సంగతి?" అన్నాడు బాలచంద్రుడు.

"వేశ్యలు ధనం సంపాదించుకోవడానికే ఈ ప్రపంచంలో పుట్టారు. వయస్సులో వున్న వారకాంత కొద్దో గొప్పో సంపాదించుకోవాలి. లేకపోతే, ఆ తర్వాత దాని బ్రతుకు కుక్కలు చింపిన విస్తరే తండ్రి! యుద్ధరంగానికి వెళ్ళబోయే ముందు, కొద్దో గొప్పో ధనాన్ని మాకు పారవేయండి" అన్నది.

"అట్లాగే" అన్నాడు బాలచంద్రుడు. ముసలిది సంతోషంతో పొగిడింది - "ఆడిన మాట తప్పని వంశం నాయనా మీది".

ఐతే, సాని సబ్బాయిని చూడగానే యుద్ధం సంగతి మర్చిపోయాడు బాలచంద్రుడు. అదే

అతనిలోని బలహీనత.

మేడపి స్తబ్ధుగా వున్నది. ఆకాశం మధ్య చంద్రుడు క్షీణకాంతితో విశ్రమించాడు.

అంగాంగాలు కనిపించేలా, ఉల్లిపొర చీరను కట్టింది సబ్బాయి. దాని రొమ్ము, ఎగరేసిన పల్నాటి ప్రభువుల విజయకేతనంలా వున్నది.

దాని ప్రేమను పరీక్షించాలనుకున్న బాలచంద్రుడు "యుద్ధానికి వెళుతున్నాను!" అన్నాడు.

"విన్నాను ప్రభూ!"

"నాతో మాట్లాడాల్సిందేమన్నా వుందా?"

"లేదు. ఒకవేళ వున్నా నేను భార్యను కాను కదా; వెలకట్టిన ఆలిని, వెలయాలిని"

బాలచంద్రుడు కోపం తెచ్చుకొని "ఈ లక్షణం మీ జాతిలోనే వుంది" అన్నాడు.

బాలుడు కోపం తెచ్చుకున్నాడని గ్రహించిన సబ్బాయి "ప్రభూ! అలకతో ఈ రాత్రిని ఎందుకు వృథాచేస్తారు. మనోవాక్కాయ కర్మలా, మిమ్మల్నే నేను ప్రాణప్రదంగా పూజిస్తున్నాను. నన్ను మీరు నమ్మకపోతే చేయగల్గిందేమున్నది? మీరు నన్ను నమ్మకపోతే ఈ వలిపాలెందుకు? ఈ మురిపాలెందుకు?" అన్నది. అని కన్నీరు కూడా పెట్టుకొన్నది.

దాని కపటపు కన్నీరు చూడగానే, నీరైన బాలచంద్రుడు దాన్ని బుజ్జగించి, దగ్గరకు లాక్కొని, తమితో ముద్దెట్టి "నిన్ను పరీక్షించాలని అట్లా అన్నానులే" అని అన్నాడు.

సబ్బాయి కన్నీటి చిరునవ్వు నవ్వి "మీకు నా మీద ఎంత ప్రేమో నాకు తెలియదా?" అన్నది.

"కబుర్లతో కాలం వృథాగా గడుస్తున్నది" అని బాలుదంటే, కంటి కొసల్తో నవ్వి, క్రింది పెదవిని పైపంట సుతారంగా నొక్కి "ఏం చెయ్యమంటారు?" అని కవ్వించింది సబ్బాయి.

దాని శరీరం నుంచి కస్తూరి కలిపిన సుగంధపు వాసన వస్తోంది. వక్షంపైని రవ్వల హారం ఛళుక్కున్న కదిలింది. దాని శరీరపు కదలికలు బాలచంద్రుణ్ణి ఆకర్షిస్తున్నాయి.

బాలచంద్రుడి తలను తన వక్షస్థలంపై గట్టిగా అదుముకుని "ఈ క్షణం శాశ్వతమైతే ఎంత బాగుణ్ణు" అన్నది.

"నిజమే..." అన్నాడతను.

సబ్బాయి గదిలో సుఖాలను అనుభవిస్తున్న బాలచంద్రుడికి గడప దగ్గర తన కోసం వేచివున్న తమ్ముళ్ళ విషయం గుర్తుకురావడం రాలేదు.

"ప్రభూ!"

"ఏమిటి?"

"మీరు నన్ను మర్చిపోయారనుకున్నాను. ఐదు రోజుల్నుంచీ మీరు రాక కంటికి కునుకులేక నేను పొందిన దుర్భర బాధ తమరికి ఏమని విన్నమించుకోను? ఈ శరీరం మీ కోసం. ఈ బ్రతుకులోని వెలుగు మీరు. ఇంతకన్నా ఏం చెప్పను?" అన్నది.

వీరులు తుచ్ఛ కాముకులు కాకూడదని ఎక్కడున్నది?

బాలుడు సబ్బాయిని ఇంకా గాఢంగా హత్తుకున్నాడు.

"నేను వెళ్ళబోయే ముందే ఏం కావాలో అడుగు!" అన్నాడు.

"నా బ్రతుకు మీకే అంకితమయింది. ఈ శరీరం బాలచంద్రుడుది. ఇంకొకర్ని అంటదీ తనువు. నేను వెలకాంతనైనా 'కులకాంత'గా బ్రతకాలనుకుంటున్నాను. మీరు నాకు మీ ఇష్టమొచ్చినంత ఇవ్వండి. ముసలిది బ్రతుకుతుంది. తాళి కట్టిన మీ ఇల్లాలితో బాటు నాకు ఈ చరిత్రలో కొంత పేరును నిలిచిపోనివ్వండి. ఇదే నా ఆఖరు కోరిక! మీరు ఎక్కడ వుంటే అక్కడే నా బ్రతుకు" దాని మాటలు నమ్మి - అపార ధనరాసులను కుమ్మరించి, దాన్ని వెంట బెట్టుకుని బయల్దేరబోయాడు.

వాకిట్లోకి వచ్చిన బాలచంద్రుణ్ణి వీరుడైన బ్రాహ్మణ అనపోతు అడ్డగించి "ఈ తుచ్ఛ స్త్రీ కోసం మాన మర్యాదలను మంటగల్పుకున్నావు. పాము పెంపు, వగలాడి వలపు ప్రమాదకరమైనది. ప్రేమతో అమ్మ ఇచ్చిన ధనాన్ని ఈ రంకులాడికి ధారపోశావు. క్షణికమైన కామం కోసం బాలచంద్రుడు స్త్రీ ప్రలోభి అనే పేరు స్థిరం చేసుకొన్నావు. వీరుడైనవాడు కత్తి పదునుతో కాలం గడపాలి కానీ వేశ్యల ఇంట చిక్కిపోకూడదు. యాచకులు నీ కోసం ఎదురుచూస్తున్నారు. వారికేమిస్తావు? వీరులు వీరగీతాలు పాడుతున్నారు. ఎప్పుడు కదులుతావు?' అని ఆవేశంగా అడిగాడు.

బాలచంద్రుడు క్షణం బాధపడి, సబ్బాయిని అక్కడే వదలి బయల్దేరాడు. మెడలోనున్న విలువైన చంద్రహారాన్ని అమ్మి, యాచకులకు దానధర్మాలు చేసాడు. వీరగీతాలు పాడుకొంటూ తమ్ములతో బయల్దేరాడు.

**********

తల్లికిచ్చిన మాట ప్రకారం అత్తవారింటికి వచ్చాడు బాలచంద్రుడు.

బాలచంద్రుడు ఇక్కడికి రాకముందే ఐతాంబ కోడలు మాంచాలను చూడ్డానికి వచ్చింది. వియ్యపురాలు రేఖాంబ ఎదురొచ్చి "వదినగారు క్షేమమా? అని స్వాగతించింది.

అత్తగారు వచ్చిన మాటవిన్న మాంచాల పన్నీటి పాద్యం తెచ్చి పాదాలు కడిగి నమస్కరించింది. కుశల ప్రశ్నలు వేసింది.

కాసేపు యోగక్షేమాలయ్యాక ఆమె మాంచాల వైపుకు తిరిగి "ఎల్లుంది ప్రొద్దున మీ ఆయన కారెంపూడి రణక్షేత్రానికి వెళుతున్నాడు. వెళ్ళయ్యేయే ముందు ఇక్కడి కొస్తాడు." అన్నది.

"తోవ తెలియదేమో!" అన్నది మాంచాల.

ఐతాంబ కళ్ళలో నవ్వులు పూయించి - "చిన్నతనంలో తెలియక దారి తప్పిన నీ భర్తను యుద్ధానికే పంపుతావో, నీ కొంగున ముడే వేసుకుంటావో నీ ఇష్టం" అన్నది.

మాంచాల స్థిరమైన స్వరంతో "అదికాదు అత్తా! తొలిరాత్రైనా నేను చూడలేదే! మా పెళ్ళైన తర్వాత ఒక్కసారైనా నన్ను తల్చుకున్నారా? నేను భార్యనన్న విషయం ఆయనకు గుర్తుందా? నా పేరైనా తెలుసా? సానికొంపలో గడిపిన నా భర్తను ఏడేళ్ళ తర్వాత ఎట్లా గుర్తు పట్టను" అని "గండు"వారి గారాల పడచు మాంచాల పలికితే -

ఐతాంబ మనసులో సంతోషించి - "కారెంపూడికి వెళ్ళకుండా బాలుణ్ణి నిలపగల సామర్థ్యం నీకొక్కదానికే వుంది. ఆనక నీ ఇష్టం" అంది.

పెళ్ళైన చాలా కాలానికి అల్లుడు తమ ఇంటికి వస్తున్నాడని రేఖాంబ బ్రాహ్మణ పుణ్యస్త్రీలతో ఎదురుపడింది. బాలచంద్రుడు అత్తగారింట స్నేహితులతో బాటుగా అడుగుపెట్టాడు. రంగవల్లులతో, రంగరంగ వైభోగంగా అలంకరించబడిన ఆ ఇంట శృంగార లక్ష్మి తాండవిస్తున్నట్లు అనిపించింది బాలుడికి.

సోదరులతో ఉచితాసనాలను అలంకరించిన బాలచంద్రుడు తన భార్యను చూడాలని లోలోనే తపించిపోతున్నాడు.

పరిమళ గంధాల పన్నీరు జలకమాడి, చీనిచీనాంబరాలను ధరించి, వెలగల విలువైన నగలు పెట్టుకుని, సముద్ర మథనంలో ఉద్భవించిన మహాలక్ష్మిలాగా వున్న మాంచాల, తల్లి పాదాలకు నమస్కరించి - "అమ్మా! చిన్నతనంలో నా భర్తను చూడలేదు. పెద్దయ్యాక ఆయనొక్కసారైనా నా దగ్గిరకు రాలేదు. ఇప్పుడేమో ఎన్మిది మంది వచ్చారని విన్నాను. వారిలో నా భర్తను ఎలా గుర్తుపట్టేది?" అని అడిగింది.

ముగ్ధత, ఉత్సాహం, అయోమయం కలగలసిన కూతురి ముఖాన్ని చూసి, స్వరాన్ని విని మురిసిపోయింది రేఖాంబ. భుజంపై చేయివేసి, చుబుకాన్ని పుణికిపుచ్చి - "భార్య రాగానే నిలబడని వాడే భర్త. నువ్వు వెళ్ళగానే ఎవరు నిలబడలేదో వారికే నమస్కరించు. అతనే నీ బాలచంద్రుడు" అని చెప్పింది.

ఏడువారాల నగలు పెట్టి, తన పనితనంతో బ్రహ్మ సృష్టించాడా అన్నంత అందంగా, సిగ్గుల మొగ్గై వస్తున్న భార్యను చూసి మతిపోయిన బాలచంద్రుడు - "ఇంతకాలం ఎంత తప్పు చేశాను?" అని లోలోనే గతుక్కుమన్నాడు.

తను మందిరంలోకి వచ్చాక, అక్కడున్న ఎనిమిది మందిలో ఆరుగురే లేచి నిలబడ్డం గమనించింది మాంచాల. కూర్చునేవున్న ఆ ఇద్దరూ యుద్ధరంగానికి వెళుతున్న వీరుల వస్త్రధారణలో ఒకే రకంగా ఉన్నారు. ఆ ఇరువురిలో తన భర్త ఎవరని పాలుపోలేదు మాంచాలకు. ధైర్యం చేసి, అడుగులు ముందుకేసి ఓ వీరుని పాదాలను అంటబోయింది.

అతను చప్పున నిలబడి - "తల్లీ! క్షమించు. నేను అనపోతను. మిగిలిన తమ్ముళ్ళతో బాటూ నేను నిలబడాల్సింది. కానీ బ్రాహ్మణున్ని గనుక కూర్చుండిపోయాను. ఇదిగో, ఇతడే నీ భర్త, బాలచంద్రుడు. ఇతనికి నమస్కరించు." అని అన్నాడు.

మాంచాల దించిన తల ఎత్తకుండా - "నా పూజల్లోని లోపమో, లేక చిన్నతనంలోనే పెళ్ళవటం మూలానో నా భర్తను త్వరగా గుర్తించలేకపోయాను. కానీ, బ్రాహ్మణుల్ని పూజిస్తే, భగవంతుణ్ణి పూజించినట్టేనని పెద్దలు చెప్పగా విన్నాను. మీకు నమస్కరించి, నా పూజల్లోని లోటు సరిదిద్దుకున్నాను. భర్త ఇంటికి రావడం కన్నా కులసతికి పండుగ ఉండదు. ఇలాంటి శుభసందర్భంలో మీవంటి ఉత్తమ బ్రాహ్మణులకు మొదట నమస్కరించడం తప్పుకాదనుకొంటాను." అని అన్నది.

మాంచాల ముగ్ధ భక్తికి చలించిన అనపోతు మనసారా దీవించాడు.

తొలిసారిగా కలుసుకున్న భార్య భర్తలను ఒంటరిగా వదిలిపెట్టి మిగిలినవాళ్ళంతా బైటకు నడిచారు. వెళుతూ వెళుతూ, వదినగారిని మనసులో ఉంచుకుని యుద్ధాన్ని మరవొద్దని హెచ్చరించాడు

అనపోతు. "బాలచంద్రా! మనకు ఏడు ఘడియల కాలమే ఉంది. అటుపై కారెంపూడికి బయలుదేరాలి" అని అన్నాడు అనపోతు.

బాలచంద్రుడు నవ్వి - "చెన్నకేశవుని మీద ఆన. మీరు నిశ్చింతగా ఉండండి. రేపు ఉదయం, సూర్యోదయానికి ముందే మనం కారెంపూడికి వెళ్దాం" అన్నాడు.

**********

మాంచాల భర్తను వెంటబెట్టుకుని, తన మేడ మీదికి తీసుకుపోయింది. అతన్ని అక్కడ కూర్చోబెట్టి మనసు రంజింపజేసే మాటలెన్నింటినో చెప్పింది.

"స్వామీ! మీ కోసం జలకమాడి వస్తాను. వెళ్ళిరమ్మని అజ్ఞ!" అన్నది.

"అట్లాగే"

అనుభవించే సుఖానికి అనువైన విధంగా ఆమె దుస్తుల్ని ధరించి తల్లి రేఖాంబ దగ్గరకు వెళ్ళి "అమ్మా! ఆయన నా కోసం ఎదురుచూస్తున్నారు. వెళ్ళిరానా?" అంది. రేఖాంబ కూతురి ముఖంలోకి దీక్షగా చూసి, నిశ్శబ్దంగా కూర్చుంది.

"మాట్లాడేవు కాదేమమ్మా? నా భర్త రాకరాక వచ్చారు. ఆయన భార్యనై, గండు వారి గారాల బాలనై, దాంపత్య జీవనాన్ని అనుభవించలేకపోయాను. కదనరంగానికి పోతూ ఇటు వచ్చారు నా పతి. ఆయనకు సపర్యలు చేయడం నా కర్తవ్యం కాదా?" అన్నది.

(శ్రీనాథ కవిసార్వభౌముడు వ్రాసిన పల్నాటి వీరభారతం కావ్యంలో, ఈ ఘట్టంలో సజీవమైన సాహిత్యాన్ని సృష్టించాడు. ఆయన ద్విపదలకి వచనానువాదం ఇలా ఉంది)

రేఖాంబ కూతురు ముఖంలోకి చూసి ఇలా అన్నది.

"జన్మ అనేది ఒక వృక్షమైతే దానికి రెండు ఫలాలు ఉంటాయి. మొదటిది "సుఖం" రెండవది "గౌరవం".

సృష్టిలో రకరకాల ప్రాణులు పుట్టి, గిట్టుతూవుంటాయి. జీవితం బుద్బుధప్రాయమైంది. కానీ కాలం అనంతమైనది. శాశ్వతమైన గౌరవం కోసం ఒకరు జన్మిస్తే క్షణిక సుఖం కోసం కొందరు వెంపర్లాడుతారు.

మనిషి మరణించినా ఆతని కీర్తి శాశ్వతమైన గౌరవం పొందితీరాలి. కానీ ఇది దుర్లభం.

మొదటి ఫలాన్ని ఆస్వాదించి, క్షణిక సుఖాలను పొంది ఈ చరిత్ర నుంచి ఏమీ మిగుల్చుకోలేక శాశ్వతంగా వెళ్ళిపోతారు కొందరు. అంతటితో కథ సమాప్తి.

రెండవవారు శాశ్వత కీర్తి ప్రతిష్టల కోసం రెండవ ఫలాన్ని కోరుతారు. తమ కోసం "చరిత్ర" పేరును ముందు తరాల కోసం దాచుకుంటారు. (సజీవ సాహితి ఈ పేర్లను ముందు తరాల కోసం దాచి ఉంచుతుంది)

కాలం ఎవర్నీ నిలపదు. వాళ్ళ పేరు ప్రఖ్యాతులు తప్ప. తాత్కాలికమైన మొదటి ఫలరసం తుచ్ఛమైనది! రెండవ ఫలరసం చిరకాలం మన్నేది! కాలం వున్నంత కాలం మనగలిగిన సత్యాల్లో రెండవదే మొదటిది. వీరులైనవారు వీరత్వం కోసమే జన్మిస్తారు కారణజన్ములు. నీ భర్త చంచలుడు కావచ్చు కానీ వీరుడు. మట్టిలో పుట్టినంతమాత్రాన పద్మం, జాతి పువ్వు కాక మానదు. స్త్రీ ప్రలోభి ఐనా బాలచంద్రుడు గొప్ప యోధుడు. పల్నాటి ప్రజాశ్రేయస్సుకై ప్రభువులకు నీ భర్తలాంటి వీరుల అవసరం చాలావుంది.

నీ భర్తలో వున్న లోటు సుఖం. నీ సౌందర్యాన్ని చూసి, ప్రలోభి అయిన నీ భర్త రేపు కారెంపూడి సంగతి పట్టించుకోడు. అతని వీరత్వం నీ పమిటచెంగు చాటున కప్పెట్టిబడిపోతుంది. వీరపత్నిగా నిన్ను ప్రజలు మర్చిపోతారు.

నీకు శారీరిక సుఖంలో వచ్చిన భౌతిక ఆనందం కావాలో, మరణం లేని మహత్తరమైన కీర్తి కావాలో నిశ్చయించుకో!

వీర రక్తంతో నుదుట వీర తిలకం దిద్ది భర్తను యుద్ధరంగానికి పంపు! తిరిగివస్తే శాశ్వత ప్రతిష్టతో బాటు అమర సౌఖ్యాలనూ అనుభవించు. అతణ్ణి యుద్ధవిముఖుణ్ణి చెయ్యకు"

తల్లిమాటలు విన్న మాంచాల క్షణకాలం అచేతనమై "నా సుఖం కోసం నా భర్తను వీరత్వం నుంచి విముఖుణ్ణి చేయను. నీ పాదాల ఆన!" అన్నది.

తన భార్య ఆలస్యానికి చిరాకు పడుతున్న బాలచంద్రుడు, శృంగార లక్ష్మిలా వస్తున్న భార్యను

చూసి "ఇంత ఆలస్యం దేనికి?" అన్నాడు.

"అంతా మేల్కొనే వున్నారు. మీ కోసం వస్తే సఖులు నవ్వరా? కనుమరుగు చేసుకుని వచ్చాను." అన్నది.

పట్టుపరుపు మీద కూర్చున్న భర్తపాదాలను స్పృశించితే ఆమెకు అనుకోకుండా కన్నీళ్ళొచ్చాయి. బాలచంద్రుడు చూడకుండా పైటచెంగుతో కళ్ళద్దుకుని "కర్పూరతాంబూలం ఇవ్వనా?" అన్నది.

"చిత్తం" అన్నాడు.

నర్మగర్భమైన సరస సృంగార సంభాషణలనెన్నో చేసాడు. కాసేపు "నా మీద కోపం లేదా?"

"ఎందుకు?"

"రత్నాలను ఇంట్లో వుంచుకుని, రాళ్ళ కోసం పరుగెత్తే మూర్ఖులు కొందరుంటారు. నీలాంటి సౌందర్యవతిని వదిలి, పరస్త్రీల కోసం ప్రాకులాడే నన్ను నేను దూషించుకుంటున్నాను. వేశ్యాలోలుడనై, కులకాంతను కన్నెత్తి చూడని నేరానికి నా మీద నేను కోపం తెచ్చుకుంటున్నాను"

మాంచాల ఏమీ మాట్లాడలేదు.

ఆపుకోలేని తమితో ఆమె వక్షాన్ని స్పృశిస్తే మెడలోవున్న ముత్యాలపేరు తెగి, పూసలు నలుదిక్కులా చెదిరి దొర్లాయి.

"అయ్యొయ్యో ప్రభూ!" అంది.

"ఏమిటి దేవీ?"

"మాకు గౌరీ వ్రతమున్నది. ఈ హారం లేకుండా నేను దాంపత్యసుఖం అనుభవించరాదే! ఇది మా వంశాచారం. ఇప్పుడు అపచారమైపోయింది. ఏం చెయ్యను?" అన్నది.

బాలచంద్రుడు ప్రేమతో ఆమె చుబుకాన్ని పైకెత్తి "దీనికే ఇంత విచారపడాలా దేవీ? పూసలను గుచ్చటం నాకు వెన్నతో పెట్టిన విద్య. పద ఏరుదాం" అన్నాడు.

అతను ఏరి ఆమె చేతులలో పోస్తున్నాడు. ఆమె పట్టు పైట కొంగులో పోస్తూ, బాలుడు చూడకుండా నేలజారుస్తున్నది.

కాలం గడుస్తున్నది - కానీ పూసలు అన్నీ దొరకడం లేదు.

నిస్సహాయుడైన బాలుడు మాంచాల ముఖంలోకి చూసి "దేవీ! కాలం ఐపోతున్నది" అన్నాడు.

ఆ మాటలు అపశకునంగా వినిపించింది మాంచాలకు.

కన్నీరు పెట్టుకొని గద్గద స్వరంతో ఇట్లా అన్నది - "ప్రభూ! ఏడు జాములు గడిచిపోయినవి. ఆకసాన వేగుచుక్క పొడిచింది. తొలికోడి కొక్కొరొకో అని కూసింది. వీరులు మీ కోసం ఎదురుచూస్తున్నారు. యుద్ధరంగం నుంచి అజేయులై తిరిగి రండి."

"మాంచాలా! నిన్ను వదలి పోలేకపోతున్నాను"

మాంచాల భర్త నుదుట ముద్దుపెట్టుకుని "క్షణభంగురమైన బ్రతుకులో, అతి తాత్కాలికమైన స్వల్ప సుఖం కోసం మీరు మీ వీరత్వాన్ని అడవి గాచిన వెన్నెల చేయకండి. నా మాట వినండి."

అనపోతు తలుపు తట్టి "అన్నా!" అని పిలిచాడు.

బాలచంద్రుడు క్రోధాన్ని ఆపుకోలేక కత్తి దూసి, తలుపు తీసి "నిన్ను నరుకుతాను!" అన్నాడు.

అనపోతు శంత గంభీర స్వరంతో "ఉద్రేక పడటం మంచిది కాదు బాలచంద్రా! కత్తి పగవారి కోసం. తనవారిని నరకటం పరువూ కాదు, ప్రతిష్టా కాదు. నీ మాట నీవు నిలబెట్టుకో! కత్తి ఒరన పెట్టు! కారెంపూడి కదనరంగానికి కదులు! నీలోని వీర యువ రక్తం విజృంభించగా పగవారి తలల్ని తెగనరుకు! ఆపైన నీ ఇష్టం." అని బాలుడి కత్తికి ఎదురు నిల్చాడు.

ఉద్రేకం చప్పున చల్లారిపోగా, శాంతుడైన బాలుడు - "క్షమించు సోదరా! అనవసరంగా ఆవేశపడ్డాను" అన్నాడు.

మాంచాల హారతి వెలిగించి, కత్తితో వేలు కోసుకొని, భర్త నుదుట పొడవుగా రక్తతిలకం దిద్ది

"మాచెర్ల మా తండ్రి చెన్నకేశవుని ఆన
మీ అమ్మ ఐతమ్మ నోముల్ల ఫలము
కదలుమా...కదలుమా...కదనాంతకుండ
కదన రంగంలోకి, కలత లెరుగక మగడ
వీరరక్తం నొసట దిద్ది వుంచాను
వీరమాత గన్న వీరుడవు గండ
వీరపత్నిగ నేను నిల్చిపోవాలి
వీరగంధం నను తల్చి రాసుకోవాలి
ఏ నోట విన్నా నీ పేరు పలకాలి
వీరభారతి మెడలోని దండనవ్వాలి
మా అక్క "పేరమ్మ" కోర్కె నిలబెట్టాలి
నరసింగరాజు తలను పడగొట్టు
నాయకురాలిని నాశనం చెయ్యి
మాట నిలబెడుదువని చేత చెయివెయ్యి
కదన రంగములో కాలుడవు నీవు
పగతుర గుండెలో బల్లెమౌతావు
పది కాలాలు నిల్చు పల్నాటి భారతమ్ము
తల్చుకోనీ నిన్ను ప్రతి తల్లి నిరతమ్ము"

మధుర గంభీర స్వరంతో మాంచాల వీరగీతం పాడగానే బాలచంద్రుడికి ఒళ్ళు ఝల్లుమంది.

ఒక్కసారిగా ఉప్పొంగిన గుండెతో -

**"వీరరక్తం నుదుట తీర్చిదిద్దావు**
**వీరగంధం పూసి వీడుకోలివ్వు**
**నరసింగు తలగొడుదు, నాగమ్మ పడుదు**
**దీవించి పంపవే దేవి మాంచాలా!"**

మాంచాల భర్త పాదాలను అంటి - "ఈ చరిత్రలో మీ పేరు చిరస్థాయిగా నిల్చిపోతుంది. దేవతలు మీ వీరగాధను చెప్పుకుంటారు. పల్నాట వాడవాడలా మీ కథలు దివ్యగానాలై, అశేషాంధ్ర ప్రజల్ని ఉర్రూతలూగిస్తాయి. మిమ్ము కన్నతల్లి, మిమ్ము కట్టుకున్న నేను ధన్యులౌతాము.

మాచెర్ల చెన్నకేశవుడు మిమ్మల్ని సంరక్షిస్తాడు. మీకు జయం కలుగుతుంది. కానీ స్వామీ!

కాలం ఎవర్ని ఉంచుతుందో లేదో చెప్పలేం. బ్రాహ్మణులు దైవస్వరూపులు! అనపోతను యుద్ధరంగానికి తీసుకువెళ్ళకండి. లేకుంటే బ్రహ్మహత్య దోషం మనకు తగులుకుంటుంది. ఇదే నా తుది కోరిక" అన్నది.

బాలచంద్రుడు భార్యకు అభయమిచ్చి ఆమె హారతుల్ని పొంది కారెంపూడికి బయలుదేరాడు.

సజలాశ్రునయనాలతో, ద్వారబంధనాన్నానుకుని నిలబడిపోయింది మగువ మాంచాల. ఆమె ఆత్మలో అనుభూతికి అందని బాధ ఏదో సుడులు తిరుగుతోంది.

మేడపిలో బాలచంద్రుణ్ణి తల్చుకుని తల్లి ఐతాంబ మనసులోనే ఇలా దీవించింది "తండ్రీ! నీకు జయం కలుగుగాక. సర్వలోకాలనూ రక్షించే భగవంతుడు నిన్ను నిరతమూ కాపాడుతూ ఉంటాడు. వీరాంజనేయుడే వీరుడపైనా నీకు రక్ష".

**********

కారెంపూడికి బయలుదేరిన బాలచంద్రునికి భార్య మాంచాల కోరుకున్న చివరి కోరిక గుర్తున్నది. అనపోతును యుద్ధరంగానికి తీసుకుపోకూడదు. అందుకని ఒక ఉపాయం ఆలోచించాడు. ఒక్క అనపోతుకు తప్ప అందరికీ ఈ విషయాన్ని చెప్పాడు.

కొన్ని క్రోసుల దూరం పోయాక, బాలచంద్రుడు తన స్నేహితుడైన "పట్టి" అనే పేరున్న కుమ్మరి వీరుణ్ణి "తమ్ముడా! వీరహారం మర్చిపోయి వచ్చాను. ముద్దుటుంగరమూ మర్చాను. మీ వదినమ్మ మాంచాల గదిలో వుండి వుంటాయి. నేనివ్వమన్నానని చెప్పి మీ వదిన్నడిగి పట్టుకురా" పట్టి పరికించి బాలుడి ముఖంలోకి చూసి - "అన్నా! ఆయాసంగా వుంది. వెళ్ళలేను క్షమించు." అన్నాడు.

చాకలి చందు, కమ్మరి ముత్తు, వెలమల దోర్నీడు - ఇత్యాదులంతా ఏదో ఒక కుంటిసాకు చెప్పారు.

ఆఖరుకు మిగిలిందొక్క అనపోతు మాత్రమే.

"తమ్ముడా! అనపోతు! ఈ ఒక్క సాయమూ చేసిపెట్టు. ముత్యాలహారమూ, ముద్దుటుంగురమూ పట్టుకురా" అన్నాడు. బాలచంద్రుడి మాట కాదనలేక అనపోతు బల్దేరుతూ "వదినమ్మ అడిగితే ఏమి ఆనవాలు చెప్పనూ?" అన్నాడు.

బాలచంద్రుడు స్నిగ్ధంగా నవ్వి "కంఠాన వున్న ముత్యాలహారం తెగి క్రిందపడిందనీ, పూసలు ఏరబోయే వేళ అవి తీసి తల్పం తలగడక్రింద దాచానని చెప్ప" అన్నాడు.

ఈ మాటలు యథార్థమని నమ్మిన అనపోతు శీఘ్రంగా బయల్దేరాడు.

బాలచంద్రుడు త్రిపురాంతకంలో కాసేపు విశ్రాంతి తీసుకుని, రావి ఆకు నొకదాన్ని తీసి దాని మీదా ఇట్లా వ్రాసాడు - "తమ్ముడూ, అనపోతూ! మేడపిలో వీరుడైనవాడు ఒకడు వుండాలి. మీ వదిన

మాంచాల కోరిక ప్రకారం నీవు కారెంపూడి రావద్దు. ప్రస్తుతం మేడపిని రక్షించే బాధ్యత నీ భుజాన పెడుతున్నాను. నీవు వస్తే నా మీద ఒట్టు. మీ వదిన మాంచాల మీద ఒట్టు. తల్లి ఐతాంబ మీద, మాచెర్ల చెన్నుడి మీద ఆన. నీవు రావద్దు. ఇది నా ఆజ్ఞ!"

ఇది రాసి - అనపోతు వచ్చే మార్గంలో అతనికి కంపించేట్లుగా చెట్టుకు కట్టివచ్చాడు. శీఘ్రమే కారెంపూడికి బయల్దేరాడు. మార్గంలో వీరగాధలను వల్లించుకున్నారు. బ్రాహ్మణ అనపోతును ఇంటికి పంపినందుకు చాలా సంతోషించారు.

మధ్యలో నాయకురాలి కనుమ వున్నది. వీరులైనవారు కాళ్ళ మధ్యనుంచి దూరరాదు. బాలచంద్రుడు తన తమ్ముళ్ళతో వస్తున్నాడని విన్న నాగమ్మ ఈ కొండ నుంచి ఆ కొండ మీదకు కాళ్ళు జాపి నిలబడితే, బాలచంద్రుడు తన కత్తితో ఆ కొండను నరికి దోవ ఏర్పరిస్తే ఆ దారికి "నాయకురాలి కనుమ అని పేరొచ్చిందని కట్టుకథల్ని చెబుతారు.

*(ఇటువంటి ఉత్ప్రేక్షాపూరితమైన కథలతోనే పల్నాటి చరిత్ర పంకిలమైపోయింది. సుమారు ఆరున్నర శతాబ్దాల క్రితం జరిగిన పల్నాటి చరిత్రలో ఇటువంటి ఉత్ప్రేక్షలు చాలా వున్నాయి. పాఠక సౌలభ్యం కోసం వాటిని చాలా వదిలివేసాను. కొన్నింటిని వద్దనుకున్నా వ్రాయకతప్పలేదు - రచయిత)*

---

నల్లగొండ కొండలను ఎక్కి తన స్నేహితులతో బాలుడు కారెంపూడి వైపుకు బయల్దేరాడు. ఈ నల్లగొండ శిఖరం మీది నుంచి బాలచంద్రుడు తన గుర్రాన్ని దూకించాడని చెప్పుకునే మాట వింటే ఒళ్ళు ఝుల్లుమంటుంది.

నల్లగొండ శిఖరం మీద కొద్దికాలం విశ్రాంతి తీసుకుని బాలచంద్రుడు కనుమలు, గిరులు దాటి కారెంపూడి దరిదాపులకు వచ్చేసాడు. బాలచంద్రుడి మనస్సులో ఉన్నది ఒక్కటే - "అలరాజును హతం చేసిన నరసింగరాజు తలకొట్టి పెదమలిదేవుడికి కానుకగా ఇవ్వాలి"

కారెంపూడిలో మాచెర్ల సేనలు సమాయత్తమయ్యాక గురజాల ప్రజల, వీరుల గుండెల్లో లేనిపోని భయాలు ఆవహించాయి. అందరిదీ ఒకే ప్రశ్న.- "ఈ యుద్ధం ఎందుకు వచ్చిందో"నని.

ఐతే పెదమలిదేవుడు, బ్రహ్మన్నల అపూర్వ పర్యవేక్షణలో కారెంపూడిలో కాలుపెట్టాక అప్పటి దాకా బింకంతో వున్న నాగమాంబ ధైర్యస్థైర్యాలు వడలిపోవటం మొదలుపెట్టాయి. గెలుపు తమది కాదేమోనన్న భయం పట్టుకున్నది.

నలగాముని ఏకాంత మందిరంలో కల్సుకుని "విన్నారా ప్రభూ?"

"ఏమిటి?"

"మలిదేవుడు తన సేనలతో కారెంపూడికి కదలివచ్చాడు. ఈ యుద్ధం అనివార్యమా?"

"మహామంత్రిణీ! తీరా అంతా నిశ్చయమయ్యాక ఇదేం ప్రశ్న?"

"మనం సంధికోసం ప్రయత్నిస్తే?"

"నగుబాటు కాదా ఈ నలగాముడికి!"

"ప్రజాశ్రేయస్సు కోసమైనా - ఈ పని చెయ్యాలి!"

"మరి భట్టు రాయబారం నాడే సంధి చేసుకుంటే పోయేదిగదా?"

నాగమ్మ తలపంకించి "ఇంత తొందరగా మాచెర్లవాళ్ళు మన మీదకి దండెత్తి వస్తారని ఊహించలేకపోయినాను. ఏమీ ఫరవాలేదు. నేను సంధి ప్రయత్నాలు చేస్తాను" అన్నది.

"మీ ఇష్టం" అన్నాడు నలగాముడు.

నాగమ్మ నలగాముని ఏకాంతమందిరం నుంచి బైటకు వచ్చి, తక్షణమే తమవైపు ముఖ్యమైన నలుగురు రాజులను పిల్చి బ్రహ్మనాయుడి దగ్గరకు రాయబారం పంపింది. అందులో -

"పెదమలిదేవా! జరిగిన పాత పగలు ప్రజాశ్రేయస్సు కోసం మర్చిపోదాం. మీకు ధర్మంగా రావలసిన రాజ్యభాగాన్ని మీకు ఇస్తాను. అలరాజును మా నరసింగరాజు చంపాడని మీరు భావిస్తే నరసింగుని మీకు అప్పగిస్తాను. ఇట్లు, నలగామరాజు, గురజాల ప్రభువు" అని.

సంధి కుదర్చటానికి వచ్చిన నలుగు రాజుల్లో ఒకడైన "చింతపల్లి రెడ్డి" ఈ పత్రాన్ని చదివి వినిపించాడు.

కొలువు దీరివున్న పెదమలి దేవుడు "యుద్ధరంగంలో సేనలు సమాయత్తమైనాక గానీ, నలగామరాజుకు కళ్ళు తెరిపిడి పడలేదా? తీరా అంతా నిశ్చయమయ్యాక ఈ సంధి సంప్రదింపులేమిటి? నలుగురూ నవ్వరా? మనమూ నగుబాట్ల పాలుగామా?" అని ప్రశ్నించాడు.

బ్రహ్మన్న కోరమీసం దువ్వి "రణరంగంలో బలాబలాలు తేల్చుకుందామనుకున్న నాగమాంబ ఇప్పుడు ఇట్లా మారిందేమిటి? స్త్రీలకు చపలత జన్మహక్కు కాదుగదా?" అన్నాడు.

దీర్ఘకాల తర్జనభర్జనలు జరిగాక లోకకళ్యాణం కోసం, పల్నాటి పచ్చదనం కోసం, ఈ సంధిని ఆమోదించారు.

ఐతే -

నల్లకొండ మీద నుంచి క్రిందకు పరికించిన బాలచంద్రుడికి అసంఖ్యాక సేనావాహిని కారెంపూడి రణక్షేత్రం దాపున కనిపించింది. బాలుడు అపరిమితానందంతో, ఉద్రేకంతో పల్నేటి భుజాన చేయివేసి - "వీరపల్నేటీ - పల్నాటి వీరుల వీరత్వం ఖండఖండాంతరాలకూ తెలిసిపోయే క్షణం ఆసన్నమయింది. ఒక్కసారి ఈ అఖండ సేనావాహినిని వీక్షించు! నల్లకొండను చీల్చుకుని ప్రవహించే ఈ నాగులేటి వురవడి, పల్నాటి వీరుల వీరి రక్తంలో విజృంభిస్తున్న నాగులేటి నీళ్ళూ, ఈ కొండరాళ్ళూ వీరత్వం నాలుగు దిక్కులా పంచిపెడుతూ అమర సందేశాలు వినిపిస్తాయి.

కురుక్షేత్ర వీరుల్లగా నలగాముని సేనాధిపతుల్ని ఇప్పుడు పరిచయం చేస్తాను. విను -

**పడమటి దిక్కుల్లో 'పొజుల్ల బ్రహ్మన్నా'**
**కదనరంగమ్ముల్లో కొదమ సింగమ్ము**
**తూర్పుదిక్కున దిక్కు 'గణపతీ'**
**యుద్ధ ధర్మములోన 'గుణపతీ'**
**దక్షిణ భాగమ్ములో మంత్రి 'నాగమ్మా'**
**మంత్రాంగమ్ములో 'అమ్మలకు అమ్మా'**
**ఉత్తరమ్మున ఉన్నవాడు 'రామన్నా'**
**కత్తియుద్ధములోన పెద్ద పేరన్న**
**వీర హెచ్చరిక జేయు 'నరసింగరాజు'**
**పేరమ్మ పెనిమిటిని కూల్చిన్నవాడు**
**మనసాటి ఎవ్వరూ మహిలోన లేరు**
**మనతోటి పోరు వీరు లింకెవరు?"**

బాలచంద్రుడి మాటలు విన్న పేర్నీడు "అన్నా! నీవు చెప్పినట్లు నేల నాలుగు చెరుగులా సైన్యం సమాయత్తమై వున్నది. ఈ కొండనుండి మార్గం అర్థం కావటం లేదు. వెళ్ళాలంటే శత్రు సైన్యాన్ని వెనకనుంచి దాటాలి. వెనకనుంచి చెణికేవాడు వీరుడు కాడు, భీరుడు! అక్కడ పరిస్థితి ఎట్లా వుందో మనకు తెలియదు. ఈ మహాప్రవాహం లాంటి సైన్యాన్ని చూసి - తెలివిగల్గిన నాగమ్మ ఆఖరిక్షణాల్లో సంధి ప్రయత్నమూ చెయ్యవచ్చు. ఏం చేద్దాం?" అన్నాడు.

"ఇది ప్రస్తుతం ఆలోచించాల్సిన విషయమే!" అన్నాడు బాలచంద్రుడు.

దోర్నీడు క్షణం ఆలోచించి "వీరులకు వీరుడై పగవారి గుండెలో పదును బల్లానివై శత్రు శిరస్సులను తుత్తునియలు చేయగల నీకు చెప్పగలిగేదేమున్నది? మనం కనుమ దిగి, రాచబాటన పెదమలిదేవుణ్ణి కల్సుకుందాం. ప్రభువుల ఇష్టం వచ్చినట్లు చేద్దాము. ఏమంటావ్?" అని ప్రశ్నించాడు.

బాలుడు తలవూపి "అట్టాగే" అన్నాడు.

బాలచంద్రుడు ఆ తర్వాత "సవరాల గోడిగ" అనే జాతి గుర్రాన్ని అధిరోహించి - అలరాజు తనకిచ్చిన అమూల్య ఖడ్గాన్ని వరలో దోపి - కాలం వృధా అవుతున్నదని కళ్ళాలు బిగబట్టి, గుర్రంలో డొక్కలో ఒక్క తన్ను తంతే - అది కుప్పించి, గాలిలో తేల్తున్నట్లు నల్లగొండ నుంచి ఒక్క ఉదుటున క్రిందకు చెంగలించింది.

దూకిన గుర్రం సకిలించింది.

అప్పటిదాకా స్థబ్దుగా వున్న రణక్షేత్రం కొండ మీంచి దూకిన గుర్రాన్ని చూడగానే గుండెలవిసిపోయినట్లు బిత్తరపోయింది యుద్ధభూమి అతలాకుతలమయింది.

**********

కొండ దిగి వచ్చిన దోర్నీడు, మిగతా వీరులు బాలచంద్రుణ్ణి కలుసుకున్నారు.

బాలచంద్రుణ్ణి చూడగానే - "నరసింగరాజు మృత్యువు కొండ దూకి వచ్చింది" అని వీరులు మనస్సుల్లో అనుకున్నారు.

బాలచంద్రుణ్ణి చూసి విస్తుబోయిన బ్రహ్మన్న "నువ్వెందుకు వచ్చావు?" అని ప్రశ్నించాడు.

"వీరుల్ని అడిగే అధికారం ప్రభువులకు కూడా లేదు!"

బాలచంద్రుడి వదనం చూడగానే సంధికొచ్చిన రాజుల గుండెలు ఝల్లుమన్నాయి. "ఉద్రేకీ - నిష్కపటి - అజేయుడూ అయిన బాలచంద్రుడు వచ్చి వాలితే ఇక సంధి పొసగదు" అని అనుకున్నారు

"ఇంతకూ నీవు వచ్చిన పనేమిటి?" అన్నాడు కన్నమదాసు.

"ప్రభువులను చూడాలి!"

"వీలుపడదు"

"ఎందుకని?"

"వారు ఏకాంత మందిరంలో ఉన్నారు"

"అందుకే చూడాలి!"

కన్నమ కళ్ళెర్రజేసి "ఇక్కడ కన్నమ వుండగా అది అసాధ్యం!" అన్నాడు.

ఈమాటలతో ఉగ్రుడైన బాలుడు కన్నమ తొడమీద కాలువేసి - సముద్రం దాటటానికి బయల్దేరిన వీరహనుమంతుడిలా, కుప్పించి దూకి, అడ్డొచ్చిన సైనికులను పక్కలకు నెట్టి మలిదేవుని ముందుకు వచ్చి నిలబడ్డాడు.

మలిదేవుడు బాలుణ్ణి చూసి ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు. బాలచంద్రుడు శాంత గంభీర స్వరంతో "ప్రభూ! నేను చేసిన నేరమేమిటి? ప్రభువులు పలికని పైనమేమిటి?" అని ప్రశ్నించాడు.

బాలచంద్రుడు చేసిన ఈ పనికి మాల కన్నమ కుపితుడై, ఒరనుంచి కత్తి తీసి "ఇంతమంది పెద్దలుండగా నువ్వొక్కడివే వీరుణ్ణనుకున్నావా? ఈ ఆగడమేమిటి? ప్రభువులతో ఎలా మెలగాలో తెలియని పసివాడవు! నీకు యుద్ధమేమిటి? ఈ కత్తితో రెందుగా నరుకుతాను, వీరుడివైతే కాసుకో!" అన్నాడు.

బాలచంద్రుడు కళ్ళు నిప్పుల్లా చేసి "కన్నమా! వీరత్వాన్ని గురించి, వీరులు బీరాలు పోవక్కర్లేదు. అది వీరత్వం కాదు. యుద్ధం చేయటానికి మీ చేతుల్లో చేవలేదు. ఉంటే ఇప్పుడు సంధి ప్రయత్నాలేమిటి?

అడవుల్లో, కొండల్లో, కోనల్లో బ్రతకరాని బ్రతుకు బ్రతికిన మీలో శౌర్యలక్ష్మి స్థానం వీడిపోయింది.. చేవచ్చిన చేతులతో, తుప్పబట్టిన కత్తులు పట్టుకుని ఏదో మాట్లాడుతున్నావు. ఇప్పుడు కబుర్లు కావు, కార్యం కావాలి. నాపై కళ్ళెర్రజేయడం కాదు, కదనరంగంలోకి దూకడం నీ ప్రస్తుత కర్తవ్యం. కారెంపూడి రణదేవతలకు మనుష్యరక్తం కావల్సివస్తే నన్ను నరుకు, కానీ ఇలా వ్యర్థమైన కబుర్లు చెప్పకు" అన్నాడు.

"కుర్రతనంపోని బాలుడివి! అతి ప్రేలాపనలు వద్దు. ప్రభువుల ముందు ఎలా పల్కాలో తెల్సుకో వో!" అన్నాడు కన్నమ.

బాలచంద్రుడు కోపాన్ని సంభాళించుకుని - "యుద్ధం చేయదల్చుకోక కారెంపూడికి ఎందుకు వచ్చారో నాకు అర్థం కావడం లేదు. మహామంత్రులు బ్రహ్మన్న గారు ప్రభువుల ముందు నిర్భీతిగా మాట్లాడే అధికారం నీకు ఇచ్చారనుకుంటాను. ఐతే తెలియక అడుగుతున్నాను, వారికి నీవేమవుతావు?"

కన్నమ సూటిగా బాలుడి ముఖంలోకి చూసి - "పసివాడని పసివాడివి. ఐనా అడిగావు గనుక చెబుతాను - బ్రహ్మనాయుడు నాకు తండ్రితో సమానం. నాకు ప్రత్యక్ష దైవం. ఆయనే నా తండ్రి. అందువల్ల నీకు అన్నను. మొదట నేను, ఆ తర్వాతే నువ్వు. తెలిసిందా!" అన్నాడు.

బాలచంద్రుడు చిత్రమైన నవ్వు నవ్వి - "నా కన్నా ముందుపుట్టిన అన్నా! కన్నమా! నీ తమ్ముడు, నీ తొడ ఎక్కడం తప్పు కాదే? ఆ మాత్రానికే ఇంత కోపం తెచ్చుకోవాలా?" అని ప్రశ్నించాడు.

ఆ మాటలు వినగానే కన్నమ కోపం కరిగిపోయింది. బాలచంద్రుడి పసిముఖాన్ని చూడగానే ఆర్ద్రతతో ద్రవించి -"తమ్ముడూ! నన్ను క్షమించు! అలవిమానిన కోపంతో నిన్ను అనరాని మాటలన్నాను".

అప్పటికీ నిశ్శబ్దంగా కూర్చున్న మలిదేవుడి వైపు తిరిగి, కుపితస్వరంతో బాలుడు ఇట్లా అన్నాడు -

"కోడిపందెం మోసమని తెల్సినా ఆనాడు నోరు మెదపలేదు. అలరాజును చంపినా, ఆలమందలను వొడిపించినా, 'శాంతం, శాంతం' అని పల్నాటి క్షాత్రాన్ని మంటగలిపారు. పేరమ్మ కన్నీటిని ఆనాడు తుడవలేకపోయారు. అడవుల్లో ఆకుల్ని అలముల్ని తిని, జీవించడంలోనే మీకు ఆనందం లభించివుండవచ్చు. కానీ, అధర్మమని తెలిసినా, రాజ్యాన్ని తెచ్చుకోకపోవడం తప్పు. నేను

బాలుణ్ణనీ, పిరికిపందననీ, అర్హత లేనివాణ్ణని పలకరించకుండా వున్నారా లేక ప్రభువులమన్న అహంకారమా?"

బాలచంద్రుడి మామ గండు కన్నమ కోపం వచ్చిన అణుచుకుని "జరిగిపోయిన వాటిని త్రవ్వుకుని ప్రయోజనం లేదు నాయనా! ధర్మం అనేది ఒక జ్యోతి. వెలుగు కావాలంటే ధర్మానికి కట్టుబడక తప్పదు. విజ్ఞుడైన బ్రహ్మన్న మాటలను మేము పాటిస్తున్నాం. యుద్ధం చేయలేక కాదు; చేతకాకా కాదు. ఇక తప్పులంటావా? అవి ఇరుపక్షాల్లోనూ ఉన్నాయి.

రాజ్యవిభాగం, అలరాజు హత్య, ఆలమందల్ని పొడవడం, భట్టు రాయబారాన్ని నిరాకరించడం - ఇవన్నీ నలగాముడి తప్పులే. అంత మాత్రాన రక్తపాతాలు చేసుకోవటం తగదు.

యుద్ధం వస్తే ఒక్కపూటతో అది ఆగదు. ధన, మాన, ప్రాణ నష్టాన్ని కలిగించకుండా మానదు. దాయాదిని మించిన శత్రువులు ఇంకెవరూ ఉండరేమో! రాజ్యం కోసం దాయాదుల మధ్య యుద్ధం రాక మానదు. అందువల్ల తాత్కాలిక సంధి ప్రయత్నాల్ని ఒప్పుకోవడంలో తప్పులేదు." అన్నాడు.

దానికి బాలచంద్రుడు - "మామా! నన్ను పసివాడని ఎద్దేవా చేయడం తగదు. పేరమ్మ చితి ఎక్కినప్పుడు, ఆమె ఆత్మశాంతి కోసం నరసింగరాజు తల తెగ నరుకుతానని మాట ఇచ్చాను. ఆ మాట వమ్ముగావల్సిందేనా?" అని ప్రశ్నించాడు.

సభలో ఎవ్వరూ పలుకలేదు.

ఆ మౌనంతో, బాలుడు ఉదయించే సూర్యబింబంలా, ఎర్రబడ్డ ముఖంతో -

> **"కదలరా ఓ మామ గండు కన్నమ్మా**
> **వీరమాతవ్వాలి నిను కన్న అమ్మ**

దూకరా దూకరా కొదమ సింగమ్మా
పగవారి గుండెలో పదును బల్లెమ్మా
అలరాజు పోయేనే మామ కొమ్మన్నా
చచ్చెనా చచ్చెనా నీలో చేవ ఏమన్న!
అంబులను ధరియించు - ఆహవం చెయ్యి
వచ్చి వాలును తల్లి రణలక్ష్మి నీకు.
ఆవాలా నాయుడా! అసహాయ శూరా
యుద్ధక్షేత్రమునకై కదలిరా వీరా
కదన రంగమ్ముల్లో పదును కత్తుల్తో
పగవారి తలల్తో బంతులాడేమురా!
వీర పడవాలుడా - వీరులకు మగడా
ఆసన్న మాయెరా, అనుకున్న రోజు
బల్లెమ్ము ధరియించి బలిపెట్టవేరా
రణభూమి నెత్తుటా జలకమ్ములాడు
బాదన్న - నారన్న - బ్రహ్మనాయుండా
కదలండి కదలండి కదలరేమండి?
మెరిసె తూర్పున కాంతి, మేఘాల కొనల
శుభమస్తు మీకంటు దీవించు మనల
వీరులారా రండి - విజయమ్ము మనది.
శూరులారారండి - శుభమౌను మనకు."

ఈ పల్కులతో సభలోని మాచెర్ల వీరుల్లో రోషం హెచ్చింది.

"ఔను! ఇంతకాలం సహించాం. ఇక సహించవలసింది లేదు. అన్నిసార్లు నాగమ్మే తన మాటను చెల్లుబాటు చేసుకుంటోంది. ఇక ఆగి ప్రయోజనం లేదు. బాలుడన్నట్లు యుద్ధరంగంలోకి కదుల్దాం."

ఉన్నట్టుంది పరిస్థితి సంపూర్తిగా మారిపోయిందని గ్రహించిన బ్రహ్మన్న "వీరులారా! కాసేపు మీ ఉద్రేకాన్ని తగ్గించుకోండి. బాలచంద్రుడితో నన్ను మాట్లాడనివ్వండి." అన్నాడు.

వీరుల్లో శాంతం వచ్చినా గుసగుసలు మాత్రం పోలేదు.

"బాలచంద్రా! రా నాయనా! కొమ్మరాజా, బావా గండ్ కన్నమా - మీరూ రండి."

బ్రహ్మనాయుణ్ణి అనుసరించి వాళ్ళంతా వేరే గుడారంలోకి వెళ్ళారు.

*********

బ్రహ్మనాయుణ్ణి అనుసరించి వాళ్ళంతా ఒక గుడారంలోకి వెళ్ళారు. అందరినీ కూర్చోమని చెప్పి బ్రహ్మనాయుడు బాలచంద్రుడి ముఖంలోకి చూసి - "నాయనా! బాలచంద్రా! యుద్ధం సంగతి అట్లా వుంచు. మేడపిలో అంతా బావున్నారా?"

"ఆ"

"మీ అమ్మ ఐతాంబ క్షేమమా?"

"ఊ"

"నీ భార్య మాంచాలను చూసి వచ్చావా?"

"ఆ"

"ఆ గుణవతి క్షేమమేనా?"

"ఊ"

బాలచంద్రుడి కోపం సగం తగ్గింది. మేడపిలో విషయాలు చాలా అడిగి అడిగి అతన్ని ప్రశాంతవంతుణ్ణి చేసాడు బ్రహ్మన్న.

అప్పుడే కొమ్మరాజు బాలచంద్రుడి వైపు చూసి - "నాయనా! మరణించిన అలరాజు మరల తిరిగిరాడు కదా! అందుకే ఆ రాయబారానికి ముందు నిన్ను నేను దత్తత తీసుకున్నాను. మా వంశానికి మిగిలిన వాడివి నువ్వొక్కడవే నాయనా!" అన్నాడు.

బ్రహ్మన, కొమ్మన చెప్పిన మాటలు విని, ప్రశాంతచిత్తుడైన బాలచంద్రుడు "పెద్దలయిన వాళ్ళు, ధర్మసూత్రం తెలిసిన రాజనీతిజ్ఞులు చెప్పారు గనుక ఒప్పుకుంతున్నాను. సంధి నాకు, నా సహోదరులకు సమ్మతమే. కానీ ఇది మా ఆఖరి హెచ్చరిక! ఇక మీద, నాగమ్మ నయవంచన చేసినా, అసందర్భ ప్రలాపాలు పల్కినా క్షమించము!" అన్నాడు.

ఇరుపక్షాలకు సంధి కుదిరిందని తెల్సిన అటువారు, ఇటువారు చాలా సంతోషపడ్డారు.

సంధి కుదిరిందన్న వార్త అంచెలంచెలుగా పల్నాడంతా పాకిపోయింది.

బాలచంద్రుడి ఆజ్ఞ ప్రకారం అనపోతు మాంచాల ఇంటికి వచ్చేసరికి ప్రొద్దు వాటారబోతున్నది.

"వదినా! మా అన్న బాలచంద్రుడు పంపగా వచ్చాను. అన్న విశ్రమించిన పట్టుతల్పం తలగడ క్రింద చంద్రహారము, ముద్దుటుంగురమూ మర్చినాడత. నన్ను పట్టుకురమ్మన్నాడు" అన్నాడు.

మాంచాల అనపోతు వంక చూసి - "మరిదీ! మీ అన్న ఇక్కడ ఏమీ మరవలేదు నాయనా!" అంది.

అనపోతు విచార వదనంతో "వదినా! మీకు ప్రణామం. వెళ్ళొస్తాను" అన్నాడు.

"ప్రొద్దుపోయింది మరిదీ!" అన్నది మాంచాల.

"అన్నగారి ఆజ్ఞ దాటటానికి వీల్లేదు. వెంటనే వెళ్ళాలి" అని గుర్రమెక్కి మేడపి వైపు బయల్దేరాడు.

సాని సబ్బాయి ఇంటికి వెళ్ళేసరికి మధ్యరాత్రయింది. వెళ్ళి తలుపు కొడితే సబ్బాయి "ఎవరు?" అంది.

"నేను, అనపోతును"

వాకిలి తీసి, "ఇంత రాత్రప్పుడు వచ్చారేమిటి?" అంది.

"నీతో పనుండి"

"లోని వచ్చి కూర్చోండి"

"కూర్చునే సమయం లేదు. మా అన్న బాలచంద్రుడు నీ పడక గదిలో చంద్రహారమూ, ముద్దుటుంగరమూ మర్చిపోయి వచ్చినాడంట. నన్ను పంపాడు. వేగిరం వాటిని ఇవ్వు. నేను వెళ్ళాలి" అన్నాడు.

సబ్బాయి ఫక్కున నవ్వితే, కుపితుడైన అనపోతు "ఏమిటా నవ్వు?" అన్నాడు.

సబ్బాయి నవ్వాపి "బ్రాహ్మణుడవైన నిన్ను యుద్ధానికి రాకుండా చెయ్యడానికి ఎత్తిన ఎత్తుగానీ, మీ అన్న ఇక్కడ ఏమీ వదిలిపోలేదు. నీవు యుద్ధరంగంలోకి రావొద్దంటే బాధపడతావని నీ ముఖాన చెప్పలేక ఇటువంటి పన్నాగం పన్నాడు బాలచంద్రుడు" అన్నది.

అనపోతు ఆలోచనలో పడి "వెళ్ళొస్తా" అని చెప్పి గుర్రమెక్కి, ఆఘమేఘాల మీద కారెంపూడి వైపుకు బయల్దేరాడు. రాత్రితో బాటు అనపోతు ప్రయాణమూ గడుస్తున్నది. క్లిష్టతరమైన మార్గంలో మసక వెన్నెల్లో ప్రయాణం చేయవలసి వచ్చింది.

త్రిపురాంతకం పొలిమేరల్లో వుండగా, బాలభానుడి రంగులు తూర్పున మేఘాల అంచుల మీద ఎర్రరంగు పూస్తున్నాయి. ఉదయం లేత వెలుగులు పర్చుకుంటున్నది. ఎదురొచ్చిన కాపు సమూహాన్ని ఆపి "ఇటు గుర్రాల మీద వెళుతూ, వీరులెవ్వరైనా కనిపించారా?" అని అడిగాడు అనపోతు.

"లేదు" అన్నారు వాళ్ళు.

గుర్రం అలసి, నోట నురగలు కక్కుతున్నది. నిన్న ఎక్కడైతే విశ్రాంతి తీసుకున్నారో సరిగ్గా అక్కడే ఆగాడు అనపోతు. నిద్రలేమితో మందుతున్న కళ్ళను తుడుచుకున్నారు. గుర్రం సెలయేటిలో నీరు త్రాగి, పసరికను తింటున్నది.

తిన్నె మీద కూర్చున్న అనపోతుకు కొమ్మకు వ్రేలాడుతున్న రావీఅక్క్య కనిపించింది. దాన్ని లేచి నిలబడి అందుకున్నాడు. తనను ఉద్దేశించి వ్రాసిన పత్రమది. దాన్ని చూడగానే అనపోతు గుండెలో అలవికాని జ్వాల రేగింది. బ్రాహ్మణుడిగా పుట్టడం వల్ల, కారెంపూడి రణక్షేత్రం తనని నిరాకరించిందని వీరుడైన అనపోతు చాలా ఖేదపడి - "అన్నా! బాలచంద్రా! నన్ను ఎంత మోసం చేసావు? అనపోతు పరాక్రమం అతనిలోనే అంతమైపోవాలా?" అని విలపించాడు.

చేయగల్గింది లేదు. మంచో, చెడో, బాలచంద్రుడే నిర్ణయించాడు.

వీరుడైన అనపోతుకు, యుద్ధరంగంలోకి వెళ్ళలేని తన మీద తనకే అసహ్యం వేసింది. ఒక్కమాటలో జీవితం మీద విరక్తి పుట్టింది. వీరులను రణరంగంలోనికి రాగూడదనే ఆంక్ష కులానుసారంగా వర్తిస్తుంటే వీరత్వం సంగతేమిటి? అనే ప్రశ్న వచ్చింది.

బాల్యం నుంచి సమవయస్కులై ఒకరి ప్రాణం మరొకరుగా పెరిగిన బాలచంద్రుడి నుంచి విడివడిన అనపోతు హృదయం పగిలి ముక్కలయింది.

ఐతే అనపోతు హృదయంలో చాలా కాలం నుంచి ఒక కోరిక వున్నది. నలగాముని శత్రు సైన్యంతో వీరవిహారం చెయ్యాలని, పగవారి గుండెలకు చీల్చాలనీ - కాని బాలచంద్రుడి ఆజ్ఞ ప్రకారం - నిన్నటి ఆశలన్నీ ఇవాళ సమూలంగా నాశనమైపోయాయి.

అతను అలవిమాలిన ఇటువంటి దు:ఖములో వుండగానే - కారెంపూడి వీరులను తినుబండారాలు తీసుకెళ్తున్న "మాడచి" అనే ఆడది పల్లకి ఎక్కి వెళ్తూ కనిపించింది. రావి చెట్టు నీడన దిగాలుగా కూర్చున్న అనపోతును చూసి - "నాయనా! ఇక్కడ వంటరిగా ఏం చేస్తున్నావు?" అని ప్రశ్నించింది.

అనపోతు వున్న విషయాన్నంతా విపులీకరించి "కురుక్షేత్ర యుద్ధంలో వీర విహారం చేసిన పాండవ, కౌరవ గురువరేణ్యుడు ద్రోణుడు బ్రాహ్మణుడు కాదా! బ్రహ్మాస్త్ర ప్రయోగము తెలిసిన అశ్వద్ధామ బ్రాహ్మణుడు కాదా? రాజవంసాలను ఇరవై వొక్కసార్లు సంహరించాడు, క్షత్రియ రక్తంలో జలకమాడిన పరశురాముడు మా జాతివాడు కాదా? అటువంటప్పుడు వీరుడెవడైనా ఒకటే! యుద్ధంలో వీరత్వం ముఖ్యంగానీ, నా బ్రాహ్మణత్వం ముఖ్యం కాదు గదా! అటువంటప్పుడు ప్రాణంలో ప్రాణంగా పెరిగిన బాలచంద్రుడు ఇంత నిర్దయగా నన్ను ఇట్లా చేయతగునా?

నేను ఎన్నడూ, ఎవర్నీ, ఏమీ కోరి ఎరుగను. ఈ ఒక్క సహాయం చేసిపెట్టు. నన్ను వదిలి యుద్ధరంగానికి వెళ్ళిన మా అన్న బాలచంద్రుడికి నా నమస్కారాలు చెప్పు. తోటి సోదర వీరులను పేరుపేరునా అడిగానని చెప్పు! యుద్ధంలో వీరత్వం చూపించలేని ఈ తుచ్ఛ శరీరం మీద నాకు విరక్తి కలిగిందనీ, వీరత్వంతోనే మరణించి, ఆ లోకంలో కలుసుకుంటానని చెప్పు!" అన్నాడు.

పల్లకీ బోయీవాళ్ళు అనపోతు వంక చూస్తున్నారు. గడ్డి మేస్తున్న గుర్రం అటునుంచి ఇటుకు తిరిగింది.

అనపోతు మొలలోంచి సర్రున కత్తు దూసి, అమిత వేగంతో తలను నరుక్కున్నాడు.

రక్తం మచ్చలు మచ్చలుగా చింది పచ్చగడ్డిలో ఎర్రటి పూత పూసింది. గుర్రం హృదయ విదారకంగా సకిలించింది.

ఈ ఘోర, భయానక దృశ్యాన్ని చూసిన మాడచి గుండెలవిసేలా "తండ్రీ! చెన్నకేశవా!" అని అరచింది.

పల్లకీ మోసే బోయీల గుండె లవిసి, కళ్ళు చెమర్చాయి.

మానవ జీవితంతో కలిసి అడుగులేసే కాలానిదో విచిత్రమైన పాత్ర! ఎవరిని తనతో ఎప్పుడు వెంట తీసుకు వెళ్తుందో చెప్పలేం.

పుత్ర మరణాన్ని తెలుసుకున్న అనపోతు తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ అలవిగాని శోకంతో విలవిల్లాడిపోయారు.

అనపోతు శరీరాన్ని శాస్త్రోక్తంగా అగ్నిదేవుడికి సమర్పించారు.

వీరుడైన అనపోతు చరిత్ర ఇలా అంతమై, పల్నాటి వీరగాధలో మరపురాని మహత్తరమైన కీర్తిని పొందింది.

ఆంధ్రమాత ఎంత గొప్పది? తరతరాలు చెప్పుకునే వీరులను, వీరవనితలను కన్నది. చరిత్రలో నిల్చే ఈ వీరగాధలే తెలుగుతల్లి కంఠాభరణాలయినాయి.

మాడచి దు:ఖాన్ని అదుపులో పెట్టుకొని కారెంపూడికి బయల్దేరింది.

యుద్ధ క్షేత్రంలోకి వచ్చాక తను తెచ్చిన తినుబండారాలను అక్కడవుంచి, బాలచంద్రుడి దగ్గరకొచ్చి "బాలచంద్రా! అనపోతు నుంచి నీకొక కానుక తెచ్చాను నాయనా!" అంది.

బాలచంద్రుడు చిరునవ్వుతో "ఏమిటది మాడచీ?" అన్నాడు.

"ఇదే నాయనా" అని రక్తంతో తడిసిన అనపోతు జంధ్యాన్నీ, అతను తల నరక్కున్న కత్తిని ఇచ్చింది. అసలు వృత్తాంతాన్ని వివరించి చెప్పింది.

బాలచంద్రుడు అలవిమాలిన బాధతో విలవిల్లాడిపోయాడు. తన బహి:ప్రాణమైన అనపోతును తనే బలిపెట్టుకున్నాడా? లేక త్రిపురాంతక దేవుడు - అనపోతు రక్తాన్ని కోరుకున్నాడా?

మాడచి తెచ్చిన మధుర పదార్థాలను తినటానికి వీరులు, వీరనాయకులు బంతులు తీర్చుకుని, ఆకుల ముందు కూర్చున్నారు.

అనపోతు మరణంతో వీరావేశం ఆవహించిన బాలచంద్రుడు ప్రళయకాల రుద్రుడివలె విలయ తాండవ వికటాట్టహాసం చేసి "వీరులారా లేవండి! సంధి వద్దు! ప్రాణం మీద భయం వున్న వారు వుండండి. నేను, నా తమ్ములతో కారెంపూడి రణక్షేత్రంలో యుద్ధం చేస్తాను. శత్రుసేనలను కత్తి కొక

కండగా బలియిస్తాను. పేరమ్మ కోర్కె తీరుస్తాను. నరసింగుని తల బల్లాని గుచ్చి, పాప పరిసమాప్తి కావిస్తాను." అన్నాడు.

అప్పటి వరకూ నిశ్శబ్దంగా వున్న బాలచంద్రుడికి ఆవహించిన ఈ శివమేమిటో, పల్నాటి వీరు లెవరికీ అర్థం కాలేదు.

మాడచి చెప్పే దాకా ఏం జరిగిందో ఎవరికీ తెలియరాలేదు.

బాలచంద్రుడి పలుకులు విన్న తర్వాత ఎవరికీ అన్నం ముట్ట బుద్ధికాలేదు. తినబోయిన తిండిని "గంగధార" మడుగులో విసిరి, వీరులు చేతులు కడుక్కున్నారు.

ఇది ఇట్లా జరుగవచ్చుననే భయం మహామంత్రి బ్రహ్మన్నకు మొదటి నుంచీ వున్నది. అలనాడు జ్యోతిష్కులు చెప్పిందే ఇప్పుడు జరుగుతున్నది. దైవఘటన ఎట్లా వుంటే అట్లా జరుగుతుంది. మానవ జీవితం నిమిత్తమాత్రమైంది.

యుద్ధం వచ్చింది.

ఇక బాలచంద్రుణ్ణి ఆపగలవరులేరు.

వీరుల వీరత్వాన్ని ఎవరూ ఆపలేరు. అది సంధ్యాకాంతివలే ప్రకాశవంతమైనది.

సంధికొచ్చిన రాయబారులు ఈ విషయాన్ని నాగమాంబకు, నలగామరాజుకూ చేరవేసారు.

జరగబోయేదానికి ఇక విచారించి ప్రయోజనం లేదని అర్థం చేసుకొన్న నలగాముడు, తన సేనల్ని సమాయత్తం చేసుకున్నాడు.

**********

ఇరుపక్షాల సేనలూ సమాయత్తమైనవి. జరగబోయే దానికి విచారించి ప్రయోజనం లేదని తెల్సుకున్న నలగాముడు, తన సేనలను సమాయత్తం చేసుకున్నాడు.

వీరులైన ఆరుగురు తమ్ముళ్లనూ పేరుపేరునా పిలిచాడు బాలచంద్రుడు.

**"కదలరా కదలరా, కమ్మర్ల పట్టి**
**కత్తుల్తో కుత్తుకలు తరగాలి నువ్వు**
**కంసాలి చందుడా - కరుణ మాటే వలదు**
**కదనరంగమ్ములో కాలుడివికమ్ము**
**కుమ్మర్ల తమ్ముడా, కూరిమి సఖుడా**
**అడ్డు వచ్చినవారి గుండెల్ని చీల్చు**
**మంగలి మల్లుడా, మగవారి మగడా**
**మధ్యందిన మార్తాండుడివి కమ్ము**
**చాకలి చందుడా చేవగల్గినవాడా**
**చేత కుంతమ్ము ధరియించి రమ్ము**
**వెలమల దోర్నీడా, వేయి వీరుల సమమా**
**వీరరక్తము త్రాగి - విహరించు తండ్రీ**
**వీరులారా రండి, విజయమ్ము మనది**
**శూరులారా రండి, శుభమౌను మనకు"**

బాలచంద్రుడి పలుకులు విన్నాక అన్న ఆజ్ఞను శిరసా వహించి తమ్ముళ్లు యుద్ధరంగంలోనికి దూకారు.

ఐతే అతన్ని యుద్ధ విముఖుణ్ణి చేయటానికి పెద్దలైనవారంతా ప్రయత్నించారు కానీ, బాలుడు అందరి మాటనూ పెడ చెవినబెట్టి -

"పేరమ్మ తుది కోర్కె తీర్చాలి. నరసింగుని తలను కొట్టాలి! నేను బ్రహ్మనాయుడి కొడుకును ఐతే - ఐతాంబ నోముల ఫలాన్నే ఐతే, చెన్నకేశవుని వరప్రసాదిని ఐతే, ఆడినమాట తప్పని, శీలంవారి బాలుణ్ణే ఐతే - ఈ మాటను నెరవేర్చి నా చెల్లెలు పేరమ్మ నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చెయ్యను. ఆమె ఆఖరు కోరిక తీర్చి, పైలోకంలో వున్న ఆమె ఆత్మశాంతి చేకూరుస్తాను." అన్నాడు.

ఆటుపోటులున్న సముద్ర రాకిడిని భరించలేనట్లు, బాలచంద్రుడి పౌరుషాన్ని చూడగానే ఇక యుద్ధం అనివార్యమని నిశ్చయమైపోయింది.

కొమ్మరాజు బాలచంద్రుణ్ణి సమీపించి - "నాయనా! బాలచంద్రా - నీవు మహావీరుడివి. నిన్ను మించిన మహావీరుడు పల్నాటినాట ప్రభవించడు. నిన్ను కన్నతల్లి అదృష్టవంతురాలు! వరహాల బిడ్డను కన్నది. ఐనా నీవు చిన్నవాడివి! యుద్ధరంగంలోని కిటుకులూ, కీలకాలూ నీకు తెలియవు.

నా మాట విను! చిన్నవాణ్ణి చేసి, నిన్ను ఒక్కుమ్మడిగా - ఒక్కణ్ణే చేసి, సంహరించాలని శత్రువులు ప్రయత్నిస్తారు. రణరంగలక్ష్మి రక్తస్నానం చేస్తానంటుంది. తండ్రిలాంటి వాణ్ణి నేను చెప్పింది విను. మహావీరులైన వాళ్ళకే ఒక్కోసారి వళ్ళు జలదరించే సంఘటనలు జరుగుతాయి." అన్నాడు.

ఆ మాటలకు ఫక్కున నవ్వి బాలచంద్రుడు - "కొమ్మరాజా! నీ హితవులు విననందుకు నన్ను నిందించు! రణలక్ష్మి నన్ను ఆవహించివుంది. నాలోని పగ మంటలా మండుతున్న అలనాటి అభిమన్యుడి వలె గురజాల వీరుల గుండెల్లో నిద్రపోతాను.మొక్కవోని ఇంద్రుని వజ్రాయుధంలా, అలరాజు ఇచ్చిన కత్తి నా దగ్గర వున్నది!కారడవిని చిన్న నిప్పు రవ్వ మండించటం లేదా? నేను అంతే! నిప్పురవ్వనై రాజి,రాజి రగిలిరగిలి, జాజ్వల్య ప్రకాశమానమైన మంటనై, గురజాల సైన్యమనే కారడివిని మండిస్తాను. పిరికివాళ్ళ జోలికిపోను. కేవలం వీరులతోనే యుద్ధం చేస్తాను. ముందు నరసింగరాజు తలదరిగి, చరిత్రలో చిరకాలం నిల్చిపోతాను. వీరులు బ్రతికి సుఖాల్ని అనుభవిస్తారు. చచ్చి స్వర్గాన్ని పొందుతారు." అన్నాడు.

బ్రహ్మన్న తన వీరుల్ని చూసి - "లాభం లేదు. చేయి జారింది. బాలుణ్ణి ఆపలేం. యుద్ధం వచ్చి గొంతు మీద కూర్చున్నది. కత్తి పదును మీద మెరుస్తున్నది. వీరులారా వినండి - యుద్ధం జరుగబోతున్నది. బాలుడు నాందీగీతం పాడాడు. భరతవాక్యం ఎవరు, ఎట్లా పలుకుతారో తెలియదు. ఇది దివ్యపుణ్యభూమి! పావన నదీనదాలతో పునీతమైన పుణ్యస్థలి! వీరులు జన్మించిన వీరభూమి! వీరమాతలు ప్రభవించిన నేల ఈ నేల! యుద్ధరంగం నుంచి తిరిగివచ్చిన భర్తలకు రక్తపారాణి దిద్దిన వీరవనితల గన్న దేశం ఇది! మన మీద వైరంతో నాగమ్మ మనలను అష్టకష్టాల పాలు జేసింది.

కొన్ని రణరంగ సూత్రాలున్నాయి. చేత ఆయుధం లేనివాణ్ణి చంపకండి.పారిపోయేవాణ్ణి క్షమించండి. పుట్ట ఎక్కినవాణ్ణి కొట్టకండి. శరణు అన్నవాణ్ణి కాపాడండి. వృద్ధులను గౌరవించండి. స్త్రీలను చంపకండి.

వీరులారా...బయల్దేరండి...మాచెర్ల ప్రభువులకు విజయం చేకూర్చండి." అన్నాడు.

వీరులు యుద్ధసన్నద్ధులై కదలసాగారు.

బ్రహ్మన్న బాలచంద్రుడి భుజం మీద చేయివేసి - "నాయనా! కాలం నీ మీద మహత్తరమైన భారాన్ని మోపింది. దాన్ని నీ అవక్ర పరాక్రమంతో నిర్వర్తించు. యుద్ధంలో వెనకా ముందులు జాగ్రత్తగా చూసుకో. చాటు దెబ్బలు వేసే చవటలుంటారు. శత్రువుకు వెన్నివ్వకు! అది క్షాత్రం కాదు. రణరంగంలోని కేకలకు చెయ్యి కంపించరాదు. మాచెర్ల చెన్నకేశవుడు నీకు రక్ష! ఈ పుడమితల్లి నిన్ను సదా కాపాడుగాక!"

బాలచంద్రుడి తండ్రి పాదాలను తాకి "తండ్రీ! మీ పేరు నిలుపుతాను." అని యుద్ధరంగం వైపు కదిలాడు.

**********

తెలుగునాట ఇంత గొప్ప యుద్ధం జరినట్లు మరెక్కడా దాఖలు లేదు. కవుల కలాలకు అందనంత గొప్ప పోరు జరిగింది. వర్ణించ నలవిగాని భీకర సమరమది.

అటూ ఇటూ వీరులు కత్తులతో, బల్లాలతో పలుకరించుకున్నారు. రణవాద్యాలు మ్రోగాయి. శంఖాలు పలికాయి. కేకలతో, పెడబొబ్బలతో, కత్తుల మ్రోతతో, ఏనుగుల ఘీంకారాలతో, గుర్రాల గిట్టల చప్పుళ్ళతో కారెంపూడి రణక్షేత్రం మ్రోగిపోయింది.

నరసింగుడు జాతి ఏనుగునెక్కి, యుద్ధక్షేత్రానికి వచ్చాడు. అసంఖ్యాక సేనావాహిని అతని వెంట వున్నది. వీరులైనవారు అతన్ని కాస్తున్నారు.

నరసింగుని చూసి బాలచంద్రుడు భీకరమైన కేక వేసి, శత్రుసైన్యం పై దెబ్బతిన్న బెబ్బులిపిల్లలా హుంకరించి దూకాడు. శత్రువీరులు అతనికి ఎదురొడ్డారు. వారిని కత్తి విసురున కొక్కరిగా నరికాడు.

తలలు, కాళ్ళు, చేతులు తెగి పడ్డాయి.

ఏనుగులు తొండాలు తెగి ఘీకరించాయి.

దెబ్బతిన్న సైనికుల వికృత రోదనలతో యుద్ధరంగం నిండిపోతోంది.

ఆవహించిన వీరత్వంతో, దక్షయజ్ఞంలో పరమశివుడి వలే విజృంభించిన బాలుడు వీరుల్ని పేరుపేరునా పిల్చి మరీ చంపాడు.

రణభూమిలో ఎటు చూసినా బాలచంద్రుడే! అతని ముఖంలో మృత్యుదేవతను చూడసాగారు వైరివీరులు.

కదనరంగంలో కొదమ సింహమై, కాలుడై, అగ్నియై, అసహాయశూరుడై, ఒకడే అనేకులై బాలుడు చేసిన యుద్ధం చెప్పనలవిగానిదయింది.

అతని విజృంభణకు శత్రువుల గుండెలు వణికాయి.

కత్తులు జారిపడ్డాయి.

గుర్రాలు బెదిరాయి.

ఏనుగులు తిరోగమించాయి.

నాగమ్మను గురజాల సైనుకులు తిట్టిపోయసాగారు. నలగాముని అప్రయోజక ప్రభువుగా నిందించసాగారు.

బాలచంద్రుని కరవాలం నుంచి తప్పించుకోవడానికిగానూ పారిపోవడానికి వీలులేని శత్రువులు చచ్చిన జంతువుల కళేబరాల క్రింద నక్కారు. కొందరేమో చచ్చిపోయినట్లుగా నటించారు.

ఇవి తెలిసినా బాలుడు భీరువుల్ని, భయకంపితుల్ని చంపకుండా వదలి ధర్మయుద్ధం చేసాడు.

ఇలా బాలుణ్ణి ఉపేక్షించి లాభం లేదని అనుకున్న శత్రు వీరులు యుద్ధధర్మాన్ని పాటించకుండా గుంపుగూడి బాలుడి చుట్టూ మూగారు.

బాలచంద్రుడు బొంగరంలా గిర్రున తిరిగాడు.

చేతికందిన వారి శస్త్రాస్త్రాలను తన ఖడ్గంతో ఖండించాడు.

కుంతం పట్టి శత్రు గుండెల లోతుల్ని చూసాడు.

తెగిన తలలతో కబుర్లాడాడు.

శత్రువుల చేత చుట్టముట్టబడిన అన్న బాలచంద్రుణ్ణి చూసి, అతని తమ్ములు జగకట్టారు. వారి కత్తుల మోతకు కదనరంగం కంపించింది.

ఇప్పుడు బాలుడు గదాయుద్ధాన్ని చేస్తున్నాడు. పగవారి తలలు 'ఫట్' 'ఫట్' 'ఫట్' మని చిట్లసాగాయి. వీరుణ్ణని కలయబడిన ప్రతి వాడికి భూమ్మీద నూకలు లేకుండా చేసాడు.

ఇది చూసిన నరసింగరాజు తన భటుల్ని పిల్చి "వీరులారా రండి. పదహారేళ్ళ ఒక్క బాలుణ్ణి చంపకపోతే మనకే అప్రతిష్ఠ! యుద్ధభూమి నుంచి పారిపోయినవాడు బ్రతికినా చచ్చినట్టే! భీరువైన వాడు స్త్రీతో సమానం. రండి, రండి!" అని ఎలుగెత్తి అరిచాడు.

నరసింగుని మాటలతో పౌరుషం పొడుచుకొచ్చిన కొంతమంది పారిపోవడాన్ని ఆపి మళ్ళీ యుద్ధరంగంలోకి దూకారు.

అంతా కలిసి ఒంటరిగా వున్న బాలుణ్ణి చుట్టుముట్టారు. అంతమందిని చూసినా బాలుడు అధైర్యపడలేదు.

కత్తికి ముగ్గుర్ని నరికాడు.

బల్లానికి మూడు తలల్ని గుచ్చాడు.

మొత్తం కారెంపూడి రణక్షేత్రం జుగుప్సాకరంగా వుంది. భయానకమైన వాతావరణమది.

నేల నాలుగు చెరగులా నెత్తురుతో తడిసింది. రక్తం కాలువుల్లై ప్రవహిస్తోంది. తెగిన తలలతో నేలంతా పండి రాలిన కాయలతో నిండినట్టుంది. మానవమాంసం ఖండాలుగా పోగులు పడింది. మెదళ్ళు కాళ్ళ క్రింద చితికి పిప్పిగా మారాయి. చచ్చిన శవాల్ని రాబందులు పీక్కుతింటున్నాయి. కంటికి కనిపించిన పిశాచ గణాలు రక్తదాహం తీర్చుకుని, నరమాంసభక్షణతో గుర్రున త్రేంచినట్టు ఏవేవో అరుపులు వినబడ్తున్నాయి. భూత, భేతాళ గణాలతో రణకాళిక వికటాట్టహాసం చేస్తున్నట్టుంది.

చచ్చిన గుర్రాలతో, ఏనుగులతో, పేరు తెలీని పీనుగులతో నిండివున్న కారెంపూడి రణక్షేత్రం నయనభీకరంగా వుంది.

తోటి వీరులు బాలుని ఖడ్గజ్వాలకు ఆహుతి కావడం చూసి, నరసింగరాజు నలగామునిని రక్షణలోకి పరుగెత్తాడు. బాలుడు వెంటబడ్డాడు. పొరబాటుగా, నరసింగరాజులాంటి వాడి తల నరికి, బల్లానికి గ్రుచ్చి బ్రహ్మనాయుడి వద్దకు పరుగెత్తుకు వచ్చాడు. బ్రహ్మన్న బాలుడి వీరరసావతారాన్నీ, బల్లానికి గ్రుచ్చిన శిరస్సునూ చూసి నిశ్చేష్టుడయ్యాడు. తేరిపారి చూసిన తర్వాత "వీడు నరసింగుడు కాడు" అన్నాడు.

అది నరసింగుని తల కాదని తెలుసుకున్న బాలుడు మళ్ళీ రణరంగంలోకి దూకాడు.

************

బాలచంద్రుడు కాసెగట్టి, గోచిపెట్టి "సామంత రాగోల" అనే భయంకరమైన ఆయుధాన్ని చేత ధరించి యుద్ధరంగంలోకి చిచ్చరపిడుగులా మళ్ళీ దూకాడు.

ఐతే బాలచంద్రుని వదిలి అతని తమ్ముళ్లు ఎన్నడు ఉండలేదు. బాలచంద్రుడి వెంటే వున్నారన్నది నిర్వివాదాంశం. అవక్రపరాక్రమంతో రెండవ బాలచంద్రుడిలా విజృంభించినవాడు వెలమల దోర్నీడు. బాలుడు 'సామంత రాగోల'మనే ఆయుధాన్ని పట్టుకుంటే, అతని తమ్ముళ్ళు గదలు ధరించారు. మదమెక్కిన సింహాల్లా శత్రువుల మీదకు దూకారు. దెబ్బతిన్న బెబ్బులుల్లా వీరవిహారం చేసారు.

రణక్షేత్రంనుంచి నరసింగుడు తప్పకుంటే బాలుడు పెద్దగొంతుతో ఇట్లా పిలిచాడు - "పిరికిపంద నరసింగుడెక్కడ్రా? వీరుడైతే - వీరరక్తం వుంటే నా ఎదుట రమ్మనండి. చేవచచ్చిన చవట! ప్రాణభయంతో పారిపోయాడు."

బాలచంద్రుడి ఆడిన మాటల్ని చారుల ద్వారా తెలుగుకున్న నరసింగుడు పౌరుషం తెచ్చుకుని చాలామంది సైనికుల్ని వెంటబెట్టుకుని యుద్ధరంగానికి వచ్చాడు.

నరసింగును చూచిన బాలుడు - "మా అలరాజును చాటుగా చంపిన చవటా! రా! బాహాబాహీ పోరాడుదాం!" అన్నాడు.

నరసింగును కాపాడటానికి వచ్చిన కేరళ రాజు, కుమ్మరి పట్టి చేతుల్లో చచ్చాడు. కర్నాటరాజు కంఠాన్ని దోర్నీడు నరికాడు. మాళవరాజును మంగలి మల్లుడు వేటుకు కూల్చాడు.

అదేక్షణాన బాలచంద్రుడు, నరసింగరాజు ఎక్కిన భద్రగజ కుంభస్థలం మీదకు ఎగిరి దూకాడు. దూకి, సామంతరాగోలతో ఒక్క పోటు పొడిచాడు. నరసింగునికి భుజం భగ్గుమన్నట్టైంది. చూసుకుంటే - రక్తం చిమ్ముతోంది. కత్తివేటు వేసాడు నరసింగు. తప్పకున్నాడు బాలుడు. రెండు

గడియల సేపు జరిగిన ఈ భయంకర యుద్ధాన్ని అటు-ఇటు వీరులు తమ తమ పోరాటాల్ని ఆపి మరీ చూసారు. బాలుడు రానురాను పెచ్చు పెరిగిపోతుంటే, నరసింగు నిర్వీర్యమైపోతున్నాడు.

బాలచంద్రుడు సామంతరాగోలతో నరసింగుడి పొట్టన పొడిస్తే, పేగులు ఆయుధాన్ని చుట్టుకుని బైటకువచ్చాయి. గుండెల్లో గుచ్చితే, గుండె రెండుగా చీలి, వీపు వెనక్కు వచ్చింది. ఆ తర్వాత వేటుకు తల నరికితే, ఏనుగు మీదే ప్రాణం విడిచాడు నరసింగరాజు. అతని చరిత్ర అట్లా అంతమైపోయింది.

**********

మలిదేవుడి సమక్షంలో బ్రహ్మనాయుడు కూర్చుని వుండగా, తెగనరికిన నరసింగరాజు తలను తీసుకెళ్ళి చూపించాడు బాలచంద్రుడు.

అనుగురాజు మరణం తర్వాత నరసింగరాజును తన గుండెల మీద వేసుకొని పెంచాడు బ్రహ్మన్న. ఆఖరుకి తన పుత్రుడి చేతిలో నరసింగుడు మరణించడం భగవంతుని లీలగా భావించాడు బ్రహ్మన్న. 'బలీయమైన విధి నిన్ను 'విధిగా' ఈ విధంగా బలి తీసుకున్నదా నాయనా' అని ఆక్రోశించాడు. 'నీ అన్నదమ్ములు, అసంఖ్యాక బలగం మధ్యలో నీ చావు ఇట్లా వ్రాసిపెట్టబడివుందా?" అని అన్నాడు.

అంతట బాలచంద్రుడు చిరునవ్వు నవ్వితే, కుపితుడైన బ్రహ్మన్న - "బాలచంద్రా! గొప్ప వీరుణ్ణనుకుంటున్నావా? సిగ్గులేకపోతే సరి! నీ మూలాన ఈ యుద్ధం వచ్చి దాపురించింది. పిలవని పేరంటంగా వచ్చి ఈ పవిత్రభూమిని రక్తమయం చేసావు. దొంగచాటుగా వేటువేసి నరసింగుని చంపావు. దుర్మార్గుడా!" అన్నాడు.

బాలచంద్రుడు మండిపడి "పేరిందేవికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను! అలరాజు ఆత్మకు శాంతి చేకూర్చాను. అసలు ఈ యుద్ధానికి కారణం నువ్వు! నువ్వే మలిదేవుని పెళ్ళి పిలుపుకు వెళ్ళి మెత్తని ప్రభువు ఆజ్ఞ జవదాటడనే గర్వంతో కోడిపందానికి ఒప్పుకొని ప్రభువుల్ని అరణ్యాల పాలుజేసావు. భట్టును రాయబారానికి పంపక అలరాజును పంపి నాగమ్మ కుతంత్రానికి బలిపెట్టావు. యుద్ధరంగానికి కదలి వచ్చి, ఇప్పుడు ధర్మాలు ఉపదేశించావు! పనులన్నీ నీవు చేసి నా మీద నిందలు మోపటం తగదు! నరసింగుని వీరోచితంగా యుద్ధం చేసి చంపాను. నేను ముమ్మాటికీ వీరుణ్ణే!" అన్నాడు.

"ఛీ! పిరికిపందా! ఒక్క శత్రువు చంపి, తలపట్టుకుని వచ్చి, నీ వీరత్వాన్ని ప్రచారం చేసుకుంటున్నావే! యుద్ధం ఇంకా జరుగుతూనేవుంటే పేరు కోసం ఆశపడి శత్రువుకు వెన్నిచ్చి వస్తావా?" అన్నాడు బ్రహ్మన్న.

బ్రహ్మన్న పలికిన హీనమైన మాటలకు కించపడి బాలచంద్రుడు మళ్ళీ యుద్ధరంగానికి పరుగెత్తాడు.

అప్పటికే చాలా ఘోరాలు జరిగిపోయాయి.

వీరులైన సోదరులలో ఒక్కరూ జీవించిలేరు. కారెంపూడి రణక్షేత్రంలో రణచండి కాళ్ళకు తమ రక్తంతో పారాణిని అద్ది వెళ్ళిపోయారు. కలకాలం చెప్పుకోగల వీరగాధలుగా మిగిలిపోయారు.

తనను నమ్ముకుని వచ్చిన, తనలో తాముగా పెరిగిన ఆరుగురు సోదరులు మరణించాక, బాలచంద్రుడి ఉద్రేకానికి అంతులేకుండా పోయింది. చేత దొరికిన ఆయుధంతో అడ్డువచ్చిన ప్రతివాణ్ణి నరికాడు.

వీర అభిమన్యుణ్ణి తలచుకొని యుద్ధం చేసాడు. ఒకడు దొంగచాటుగా బల్లెంతో బాలుడి కడుపులో పొడిచాడు. బాలుడు బాధను ఓర్చుకుని, దాహంతో గంగధార మడుగుకు వచ్చి, నీరు త్రాగి, బైటకొచ్చిన ప్రేవుల్ని లోపలి దోసి, అవి కదలకుండా నడుముచుట్టూ ఉత్తరీయాన్ని బిగియగట్టి మళ్ళీ యుద్ధరంగంలోకి ఉరికాడు.

సాయం సూర్యుడు పడమట కొండ చాటున దాగి, బాలుణ్ణి ఒంటరిని జేసి దొంగ దెబ్బలతో కొడుతున్న వైరి వీరుల్ని చూసి, తలవంచుకున్నాడు.

ఆంధ్ర వీరభారతి కన్న అపురూప వీరుడు, బాలచంద్రుడు, భగవంతునిలో కలిసిపోయాడు.

సూర్యుడు అస్తమించిన తర్వాత, లోకం చీకటిని కప్పుకుంది. కన్ను తెరచినా కనిపించని గాఢాంధకారం! బాలచంద్రుడి మరణవార్త విన్న పెదమలిదేవుడు పసిపిల్లవానిలా కంటికి కడివెడుగా ఏడ్చాడు.

బ్రహ్మన్న కడుపులో మంట మండుతున్నది.

(బాలచంద్రుడి వీరమరణం తర్వాత ఒక "దీర్ఘ నిశ్వాసం" విడుస్తూ కవి చక్రవర్తి జాషువా గారు, తమ ఖండ కావ్య సంపుటిలో ఇలా వ్రాసారు..

**"నాయకురాలి మాయ కదనంబున, మా పలనాటి పౌరుష**
**శ్రీ యడుగంటె? గడ్డి మొలిచెం బులిచారల గద్దె మీద; గెం**
**జాయ మొగాన గ్రమ్మ జలజ ప్రమదామణి నాగులేటిపై**
**వాయుచున్న దిప్పటికి బాలుని శౌర్య కథా ప్రబంధముల్ "**

పల్నాటి చరిత్ర జరిగిన ఇన్నేళ్ళకు సమీక్ష చేస్తే కనిపిస్తున్న నగ్నసత్యమిదే.)

భర్త మరణవార్త మేడపిలో విన్న వీరపత్ని మాంచాల పురుషవేషం ధరించి, జాతి గుర్రాన్నెక్కి, ఆఘమేఘాల మీద యుద్ధభూమికి వచ్చి, రణరంగంలో ప్రళయకాళికలా విజృంభించి, బరిసెపోటుకు నేలకూలి భర్త ప్రక్కకు దొరలుకుంటూ వచ్చి మరణించింది.

మాంచాలవంటి వీరపత్నుల రక్తంతో తడిసి పునీతమైన ఈ పుణ్య తెలుగుభూమిలో పుట్టినందుకు గర్వించని తెలుగువాడెవ్వడు? గౌరవంతో తల వాల్చి తల యూచని వాడెవ్వడు?

వీరత్వం నివాళిపట్టిన తెలుగు ఆడపడచుల కథలను విని కరుగని తెలుగు గుండె కలదా?

మాంచాల మరణమొక కథగా ఆచంద్రతారార్కం అట్లా నిలిచిపోతుంది.

(ఐతే - అనపోతు బ్రతికివుంటే బాలచంద్రుడు మరణించేవాడు కాదేమో? అనే ప్రశ్న వస్తుంది. కానీ అట్లా జరుగలేదు కదా!)

**********

బాలచంద్రుడి మరణం తర్వాత మహోదగ్రుడైన కొమ్మనాయుడు రణరంగంలోకి వచ్చాడు. వీరనాయకులకు పేరుపేరునా మ్రొక్కాడు.

కొమ్మరాజు యుద్ధరంగంలో కొచ్చేసరికి యుద్ధ పరిస్థితి పూర్తిగా తల్లక్రిందులయింది. నలగాముని సైన్యం భయంతో హాహాకారాలు చేసింది.

కొమ్మరాజు ద్రోణాచార్యుడంతటి విలువిద్యా ప్రవీణుడు. నిష్ఠాగరిష్ఠుడైన శివభక్తుడు. అంతేగాక యుద్ధరంగపు మెలకువలు తెలిసినవాడు. అటువంటి వాడు యుద్ధరంగానికి వచ్చాడన్న వార్త వినగానే నాగమ్మ కాళ్ళు చల్లబడ్డాయి. కొమ్మరాజుకు ఎదురునిలబడి యుద్ధం చేయగల్గిన

వాడెవడూ తమ పక్షంలో లేడు. "తను యుద్ధరంగానికి వచ్చి నిలబడివున్నాననీ, ధైర్యముంటే వచ్చి కాచుకో"మని కబురుపంపాడు కొమ్మరాజు.

దానితో కొమ్మరాజు సాటి కాకపోయిన, తన దగ్గర వున్న వాళ్ళలో ఎన్నదగ్గ విలుకాడైన 'సోమశేఖరుడనేవాణ్ణి పిలిపించాడు నలగాముడు. ఈ సోమశేఖరుడే అనుగురాజు బిడ్డలందరికీ విలువిద్య నేర్పింది. సోమశేఖరుడు చాలమంది వీరుల్ని వెంటబెట్టుకుని యుద్ధరంగానికి బయలుదేరాడు.

యుద్ధంలో కొమ్మరాజు విలువిద్యా ప్రావీణ్యతను చూసి సోమశేఖరుడికి మతి చెడింది. అర్జునుడు అమ్ములపొదిలోంచి బాణాలను వదిలినట్లు కొమ్మరాజు యుద్ధం చేస్తుంటే శత్రువులు బాణానికొక్కరుగా నేలకూలుతున్నారు. అతని యుద్ధం చూసిన ప్రజలకు అదొక చిత్రంగా కనిపించింది.

సోమశేఖరుడు తన వెంట తెచ్చుకున్న సైన్యం సర్వనాశనం కాగానే బెంబేలెత్తిపోతే, నాగమ్మ ధైర్యం చచ్చిపోయింది. ఐనా, ఇంకొంతమంది బలగాన్ని తీసుకెళ్ళమని సోమశేఖరుణ్ణి హెచ్చరించింది. కొమ్మరాజు యుద్ధం చేస్తున్నాడని విని, అతని తమ్ములు నలుగురు "అన్నా! నువ్వు తప్పకొని విశ్రాంతి తీసుకో! ఈ సోమశేఖరుణ్ణి మేము ముగిస్తాం" అన్నారు.

కొమ్మరాజు తమ్ములు చూపించిన అవక్ర పరాక్రమానికి దెబ్బతిన్న సోమశేఖరుడు సైన్యాన్ని సమాయత్తపర్చి - "ధర్మయుద్ధంలో ఈ వీరుల్ని గెలవలేము గనుక అధర్మ యుద్ధం చేసైనా కొమ్మరాజును హతమార్చండి." అన్నాడు.

యుద్ధాన్ని కొనసాగిస్తున్న తమ్ముళ్ళ దగ్గరకు కొమ్మరాజు వచ్చి వారిని కాసేపు విశ్రాంతి తీసుకోమన్నాడు.

కొమ్మరాజు యుద్ధరంగానికి తిరిగిరాగానే సోమశేఖరుడు అధర్మయుద్ధాన్ని మొదలుపెట్టాడు.

సోమశేఖరుడికీ, కొమ్మరాజుకీ ఘోరమైన యుద్ధం జరిగింది. కొమ్మరాజు సోముడి తలను నరికాడు.

కానీ, ఈలోపు, విశ్రాంతి తీసుకుంటున్న కొమ్మరాజు తమ్ముళ్ళని వెనుకపోటుగా బల్లాలతో పొడిపించి చంపించింది నాగమ్మ.

తమ్ముల మరణ వార్త విన్న కొమ్మరాజు అవిశ్రాంతంగా పోరాడాడు. నాగుబామై, జాతి అశ్వాన్ని ఎక్కి విజృభించాడు. నాగమ్మ ఎన్ని వ్యూహాలు పన్నినా కొమ్మరాజును నిలువరించడం అసాధ్యమని స్పష్టమైపోయింది.

కొమ్మరాజు మీద వేలాదిగా సైనికులు వచ్చిపడుతున్నా ఆ మహావీరుణ్ణి ఎవరూ ఎదిరించి గెల్వలేకపోయారు.

అయితే అలరాజు హత్యతో, బాలచంద్రుడి మరణంతో, తమ్ముళ్ళ చావుతో తన "కళ్యాణరాజ" వంశం అంతమైపోయిందన్న దుగ్ధతో కొమ్మరాజు అస్త్రసన్యాసం చేసి యుద్ధరంగంలో శత్రువుల చేత బాణాలతో కొట్టించుకుని మరణించాడు.

పల్నాటి వీర భారతంలో కొమ్మరాజు మరణంతో మరో ధృవతార రాలిపోయింది.

కొమ్మరాజు మరణవార్త విన్న పెదమలిదేవుడు "కోడిపందాలతో మొదలైన పోరు ఆఖరుకు కొమ్మరాజును కూడా బలి తీసుకున్నది. అలరాజు, బాలచంద్రుడు, బాదన్న, యాదన్న, పేర్నీడు లాంటి మహావీరులను దాయాది పగలతో కారెంపూడికి బలిపెట్టాను. ఎందుకీ తుచ్ఛ జీవనం? ఇంతమంది వీరులను పోగొట్టుకొని, నేను పాలించేదేమిటి? ఎవరి కోసమీ విజయం?" అని విరక్తుడై,

అన్నపానాదులు మాని, మౌనవ్రతం పాటించి దేహత్యాగం చేసుకుని ఈ ప్రపంచం నుంచి శాశ్వత నిష్క్రమణను పొందాడు.

పెదమలిదేవుడి మరణంతో నాగమ్మ చాలా సంతోషపడి "ప్రభువు మరణించాడు. విజయం మనదే! ఇక ఒకే ఒకడు మిగిలివున్నాడు. అతనే బ్రహ్మన్న! అతణ్ణి బంధిద్దాము." అంది.

బ్రహ్మన్నకు దీటైనవాడైన "పచకుల బ్రహ్మన్న" అనేవాణ్ణి పిలిచి బ్రహ్మనాయుడి మీదకు ఉసిగొల్పాడు నలగాముడు.

బ్రహ్మన్న - పచకుల బ్రహ్మన్న ఇద్దరూ ఒక గురువు దగ్గర విద్య నేర్చుకోవటం వల్ల బ్రహ్మనాయుడికి తన సహాధ్యాయి పై యుద్ధం చెయ్యటం ఇష్టం లేకపోయింది. కానీ పచకుల బ్రహ్మన్న బాగా కవ్వించటం వల్ల కుంతం పట్టుకుని ఉత్తమాశ్వాన్ని ఎక్కి బ్రహ్మనాయుదు యుద్ధరంగంలోకి కాలు పెట్టాడు.

బ్రహ్మనాయుణ్ణి చూసిన పచకుల బ్రహ్మన్న - "ప్రజలు నిన్ను భగవంతుడిగా ఆరాధిస్తున్నారు. ధైర్యం వుంటే నాతో యుద్ధం చెయ్యి" అన్నాడు.

అందుకు బ్రహ్మనాయుడు నవ్వి "పచకుల బ్రహ్మన్నా! గురువు తండ్రిలాంటివాడు. మనమిద్దరం ఒకే గురువు దగ్గర అస్త్ర, శస్త్ర విద్య నేర్చుకున్నాం. కాబట్టి నువ్వు నా సోదరుడు వంటి వాడివి. అలా నిన్ను చంపితే నాకు పాపం వస్తుంది. నా మాట విని వెళ్ళిపో!" అన్నాడు.

పచకుల బ్రహ్మన్న హేళనగా నవ్వి "నీ పిరికితనం కప్పకో ప్రయత్నిస్తున్నావు. యుద్ధం చెయ్యి. ఇన్ని మాటలెందుకు?" అన్నాడు.

బ్రహ్మన్న "ఇది నీ తుది నిర్ణయమా?" అని ప్రశ్నిస్తే "ఔను" అని పచకుల బ్రహ్మన్న బదులు చెప్పి బ్రహ్మనాయుని మీదకు కత్తి విసిరితే తప్పుకుని ఒక్క వేటు వేస్తే పచకుల బ్రహ్మన్న తల సర్రున త్రెగి కిందపడింది.

తన సహాధ్యాయిని చంపుకున్నందుకు బ్రహ్మన్న విచారపడి "నీకు కలకాలం వీరపూజ జరిగేట్లు నేను చూస్తాను. వీరగంధం ఈ పల్నాట నీ పేరు మీద తొలుత ఇచ్చే కట్టుదిట్టం చేస్తాను" అని అన్నాడు.

పచకుల బ్రహ్మన్న మరణాన్ని చూసి నలగాముని సైనికులు కంపించిపోయారు.

బ్రహ్మన్నతో యుద్ధం చెయ్యగల్గిన వీరులెవరూ మిగిలిలేరు

గురజాల వైపు మిగిలిన ముఖ్యుల్లో ఒకరు నలగాముడు. మరొకరు నాగమ్మ. మాచెర్ల వైపు మిగిలిన వారు బ్రహ్మనాయుడు; మాల కన్నమదాసు.

దాదాపు ఈ యుద్ధానికి ఇదే ముగింపు అని చెప్పొచ్చు. కానీ ముగింపు ముందు నాగమ్మ బ్రహ్మనాయుడి దగ్గరకెళ్ళి - "వీరత్వముంటే నాతో యుద్ధం చెయ్యి బ్రహ్మన్నా!" అన్నది.

"నేను స్త్రీలతో యుద్ధం చెయ్యను" అన్నాడు.

"నేను యుద్ధరంగంలో వీరనారిగా నీ చేతిలో చావాలనుకుంటున్నాను" అన్నది నాగమ్మ.

బ్రహ్మన్న శాంత గంభీర స్వరంతో "నాగమాంబా! ఈ పల్నాటి సర్వనాశనానికి కారణమై, నీ కుత్సితమైన ఆలోచనలతో, స్వార్థపర చింతనతో సహజంగా మంచివాళ్ళైన గురజాల ప్రభువులను తోలుబొమ్మలు చేసి ఆడించావు. నీవు జరిపించిన ఈ మారణహోమంలో వయోవృద్ధులైన కొమ్మరాజు మొదలైన వారినుండి ముక్కుపచ్చలారని పసిబాలురు అలరాజు, బాలచంద్రుడు,

అతని తమ్ముళ్ళ వరకూ ఆహుతయ్యారు. స్వార్థం, ద్వేషం, మోసం ఎక్కడి దాకా దారితీస్తుందో భావి తరాలకు నువ్వు నిరూపించావు. మతం పేరుతో లేనిపోని ద్వేషాలను రగిలించావు. పుణ్యసంపాదన చెయ్యాల్సింది పోయి లోకాన్ని పాపపంకిలం చేసావు. దీన్ని నా చెన్నకేశవుడే కాదు నీవు నమ్మిన పరమశివుడు కూడా హర్షించడు. పో! ఇకనైన బుద్ధి గలిగి, రాగద్వేషాలను వదలి, ఆధ్యాత్మిక సాధనతో నీ శేష జీవితాన్ని ముగించు." అన్నాడు.

మొండిపట్టుకు మారుపేరైన నాగమ్మ విషపు నవ్వొక్కటి నవ్వి కత్తి పైకెత్తితే, కుపితుడైన బ్రహ్మన్న కుంతంతో నాగమ్మ గుర్రాన్ని ఒక్కపోటు పొడిస్తే అది విలవిలా తన్నుకు చచ్చింది. "స్త్రీ హత్యకంటే జంతు వధే మేలని తలచాను కనుక బ్రతికి పోయావు. ఇకనైనా యుద్ధరంగాన్ని వీడి వెళ్ళు" అని అధికారయుతంగా ఆదేశించాడు బ్రహ్మన్న.

నాగమ్మ భయంతో అక్కడినుంచి పారిపోయింది.

అంతట బ్రహ్మన్న నలగాముణ్ణి ఎక్కడున్నా పట్టుకుంటానని ప్రతిజ్ఞ చేసాడు. తన ఓటమి తప్పదని తెల్సుకున్న నలగాముడు ప్రాణభయంతో "కొదమగండ్ల" అనే చోటుకు పారిపోయి ప్రాణ రక్షణ గావించుకొన్నాడు.

తన ప్రజల రక్తంతో తడిసిపోయిన స్మశానంలాంటి కారెంపూడి రణక్షేత్రాన్ని చూసి, దుఖం తన్నుకొచ్చిన బ్రహ్మన్న ప్రతిజ్ఞను విడిచిపెట్టి తపస్సు చేసుకోవడానికి వెళ్ళిపోయాడు.(తపస్సు కోసం 'గుత్తికొండ బిలం' అనే గుహలోకి బ్రహ్మన్న వెళ్ళాడన్న మరో కథనం కూడా ఉంది). ఆనాటి పల్నాటి ప్రజలు బ్రహ్మన్నను భగవంతునిగా పూజించారట. కానీ ఇది ఉత్ప్రేక్ష మాత్రమే. ఏదిఏమైనా, బ్రహ్మన్న వల్ల అప్పటి సమాజానికి గొప్ప మేలు జరిగిందన్నది నిర్వివాదాంశం.

నాగమ్మ, బ్రహ్మన్న చెప్పిన విధంగా తన శేషజీవితాన్ని శివ సాన్నిధ్యంలోనే గడిపింది.

వీరులైన తమ భర్తలు యుద్ధంలో మరణించాక, మేడపిలోని వారి భార్యలు ఆత్మాహుతి చేసుకున్నారు.

అలా పచ్చని పల్నాడు హత్యలతో, వీరమరణాలతో, ఆత్మాహుతులతో మహాస్మశానమైపోయింది.

క్రూరమైన ఆలోచనలు ఎలాంటి నరకాన్ని సృష్టిస్తాయో అని చెప్పడానికి సోదాహరణంగా మిగిలిందీ పల్నాటి వీర భారతం.

మారుతున్న కాలంతో బాటు పల్నాడు కూడా మారిపోయింది. కానీ వీరపూజలు పోలేదు. వీరగాధలు పూర్తిగా కనుమరుగు కాలేదు. ఎంత మారినా, ఎంత ముందుకు పోయినా, మన జాతినీ, చరిత్రనీ మర్చిపోలేము.

**********

**<u>ముగింపు మాటలు:</u>**

ఈ కథలో మన చరిత్ర ఉంది. గుర్తుపెట్టుకోవాల్సిన అంశాలు ఎన్నో వున్నాయి. నేర్చుకోవలసిన పాఠాలూ ఉన్నాయి.

ఇంతటి చేవగల్గిన తెలుగు వీరగాధ పొట్టికూటి కోసం పాటలు, పద్యాలు పాడుకునే వాళ్ళ నోళ్ళలోనే నిలబడిపోవడం శోచనీయమైన విషయం. దీన్ని తల్చుకుంటే బాధ వేస్తుంది.

**********

## ~ పల్నాటి వీరభారతం - సమాప్తం ~